మార్కాపురం డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడటం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి నడుస్తున్న తంతు నేటికీ నిర్భీతిగా కొనసాగుతూనే ఉంది. కాసులు విదిలిస్తుండడంతో అధికార యంత్రాంగం వాటి కట్టడికి వెనుకంజ వేస్తోంది. ఏవో చిన్నపాటి కేసులు నమోదు చేస్తూ తాము సమర్థంగా పనిచేస్తున్నామని ఉన్నతాధికారుల వద్ద కింది స్థాయి అధికారులు ఉనికిని చాటుకుంటున్నారు. పెద్దస్థాయిలో జరుగుతున్న వ్యవహారాల జోలికి మాత్రం వెళ్లకుండా నిద్ర నటిస్తున్నారు. డివిజన్‌లోని ప్రధాన పట్టణాల్లో పేకాట, వ్యభిచారాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా అందుకు లాడ్జీలు వేదికగా మారాయి. అందులో కూడా సింహభాగం వైసీపీ నాయకులకు చెందిన వాటిల్లోనే ఈ తంతు నిర్విరామంగా కొనసాగుతోంది.

ఆపేదెవరు?

- పేకాట.. వ్యభిచారం.. కేరాఫ్‌గా లాడ్జీలు
- మార్కాపురం, పొదిలిలో జోరుగా నిర్వహణ
- మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్న పోలీసులు
- వైసీపీ హయాం నుంచి నిర్విరామంగా కొనసాగింపు
- కొత్త అధికారులు వచ్చినా ఇంకా ఆ వైపు దృష్టిపెట్టని వైనం

మార్కాపురం, సెప్టెంబరు 11 : మార్కాపురం డివిజన్‌లోని మార్కాపురం, పొదిలి తదితర పట్టణాల్లో చిన్నాపెద్దవి కలిపి సుమారు 100 వరకు లాడ్జీలు, హోటళ్లు ఉన్నాయి. 90 శాతానికిపైగా వాటిల్లో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా మార్కాపురం పట్టణంలోని పలువురు ప్రముఖులకు చెందిన లాడ్జీల్లోనే ఈ తంతు అధికంగా నడుస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పనిచేసిన అధికారులు కొందరు కొంతమేర కట్టడి చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జూదం, వ్యభిచారాలు మూడు పువ్వులు ఆరుకాయలుగా నడిచాయి. అధికారులు మారుతున్నా కిందిస్థాయి సిబ్బందికి ఈ వ్యవహారాలు తెలిసి జరుగుతున్నవనేది సత్యం.

మామూళ్లతో నిబంధనలకు నీళ్లు

లాడ్జీల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాలు జరగకుండా పోలీసులు పలు నిబంధనలు పెట్టారు. ప్రధానంగా హోటళ్లల్లో రూము అద్దెకు తీసుకుంటే తప్పకుండా ఆధార్ కార్డు ఇవ్వాలి. అంతేకాక ఆడా, మగ అయితే వాళ్లు భార్యాభర్తలా అనేది పరిశీలించి మాత్రమే ఇవ్వాలి. మరీ ముఖ్యంగా ముగ్గురికి మించి ఒకే రూములోకి అనుమతించకూడదు. ఎన్ని గంటలకు వాళ్లు రూము తీసుకున్నారు, ఎప్పుడు ఖాళీ చేశారు తదితర వివరాలు తప్పక రిజిస్టర్‌లో పొందుపర్చాలి. లాడ్జీలను పోలీసులు క్రమంతప్పకుండా పరిశీలించి నిబంధనల మేరకు నడుస్తున్నాయో లేదో చూడాలి. సీసీ కెమెరాలు ఉండాలి. అవేవీ సక్రమంగా ఉండటం లేదు. నిబంధనలను పట్టించుకోకుండా ఉండేందుకు ప్రతి లాడ్జీ యాజమాన్యం నెలవారీగా పోలీసులకు మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. అంతేకాక ఉన్నతాధికారులు ఎవరైనా వచ్చినప్పుడు, ప్రధాన నాయకుల పర్యటనలు ఉన్నప్పుడు ఉచితంగా రూములు ఇస్తుండటంతో వారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

అనైతిక పనులకు పెద్దమొత్తంలో వసూలు

లాడ్జీల్లో రూములు తీసుకుంటే వచ్చే అద్దె తక్కువే. అదే అసాంఘిక కార్యకలాపాలకు ఇస్తే తక్కువ సమయంలో ఎక్కువ అద్దె వస్తుంది. మార్కాపురం, పొదిలి పట్టణాల్లోని లాడ్జీల్లో ఈ అక్రమ తంతు జోరుగా సాగుతోంది. ప్రధానంగా మద్యపానం కోసం ఎక్కువగా రూములు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. లాభసాటి వ్యాపారం కావడంతో కొందరు భవనాలు అద్దెకు తీసుకుని లాడ్జీలుగా మార్చుకుని నడుపుతున్న పరిస్థితి. కొందరు రెండు, మూడు లాడ్జీలు కూడా నిర్వహిస్తుండటం గమనార్హం.



బస్టాండ్ ఎదురు లాడ్జీల్లో యథేచ్ఛగా..

పొదిలి పట్టణంలో బస్టాండ్ ఎదురుగా ఉండే లాడ్జీల్లో ఈ అక్రమ తంతు యథేచ్ఛగా కొనసాగుతోంది. వ్యభిచారం, పేకాట, మద్యపానం ఇక్కడ సర్వసాధారణమే. జిల్లాలో మధ్య ప్రాంతంలో ఉండటం, 24 గంటలు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో పొదిలిలోని లాడ్జీలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఎవరైనా ప్రయాణికులు కుటుంబంతో ఆయా లాడ్జీల్లోకి వెళ్లాలంటే జంకాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మరీ ముఖ్యంగా మందుబాబుల ఆగడాలు ఆయా లాడ్జీల్లో అన్నీ ఇన్నీ కావు. ఇంత జరుగుతున్నా పోలీసులు మా త్రం చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

కాలేజీ రోడ్డులో వైసీపీ నాయకుని కనుసన్నల్లో..

మార్కాపురంలోని కాలేజీ రోడ్డులో ఓ వైసీపీ నాయకునికి రెండు లాడ్జీలు ఉన్నాయి. ఒక దాంట్లో వ్యభిచారం, మరొక దాంట్లో పేకాట జూదం నడుస్తోంది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. చివరికి ఒక లాడ్జీలో సంఘంలోని కొందరు పెద్ద మనుషులతో లాడ్జీ యజమాని వ్యభిచారం చేయిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రధానంగా ఓ ఎముకల వైద్యుడు సంపాదనే ధ్యేయంగా అసాంఘిక వ్యవహారాలను స్వయంగా చేయిస్తున్నట్లు తేలింది. తన పార్టీ వాళ్లు కాకపోయినా అప్పట్లో ఓ మాజీ ప్రజాప్రతినిధి వారిని కాపాడారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ నాయకుడు పూర్తిస్థాయిలో రెండు లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించాడు. అధికారపార్టీ నాయకుడు కావడం అవసరమైనప్పుడు గదులు ఇస్తుండటం, నెల మామూళ్లు ఠంచనుగా పంపడం తదితర కారణాలతో పోలీసులు ఆ వైపు కన్నెత్తిచూసిన పాపానపోలేదు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటాం


యు.నాగరాజు, మార్కాపురం డీఎస్పీ



మార్కాపురం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా లాడ్జీల్లో జరిగే పేకాట, వ్యభిచారం విషయంలో సమాచారం తెలిస్తే ఉపేక్షించేదిలేదు. నిరంతర నిఘా ఉంచుతాం. ఈ వ్యవహారాల్లో సిబ్బంది పాత్ర ఉన్నా వదిలేది లేదు.


కోర్టు కూడలి సమీపంలో భారీగా పేకాట శిబిరం

మార్కాపురం కోర్టు కూడలి సమీపంలో జిల్లాలోనే అత్యంత పెద్దదైన పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం. గతంలో లాడ్జీగా ఉన్న ఆ భవంతిలో ప్రస్తుతం వైద్యశాల నడుస్తోంది. దాని పైఅంతస్థులో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్న ఓ పెద్ద హాలులో దశాబ్దకాలంగా జూదం డెన్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మాత్రమే నడిచే ఈ శిబిరంలో రూ.లక్షల్లో చేతులు మారుతాయి. ఆ శిబిరానికి పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్న పలువురు తరచూ వస్తుంటారు. పోలీసులతోపాటు ఎవరు అధికారంలో ఉన్నా ఆ పార్టీ నాయకులకు పెద్దమొత్తంలో మామూళ్లు ముట్టజెప్పడం ఆ భవంతి యజమానికి ఆనవాయితీ. అంతేకాక రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో కూడా సత్సంబంధాలు ఉండటంతో ఎవరూ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. గతంలో కొందరు ఈ వ్యవహారంపై జిల్లా పోలీసు అధికారికి ఫిర్యాదు చేసినా స్థానిక అధికారులు తాము అక్కడ పరిశీలిస్తే అలాంటివి ఏమి జరగనట్లు నివేదికలు ఇచ్చిన సంఘటనలు ఉన్నాయి.



నేడు జిల్లాకు సీఎం చంద్రబాబు

- మద్దిరాలపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం
- మధ్యాహ్నం 2.30 గంటలకు గ్రామంలోకి రాక
- రాత్రికి రాత్రే ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- మంత్రి స్వామి, ఎమ్మెల్యే బీఎన్ పర్యవేక్షణ



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం మధ్యాహ్నం జిల్లాకు రానున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వస్తున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో జరగనున్న కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆయన హెలికాప్టర్‌లో వస్తారు. చదలవాడలోని శ్రీవిష్ణు విల్లాస్‌లో ఉన్న హెలిప్యాడ్‌లో దిగుతారు. సమీపంలో ఉన్న మద్దిరాలపాడు గ్రామంలోని కొన్ని నివాసాలకు వెళ్లి ప్రజలను కలుస్తారు. తర్వాత గ్రామంలోని అంజనేయస్వామి విగ్రహం వద్ద గ్రామసభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం విజయవాడ వెళతారు. గురువారం రాత్రి 7.30 తర్వాత సీఎం కార్యక్రమ సమాచారం అందడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌లు అధికార యంత్రాంగంతో అక్కడకు వెళ్లి కార్యక్రమానికి కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నారు. మంత్రి బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌లు అధికారులతో మాట్లాడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ పర్యాయం సీఎం అయ్యాక తొలిసారి గ్రామానికి వస్తున్న చంద్రబాబు కార్యక్రమం విజయవంతం కోసం మండల, గ్రామ టీడీపీ నాయకులు గ్రామంలో ప్రచారం చేపట్టారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

డీఈవో అవినీతిపై విచారణ

వారంరోజుల్లో నివేదిక : ఆర్జేడీ

ఒంగోలు(విద్య), సెప్టెంబర్ 19 : వరద బాధితుల విరాళాల్లో డీఈవో సుభద్ర అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై గురువారం పాఠశాల విద్యా గుంటూరు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి విచారణ నిర్వహించారు. డీఈవో అవినీతిపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఫిర్యాదు మేరకు పాఠశాల విద్యా కమిషనరు విజయరామరాజు గుంటూరు ఆర్జేడీని విచారణకు ఆదేశించారు. దీంతో ఆర్జేడీ స్థానిక సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో విచారణ నిర్వహించారు. జిల్లాలో వరద బాధితుల కోసం ఎంత మొత్తం సేకరించారు, ఆ నిధులను దేనికి వినియోగించారు, ఇంకా ఎంత మొత్తం ఉందని డీఈవోను ప్రశ్నించారు. కలెక్టరు ఆదేశాల మేరకు వరద బాధితుల కోసం రూ.10,99,090 వసూలు చేశామని, తమ వద్ద ప్రస్తుతం రూ.1.75లక్షలు చెక్కు ఉందని డీఈవో చెప్పారు. మండలాల వారీ ఎంత వసూలు చేశారు, ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లకు ఎంత ఖర్చు చేశారు, మొత్తం జమా ఖర్చులను సమర్పించాలని ఆర్జేడీ ఆదేశించారు. డీఈవో కార్యాలయం, సమగ్రశిక్ష కార్యాలయాల్లో ఎంతమంది టీచర్లను డిప్యుటేషన్ వేశారని, ఆ ఫైళ్లు తన ముందుంచాలని ఆదేశించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులలో జరిగిన అవినీతిపైనా విచారించారు. ఆ అవార్డుల ఫైళ్లు, టీచర్లకు రావాల్సిన ప్రయోజనాలను తన ముందుంచాలన్నారు. ఆ ఫైళ్లను పరిశీలించారు. సెయింట్‌థెరిస్సా, ఎయిడెడ్ హైస్కూలు ప్రభుత్వంలో విలీనమైనందున ఉపాధ్యాయులను, సిబ్బందిని ఒకటి రెండు రోజుల్లో కౌన్సెలింగ్ నిర్వహించి వారికి నియామకపు ఉత్తర్వులు ఇవ్వాలని డీఈవోను ఆదేశించారు.

అన్నిఫైళ్లు పరిశీలన

విచారణ నివేదికను వారం రోజుల్లో పాఠశాల విద్యా కమిషనర్‌కు అందజేయనున్నట్లు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఫిర్యాదులోని ప్రతి అంశంపై విచారణ నిర్వహించామని, సమగ్ర నివేదికను రాస్తామని చెప్పారు. ఫిర్యాదులోని అంశాలపై అన్ని ఫైళ్లను పరిశీలించినట్లు చెప్పారు. ఐటీ సెల్ నియామకాలు గురించి మాట్లాడుతూ పరిశీలించి నియమిస్తామన్నారు. ఐటీ సెల్‌ను బలోపేతం చేసేందుకు తాజాగా ప్రతిపాదనలు కోరామని ఆయన చెప్పారు. విచారణకు డీఈవో సుభద్ర, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఫిర్యాదు చేసిన టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షులు మన్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పూర్ణచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు హాజరయ్యారు.

ముసిలో ఇసుకాసురులు



- రాత్రి సమయంలో అక్రమ రవాణా
- పెద్ద పెద్ద గుంతలు పెట్టి మరీ తవ్వకాలు
- మొద్దునిద్రలో సంబంధిత అధికారులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 19 : ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ముసిని గుల్ల చేస్తున్నారు. మండలంలోని మద్దులూరు ఊరి చివరనున్న వాగులో బావులను తలపించేలా తవ్విన పెద్దపెద్ద గుంతలే నిదర్శనం. ఇసుక కోసం భారీగా గోతులు తీయడంతో చుట్టుపక్కల పొలాల్లోని బోర్లల్లో జలాలు అడుగంటుతున్నాయి. దీంతో సాగునీటి సమస్య తీవ్రతరం అవుతోంది. అక్రమార్కులను నిలదీస్తే.. ఎవరికెళ్లాల్సినవి వారికెళ్తున్నాయని, మీరేం చేస్తారని ఎదురుదాడులకు దిగుతున్నట్లు సమాచారం. అధికారులు సైతం మిన్నకుండిపోతున్నారు. అడ్డుకునే వారు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఇసుకను ఇష్టారీతిన తోడుకుని వెళ్తుండటంతో ముసి కళావిహీనంగా మారింది.


భూగర్భజలాలు పడిపోతున్నాయి

మద్దులూరు ఊరి చివరనున్న ముసిలో స్థాయికి మించి గోతులు తీయడంతో ప్రతి ఏటా భూగర్భజలాలు పడిపోతున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను నివారిస్తే వేసవిలో పంటలకు సాగునీరు పుష్కలంగా అందే అవకాశముంది. అయితే రాత్రిళ్లు ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తుంటే సంబంధిత శాఖ అధికారులకు తెలిసిన కూడా ఏమి అనకపోవడం గమనార్హం. వారికి చేరాల్సినవి ఠంచన్‌గా వెళుతుండటంతో ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రివేళ నిఘా పెట్టించాం:

- ఎం.దేవకుమార్, ఎస్సై, సంతనూతలపాడు

రాత్రి సమయంలో ట్రాక్టర్లు తిరుగుతున్నాయని తెలియడంతో పోలీసులతో నిఘా పెట్టించాం. అదీ కాక మద్దులూరు ఊరి చివరనున్న ముసి కొండపి మండలానికి చెందిన అనకర్లపూడి పరిధిలో ఉంది. అయినా సరే అక్కడి నుంచి మండలంలోకి ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.



ఇసుక బావులను తలపిస్తున్న పెద్ద గుంతలు

జనసేనలోకి బాలినేని



డిప్యూటీ సీఎం పవన్‌తో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

- కొత్త నేత కోసం వైసీపీ వేట
- ఆ పార్టీ ఎంపీపీలు, జడ్పీటీసీలే టార్గెట్‌గా మాజీమంత్రి అడుగులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనలో చేరేందుకు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. త్వరలో ఒంగోలులో జరగబోయే ఒక కార్యక్రమంలో బాలినేని జిల్లాలోని తనతో నడిచే వైసీపీలోని అనుచరులతో జనసేన తీర్థం పుచ్చుకోనున్నారు. బుధవారం వైసీపీకి రాజీనామా చేసిన బాలినేని గురువారం సాయంత్రం మంగళగిరిలో పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యారు. సుమారు గంటసేపు వారి మధ్య చర్చలు జరిగాయి.

ఒంగోలులోనే చేరిక కార్యక్రమం

బాలినేని సూచనతో ఒంగోలులో జరిగే కార్యక్రమంలోనే ఆయనను పార్టీలో చేర్చుకునేందుకు పవన్‌కల్యాణ్ అనుమతిచ్చారు. గతంలోనే మీ విషయాన్ని పరిశీలించాం.. జగన్‌తో మీకు ఉన్న బంధుత్వం దృష్ట్యా మిమ్మల్ని ఆహ్వానించలేదని పవన్‌కల్యాణ్ అన్నట్లు సమాచారం. ప్రస్తుతం మీరే వచ్చినందున మా పార్టీ తరఫున స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారి మధ్య రాజకీయ చర్చలు జరిగనట్లు సమాచారం. పార్టీలో పదవులు కాని ఇతరత్రా విషయంలో గాని వారి మధ్య చర్చలు జరగలేదని తెలుస్తోంది. తనతో కొంతమంది పార్టీలోకి వస్తారని బాలినేని చెప్పగా వారిని కూడా చేర్చుకునేందుకు పవన్‌కల్యాణ్ అంగీకరించినట్లు తెలిసింది. దీంతో బాలినేని ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో తనను అనుసరించే నాయకులతో గురువారం రాత్రే మంతనాలు ప్రారంభించారు. ప్రధానంగా వైసీపీకి చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీల్లో తనకు అనుకూలంగా ఉన్న ఎక్కువమందిని జనసేనలోకి తీసుకెళ్లే ఆలోచనలో ఆయన పావులు కదుపుతున్నట్లు తెలిసింది.

నాతో చాలామంది వస్తారు : బాలినేని

తనతోపాటు జనసేనలో చేరేందుకు జిల్లాలోని పలువురు వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నారని బాలినేని తెలిపారు. వారందరినీ కలుపుకొని పార్టీలో చేరతానని వెల్లడించారు. పవన్‌కల్యాణ్‌తో కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ చూపిన ఆదరణ పట్ల సంతోషంగా ఉందన్నారు. విశ్వసనీయత అంటూ మాటలతో జగన్ నాయకులను మోసం చేశారని ఆరోపించారు. ఆయన పార్టీ పెట్టగానే తనతోపాటు 17 మంది పదవులు వదులుకొని పార్టీలో చేరితే మంత్రివర్గ విస్తరణలో వారందరినీ పక్కన పెట్టారని చెప్పారు.

సురేష్, బూచేపల్లిపై వైసీపీ దృష్టి

జిల్లాలో పార్టీ బాధ్యతలు అప్పగించే విషయంలో మాజీ మంత్రి సురేష్, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిలవైపు జగన్ దృష్టిసారించినట్లు తెలిసింది. తొలి ప్రాధాన్యత బూచేపల్లికి ఇచ్చినట్లుగా సమాచారం. జిల్లాకు చెందిన ఒక ముఖ్య నాయకుడు సురేష్‌కు జిల్లా వైసీపీ అధ్యక్ష బాధ్యత ఇస్తే బాగుంటుందని ఆయనకు సూచించినట్లు తెలిసింది. జగన్ సురేష్‌కు రాష్ట్ర కమిటీలో బాధ్యతలు ఇచ్చి బూచేపల్లిని జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తే బాగుంటుందని అన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆ పార్టీలో సీనియర్ నాయకుల్లో ఎక్కువమంది పార్టీ అధ్యక్ష పదవి తీసుకునేందుకు సిద్ధం కాకపోవటం గమనార్హం. జగన్ జోక్యం చేసుకొని బూచేపల్లి, సురేష్‌లో ఒకరిని ఒప్పిస్తారా లేక వైవీకి పూర్తి బాధ్యత అప్పగిస్తారా.. అన్నది చూడాల్సి ఉంది.

ద్వితీయశ్రేణిపైనే దృష్టి

ఒంగోలులో ఇప్పటికే టీడీపీలో చేరిన వారిని వదిలేసి మిగిలిన వైసీపీ కార్పొరేటర్లతో కూడా చర్చలు జరిపారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ముఖ్య నేతలను పక్కనపెట్టి వైసీపీలోని కింది స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులపైనే ఆయన ప్రధానంగా దృష్టి పెట్టినట్లు సమాచారం. కొండపి నియోజకవర్గానికి చెందిన వైసీపీ మాజీ ఇన్‌చార్జి ఒకరు కూడా ఆయనతో జనసేనలోకి వెళ్లేలా పరిస్థితి కనిపిస్తోంది. ఇక ఇద్దరు ఎమ్మెల్యేల్లో బూచేపల్లితో ఆయనకు అంతర్గతంగా కొన్ని మనస్పర్థలు ఉన్నాయి. వైపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు బాలినేనితో అవినాభావ సంబంధాలు ఉన్నాయి. కానీ ఎమ్మెల్యేలను అటు టీడీపీ ఇటు జనసేన కానీ తీసుకునే ఉద్దేశంలో లేనట్లు తెలుస్తోంది. దీంతో బాలినేని కూడా ముందుగా ద్వితీయ శ్రేణి నాయకులను జనసేనలోకి తీసుకెళ్లే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. మంచిరోజు చూసుకొని పార్టీలో చేరతానని పవన్‌కల్యాణ్‌కు సూచించిన బాలినేని.. మూడు తేదీలను ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. వచ్చేనెల 4వతేదీ లేక మరో రోజు ఒంగోలులో జరిగే సభలో పవన్ సమక్షంలో ఆయన పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే ఆయా నియోజకవర్గాల్లో వైసీపీకి భారీగానే షాక్ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి.



కనిగిరిలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నఎమ్మెల్యే ఉగ్ర



మార్కాపురంలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నఎమ్మెల్యే కందుల

మరో మూడు అన్న క్యాంటీన్లు ప్రారంభం

జిల్లాలో ఎనిమిదికి చేరిన సంఖ్య

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో మరో మూడు అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. దీంతో జిల్లాలో అన్న క్యాంటీన్ల సంఖ్య ఎనిమిదికి చేరింది. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ల ప్రారంభానికి శ్రీకారం పలికింది. ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి ఇప్పటికే నడుస్తున్నాయి. గురువారం కనిగిరిలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహరెడ్డి, గిద్దలూరులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతులమీదుగా క్యాంటిన్లు ప్రారంభమయ్యాయి. పేదలకు రూ.5కే భోజనం, టిఫిన్ క్యాంటీన్‌లో అందిస్తారు.



గిద్దలూరులో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

పారదర్శకంగా ఇసుక సరఫరా : సీఎం

● వర్చువల్‌గా ప్రారంభించిన చంద్రబాబు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 19: ప్రజలకు ఉచితంగా ఇసుకను పారదర్శకంగా సరఫరా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ విధానంలో ప్రజలు ఇసుకను బుక్ చేసుకునేందుకు వీలుగా రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజలకు తక్కువ రేటుకు ఇసుకను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకొచ్చిందని, క్షేత్రస్థాయిలో ఉచిత ఇసుక పాలసీని పటిష్టంగా అమలయ్యేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాలసీ ప్రకారం ఇసుకను ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఇంటి వద్దకే డెలివరీ చేసే సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. దీనికోసం కేవలం రవాణా, నిర్వహణ ఖర్చులను మాత్రమే వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇసుకను పొందడానికి గనులు, భూగర్భశాఖచే ప్రత్యేక ఏపీ శాండ్ పోర్టల్‌ను రూపొందించినట్లు చంద్రబాబు వివరించారు. వర్చువల్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జేసీ ఆర్.గోపాలకృష్ణ, మైనింగ్ డీడీ జగన్నాథరావు, లారీ యాజమాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వర్ణాంధ్ర-2047పై సమీక్షించారు. సమావేశంలో జిల్లా ముఖ్యప్రణాళికాధికారి డి.వెంకటేశ్వర్లుతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

25నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 19: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యాశాఖ సహకారంతో ఈనెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభం కానున్నాయని జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సీహెచ్.జయప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరిగే పోటీలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు సైన్స్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పాఠశాల స్థాయిలో ప్రతి తరగతిలోను మొదటి స్థానం పొందిన విద్యార్థులను ఎంపిక చేసి ముగ్గురిని అక్టోబరు 1న జరిగే మండల, పట్టణ స్థాయి సైన్స్ పరీక్షలకు పంపుతామన్నారు. వివరాలకు 9010649886, 8500232432 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

సంతనూతలపాడు, సెప్టెంబరు 19: ఎండ్లూరు డొంకవద్ద గల ఎన్‌టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారకేంద్రంలో పెయింటింగ్, హ్యాండ్‌ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సులపై ఈనెల 25వ తేదీ నుంచి మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు మహిళాప్రాంగణం జిల్లా మేనేజర్ వై.అంజమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు 18-45 మధ్య వయస్సు కలిగి ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత ధృవీకరణ పత్రాలు 3 పాస్‌పోర్ట్ సైజుఫొటోలు తీసుకురావాలని, పూర్తి వివరాలకు 8333921346 సెల్ నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

సింగరాయకొండ, సెప్టెంబరు 19 : మండలంలోని పాతసింగరాయకొండ జడ్పీ హైస్కూల్‌లో గురువారం స్వచ్ఛ తా హి సేవ కార్యక్రమం లో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చే యించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

210 మందికి గుండె వైద్యపరీక్షలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మనోజ్‌కుమార్

నాగులుప్పలపాడు సెప్టెంబరు 19 : గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తెలుగుయువత ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ వైద్యశాల సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత గుండె వైద్యశిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తెలుగుయువత నాయకులు మెగా వైద్యశిబిరం ద్వారా ఖరీదైన గుండె వైద్య పరీక్షలు ఉచితంగా అందించేలా చేయడం అభినందనీయమని చెప్పారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైద్యులు సాయికుమార్ 210మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 50మందికి మెరుగైన వైద్యం అం దించాలని సిఫార్సు చేసినట్లు హెల్ప్ వైద్యశాల పీఆర్వో శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ జయమ్మ, మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, క్లస్టర్ ఇంచార్జ్ గుమ్మడి సాయిబాబా, గ్రామ అధ్యక్షుడు కాట్రగడ్డ చంద్రబాబు, ఐ టీడీపీ మండలాధ్యక్షులు బెల్లం వెంకటేశ్వర్లు, కనగాల శ్రీనివాసరావు, జనసేన నాయకులు బాలిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

VEHICLE FOR SALE

VEHICLE NO	VEHICLE DESCRIPTION	YEAR
AP07TB-5659	TATA LPT 3118 CUMMINS FBT	2011
AP39NS-6330	ETIOS GD DIESEL 5 SEATER	2015

AUCTION DATE : 20-09-2024

SHRIRAM AUTO MALL INDIA LIMITED

Doddavarappadu(V&PO), Maddipadu(M), ONGOLE, Prakasam(DT), 99498 29182, 95737 11099

SRINIVASA EDUCATIONAL SOCIETY'S

PACE INSTITUTE OF TECHNOLOGY & SCIENCES

(AUTONOMOUS)

Approved by AICTE, Accredited by NBA & NAAC(A Grade), Recognized under 2(f) & 12(B) of UGC Permanently Affiliated to JNTUK, Kakinada. A.P., An ISO 9001:2015 Certified Institution NH-16, Near Valluramma Temple, ONGOLE - 523 272, A.P., INDIA, Ph.: 08592 278315, 9581456310 | www.pace.ac.in

SPOT ADMISSIONS EAPCET - 2024

Eligible candidates, who wish to join in I-Year B.Tech., for the academic year 2024-25 are hereby informed to attend Spot Admissions at 10.00 a.m on **23-09-2024** at college premises with all original certificates and fee. The vacant seats including left over Cat 'B' seats arising out of non-reporting will be filled up after completing internal sliding. Candidates admitted under Spot Admissions are not eligible for tuition fee reimbursement.

* The vacant seats will be filled as per the guidelines of the A.P State Council of Higher Education.

☎ 9581456310 PRINCIPAL



త్వరలో మహిళా అర్బన్ మార్కెట్

● కమిషనర్ వెంకటేశ్వరరావు



పొదుపు మహిళల ఉత్పత్తులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 19 : త్వరలో ఒంగోలులో స్థల సేకరణ చేసి మెప్మా అర్బన్ మార్ట్‌లు ఏర్పాటు చేయనున్నట్లు నగర కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక అద్దంకిబస్టాండ్‌లోని మెప్మా జిల్లా కార్యాలయం ఆవరణంలో పొదుపు మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాలు, ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మార్కెట్‌ను సందర్శించి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మెప్మా మార్కెట్‌ను ఏర్పాటు చేసి, నగర ప్రజలకు అతి తక్కువ ధరలకే వారు తయారు చేసిన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అందుకు అనుగుణంగా ముందస్తు ప్రచారం నిర్వహించి, పొదుపు సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. పీడీ రవి కుమార్ మాట్లాడుతూ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృతస్థాయి మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మార్కెట్‌లో వస్త్రాలు, ఆభరణాలు, ఆహారపదార్థాలు, అమ్మకాలు జరుగుతాయని, జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలలో అర్బన్‌మార్కెట్‌లను అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. కార్యక్రమంలో సీఎంఎం కొండయ్య, సీవోలు మరియమ్మ, రూపాలక్ష్మి, రమణమ్మ, రాజేశ్వరీ, రత్నకుమారి, రవీంద్రర్, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి

● రాష్ట్ర నాయకుడు తులసిరెడ్డి పిలుపు

● డీసీసీ అధ్యక్షుడుగా సైదా ప్రమాణం



సైదాతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న తులసిరెడ్డి

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 19: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎన్.తులసిరెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం ఒంగోలులోని డీసీసీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా షేక్ సైదాతో ఆయన ప్రమాణాస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతు జగన్ పార్టీ కాలగర్భంలో కలవబోతుందని చెప్పారు. అందుకే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలిచేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2029లో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా, షర్మీలారెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు ఇప్పటి నుంచే పనిచేయాలని కోరారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు విస్మరించిందని విమర్శించారు. డీసీసీ అధ్యక్షుడు సైదా మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఐక్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తనకు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన షర్మిలారెడ్డి, రాహుల్‌గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మస్తాన్‌వలి, పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాష్, దాసరి నాగలక్ష్మి, కైపు వెంకటరెడ్డి, విజేష్‌రాజ్, ప్రసన్నరాజు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని యువకుడు మృతి



గాయాలతో పడివున్న ఉన్న సంతోష్

సింగరాయకొండ/టంగుటూరు, సెప్టెంబరు 19 : మోటార్ సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సింగరాయకొండలోని జాతీయ రహదారిపై కలికివాయి ఫ్లైవోవర్ సమీపంలోకి ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు మేరకు.. టంగుటూరు అరుంధతీవాడకు చెందిన సంతోష్ (25) కలికివాయి ఫ్లైవోవర్ సమీపంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ పక్కన టిఫిన్ దుకాణాన్ని నడుపుకుంటున్నారు. తాగునీరు తెచ్చుకోవడానికి బైక్‌పై రోడ్డు దాటుతుండగా కావలి వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో సంతోష్‌కి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంతోష్ పరిస్థితి విషమంగా మారి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై బి.మహేంద్ర సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతుడికి ఆరు నెలల క్రితమే వివాహం

సంతోష్‌కు పెళ్లి జరిగి పట్టుమని ఆరు నెలలు కాలేదు. అప్పుడే ఆ ఇంట్లో విషాదం నిండింది. తండ్రి చనిపోవడంతో మృతుని సోదరుడే సంతోష్‌ను ముందుకు నడిపించాడు. జీవితంలో కుదురుకుంటున్నాడని అనుకొంటున్న తరుణంలో బస్సు ఢీకొని సంతోష్ మృతి చెందడంతో అరుంధతీవాడ ఒక్కసారిగా ఘొల్లుమంది. ఈ సంఘటన కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేసింది. భార్య కన్నీరుమున్నీరవుతుంది.

రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 19: ఒంగోలు నగరం కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న రెడ్‌క్రాస్ భవనంలోని బ్లడ్ బ్యాంకును గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ప్రకాష్‌బాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. అనంతరం బ్లడ్ బ్యాంకులోని ఆధునిక పరికరాల పని తీరును కలెక్టర్ పరిశీలించారు. బ్లడ్ బ్యాంకుకు వచ్చేందుకు మున్సిపల్ ఫిల్టర్ బెడ్ నుంచి మరో మార్గాన్ని కూడా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇక రెడ్‌క్రాస్ నిధుల కొరత గురించి కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తక్షణమే మెంబర్షిప్ డ్రైవ్ నిర్వహిస్తానని, మైనింగ్ సెస్ నిధులు, సీఎస్ఆర్ నిధుల కోసం ఉత్తర్వులు ఇస్తానని కలెక్టర్ అన్సారియా తెలిపారు. కార్యక్రమంలో సెట్ప్ సీఈవో లోకేశ్వరరావు, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ సి.వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి డి.రాఘవ, సభ్యులు బి.వి.రెడ్డి, కత్తి శ్రీనివాసరావు, శ్రీరామ్ రెడ్డి, ప్రసన్న రాజు, జనార్దన్, ఇక్బాల్, న్యామతుల్లాబాషా, పవన్, మారెళ్ల సుబ్బారావు, మెడికల్ ఆఫీసర్ కృష్ణ, ఏవో సుధాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ అక్రమ రవాణా

ఎస్సై దాడి చేశారంటూ ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 19: ఎలాంటి బిల్లులు లేకుండా గ్రానైట్ లారీలు అక్రమంగా తరలిపోతున్నాయని కొంతమంది ఫిర్యాదు చేయగా తమపై ఎస్ఐ దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈమేరకు వారు గురువారం ఒంగోలులో ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈనెల 17న చినారకట్ల జంక్షన్ వద్ద కొంత మంది గ్రానైట్ లారీని ఆపి బిల్లులు ఉన్నాయా అని అడిగారు. దీంతో లారీడ్రైవర్ అనధికారికంగా లారీలను ఆపిన వారి మధ్య గొడవ జరిగింది. ఈ సమాచారం తెలుసుకున్న పొదిలి ఎస్ఐ వచ్చి అక్కడ ఉన్న గ్రానైట్ లారీలను పంపించి వేసి, అనధికారికంగా లారీలు తనిఖీలు చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖరరెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలో తమపై ఎస్ఐ దాడి చేశారని ఆరోపిస్తూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై పొదిలి ఎస్ఐ వేమనను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తనకు అందిన సమాచారం మేరకు చినారకట్ల జంక్షన్‌కు తాను వెళ్లానని అక్కడ అనధికారికంగా లారీలు ఆపుతూ గొడవలకు కారణమైన వారిని అదుపులోకి తీసుకొని బైండోవర్ చేసి వదిలివేసినట్లు చెప్పారు. అలాగే గ్రానైట్ లారీలకు అందుకు సంబంధించి బిల్లులు ఉన్నాయని, అందుకే వాటిని పంపించి వేసినట్లు ఆయన తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం

● ఏఎస్పీ శ్రీధర్‌రావు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఏఎస్పీ శ్రీధర్‌రావు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 19: రక్తదానం చేయటం ద్వారా తోటి వారికి ప్రాణదాతలుగా నిలుస్తామని ఏఎస్పీ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పువ్వాడి దామోదర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొమ్మి నరసింహారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో క్విస్ కళాశాల, లా కళాశాల విద్యార్థులు, యువమోర్చా కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శ్రీధర్‌రావు రక్తదానం చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పీవీ.శివారెడ్డి, రవిశంకర్, కృష్ణారెడ్డి, యోగయ్య, సురేష్, నాయక్, రాము, శ్రీనివాసరావు, రామకృష్ణ, బత్తిన మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇరువురు యువకుల దుర్మరణం

మద్దిపూడి, సెప్టెంబరు 19 : మండలంలోని వల్లాయపాలెం రహదారిలో మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. కొనకనమిట్ల మండలంలో చింతగుంట గ్రామానికి చెందిన ఆదిమూలం సుధీర్ ఐదురోజుల క్రితం భార్యతో కలిసి అత్త ఊరైన వల్లాయపాలెం వచ్చాడు. బుధవారం పొదిలిలో స్నేహితుని వివాహానికి మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. రాత్రి 8 గంటల తరువాత కూడా తిరిగి రాకపోవడంతో మద్దిపూడి పరిసర ప్రాంతాల్లో వెతికారు. అయినప్పటికీ ఆచూకి లభించలేదు. గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన కొందరికి స్థానిక ఎస్సీకాలనీ సమీపంలో వల్లాపాలెం రోడ్డుకు ఉత్తరం వైపున మోటార్‌సైకిల్‌తోపాటు యువకుని మృతదేహం కనిపించింది. వెంటనే సమాచారాన్ని ఎస్ఐ రమేష్‌బాబుకు చేరవేశారు. మృతుని భార్య చిట్టి మృతదేహం తన భర్తదేనని గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేర్నమిట్టలో మరొకరు..

సంతనూతలపాడు: పేర్నమిట్టలో గురువారం రాత్రి 9-30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పేర్నమిట్టకు చెందిన మొలతోటి భానుప్రకాష్(24) ఒంగోలు నుంచి బైక్‌పై వస్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. దీంతో భానుప్రకాష్ తల పగిలిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విరాళాల సేకరణ

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితుల కోసం కనపర్తి గ్రామస్థులు విరాళాలను సేకరించారు. గ్రామానికి చెందిన ఉద్యోగులు, గ్రామస్థులు కలిసి గురువారం తోపుపాలెం, పల్లెపాలెం, మేకలసోమయ్యపట్టపుపాలెం, గోవిందరాజులపాలెం గ్రామాల్లో విరాళాలను స్వీకరించారు. కార్యక్రమంలో తుపాకుల సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాసరావు, పీతా చంద్రశేఖర్, జి.శ్రీనివాసరావు, ఏసురత్నం, నటరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండలస్థాయి ఆటల పోటీలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 19: సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో ఈనెల 21వ తేదీ నుంచి జరిగే మండల స్థాయి ఆటల పోటీల్లో ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు పాల్గొనవచ్చని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎస్.ఉమామహేశ్వరి తెలిపారు. గురువారం స్థానిక హైస్కూల్లో మండలస్థాయి క్రీడా పోటీల గురించి సన్నాహక సమావేశంలో మండలంలోని పీడీ, పీఈటీలలో చర్చించి తీర్మానించారు. పోటీల్లో పాల్గొనదలిచిన వారు పీడీలు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునలను కలవాలని తెలిపారు.

అవీ..ఇవీ..

నేటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా

● సీడీపీవో ఇవాంజిలిన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంతనూతలపాడు, సెప్టెంబరు 19: కందిపప్పు సరఫరా లేనందువలనే ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, ఎన్.జిపాడు మండలాల్లోని 286 అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ సక్రమంగా అమలు కాలేదని సీడీపీవో ఇవాంజిలిన్ తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూకు మంగళం అనే కథనానికి ఆమె స్పందించి వివరణ ఇచ్చారు. గత నెల, ఈనెల కందిపప్పు సరఫరా లేకపోవడంతో ఆకుకూరలు, కూరగాయలతో అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు వండిపెడుతున్నట్లు తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు టీహెచ్‌ఆర్‌ను ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు నెలలో రాష్ట్రస్థాయి టెండర్స్‌లో ప్రక్రియ పూర్తి కానందునే కందిపప్పు సరఫరా ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం ఈనెలలో జిల్లాస్థాయిలో తాత్కాలిక టెండర్స్ పూర్తి అయినందున కందిపప్పు ఇండెంట్‌ను అందించినట్లు తెలిపారు. ఈనెల వరకు ప్రస్తుతం స్టాకు కూడా గోడౌన్‌కు చేరుతుందని, శుక్రవారం అంగనవాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా చేస్తామని వివరించారు.

స.హ.చట్టం గురించి తెలుసుకోవాలి

మద్దిపాడు, సెప్టెంబరు 19: సమాచార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఏవో జి.రమేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం మద్దిపాడులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలు సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం ప్రభుత్వ కార్యాలయంలో సమాచారాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు. అనంతరం పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈవో శేషయ్య, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ విగ్రహ నిమజ్జనం

మద్దిపాడు, సెప్టెంబరు 19 : నందిపాడు గ్రామంలో గణేష్ విగ్రహ నిమజ్జనం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో గణేష్ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం డప్పువాద్యాలు, డాన్సులతో సందడి చేస్తూ గుండ్లకమ్మలో నిమజ్జనం పూర్తి చేశారు.

మోటార్‌సైకిల్ ఢీకొని ఒకరికి గాయాలు

మద్దిపాడు, సెప్టెంబరు 19: లింగంగుంట రోడ్డులో గురువారం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. లింగంగుంట నుంచి ఒంగోలు వెళ్తున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి ఒంగోలు నగరం గోపాల్‌నగర్ చెందిన ఆర్.పరమేశ్వరరావును ఢీకొంది. దీంతో ఆయనకు గాయాలు కావడంతో ఒంగోలుకు తరలించారు.

ఉత్సాహంగా విద్యార్థుల ఆటల పోటీలు



క్రీడాకారులతో అధికారులు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 19: ఒంగోలులోని నగరపాలక సంస్థ పాఠశాలల విద్యార్థులకు గురువారం స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా ఆటలపోటీలు నిర్వహించారు. నగరంలోని పీవీఆర్ బాల, బాలికలు, డీఆర్‌ఆర్‌ఎం హైస్కూలు, బాలాజీ నగర్ స్కూలు విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాసాలలో పోటీలు నిర్వహించగా, పీవీఆర్ మైదానంలో వాలీబాల్, కబడ్డీ, పరుగు పందెం, షాట్‌పుట్, పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ వెంకటేశ్వరరావు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కాగా నిరంతరం పుస్తకాలతో కుస్తీ పడే విద్యార్థులు పాఠశాలలో జరిగిన ఆటల పోటీలలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో పీవీఆర్ బాలుర స్కూలు హెచ్‌ఎం రాధిక, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో పోషకాహారం

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 19: ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో పోషకాహారం అందుతుందని ఎంపీడీవో జలజాక్షి చెప్పారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం జరుగుమల్లిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పోషకాహార ప్రదర్శన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లం సత్యనారాయణ, సూపర్‌వైజర్ భారతి, విజయ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండ్లసముద్రంలో...

మద్దిపూడి: తక్కువ ఖర్చుతో ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు లాంటి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని సీడీపీవో మాధవీలత చెప్పారు. గురువారం గుండ్లసముద్రంలోని అంగన్‌వాడీ కేంద్ర ంలో పోషకాహారంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి. సుచరిత, ఎంపీ స్కూల్ హెచ్‌ఎం సువర్ణకుమారి పాల్గొన్నారు.

ఈకేవైసీ గడువు పొడిగింపు

టంగుటూరు, సెప్టెంబరు 19 : మండలంలో ఖరీఫ్ పంటల సాగుపై ఈపంట నమోదు, ఈకేవైసీ రెండు కార్యక్రమాలకు ప్రభుత్వం వారం రోజులు గడువు పెంచింది. ఈ నెల 15వ తేదీ వ రకు అనుకున్న ఈ ప్రక్రియ ను 23 వరకు పొడిగించారు. ఈ పంట నమోదుకు 5005 ఎకరాల విస్తీర్ణంలో 1251 మంది రైతులను గుర్తించారు. గురువారం నాటికి 1202 మందివి ఈకేవైసీ కూడా పూర్తి చేశారు. మిగిలిన వారిలో కొందరు రైతుల ఆధార్‌లు తప్పుగా నమోదయి ఉన్నాయి. శనివారంలోగా వాటిని సరిచేస్తామని ఏఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

AJ ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

WANTED

■ నవయుగ పెట్రోలియమ్స్, త్రోవగుంట లోని కరవది రోడ్డులో గల పెట్రోలు బంకులో పనిచేయుటకు బాయ్స్, గర్ల్స్ కావలెను. సంప్ర॥ సెల్: 9866774691

AJO-190476

ఇంటి ఋణాలు / కార్ లోన్స్

■ ఇంటి మీద, ఖాళీ స్థలాల మీద, వ్యవసాయ పొలాల మీద, బిజినెస్ లోన్స్, అపార్ట్‌మెంట్స్, కారు ఋణాలు తక్కువ వడ్డీకి మొదలగు వాటికి ఇప్పించబడును. సంప్ర॥ 95024 66253.

AJO-190193

సేల్స్ గర్ల్స్ కావలెను

■ ఒంగోల ప్రముఖ ఫర్నీచర్ షాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్స్ కా॥ వయస్సు : 20 to 40లోపు, అర్హత : డిగ్రీ లేద B.Tech Complete. జీతం: 20,000 + ఇన్సెంటీవ్స్. సంప్ర॥ సెల్ : 83744 44414, 90305 90855

AJO-200142

WANTED

■ SR Defence Academy కి ప్రకాశం నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన PRO's, Junior Lecturers కావలెను Qual: Any Degree. Cell: 78933 18282, 63057 89148

AJT-4305

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.

జన్మదిన శుభాకాంక్షలు | వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు

విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు | లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484


స్వాగతం.. సుస్వాగతం...
ఇది మంచి ప్రభుత్వం
ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం
అహర్నిశలు కృషిచేస్తున్న
నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాత గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు
వెల్లువెత్తిన ప్రజాభిమానంతో మళ్లీ సిఎంగా
బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా
ప్రకాశం జిల్లాకు విచ్చేయుచున్న శుభసందర్భంగా
హృదయపూర్వక స్వాగతం.. సుస్వాగతం...
చెరుకూరి రఘుకిరణ్
కిరణ్ ఎక్స్‌పోర్ట్స్
వ్యవస్థాపక అధ్యక్షులు :
రోటరి క్లబ్, చీమకుర్తి
మన్నం నాగరాజు
MNR కన్‌స్ట్రక్షన్స్,
చీమకుర్తి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ముఖ్యమంత్రివర్యులు


స్వాగతం... సుస్వాగతం
ఇది మంచి ప్రభుత్వం
శ్రీ ముప్పవరపు వీరయ్యచౌదరి గారు
మాజీ ఎంపీపీ
నాగులుప్పలపాడు
తెలుగు
దేశాధినేతకు
స్వాగతం...
మీ...
తేళ్ళ మనోజ్‌కుమార్
మండల టీడీపీ అధ్యక్షులు
నాగులుప్పలపాడు మండలం
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ముఖ్యమంత్రివర్యులు
శ్రీ B.N.విజయ్‌కుమార్ గారు
శాసనసభ్యులు, సంతనూతలపాడు


స్వాగతం-సుస్వాగతం
ఇది మంచి ప్రభుత్వం
కూటమి ప్రభుత్వం ఏర్పడి
100 రోజుల పాలనలో జరిగిన
అభివృద్ధి - సంక్షేమంపై "ఇది మంచి ప్రభుత్వం"
అనే కార్యక్రమంలో భాగంగా నేడు సంతనూతలపాడు నియోజకవర్గం
నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి
విచ్చేయుచున్న శుభసందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి
స్వాగతం.. సుస్వాగతం...
మీ...
గుమ్మడి సాయిబాబు
తెలుగుదేశంపార్టీ నాయకులు,
మద్దిరాలపాడు
కాకర్ల లక్ష్మీవరప్రసాద్
కె.తక్కెళ్ళపాడు (చిన్నా)
మండల టీడీపీ కార్యదర్శి
పొద శ్రీధర్‌బాబు
మాజీ ఎంపీటీసీ
టి.అగ్రహారం
మారెళ్ళ శ్రీనివాసరావు
టీడీపీ బిసి నాయకులు
బి.నిడమనూరు
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
శ్రీ B.N.విజయ్‌కుమార్ గారు
శాసనసభ్యులు, సంతనూతలపాడు

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నూతన బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి
- పొదిలిలో భూ ఆక్రమణలపై సమీక్ష



ఆర్టీసీ నూతన బస్సును ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

పొదిలి, సెప్టెంబరు 19 : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో రెండు నూతన సూపర్‌లగ్జరీ బస్సులను ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం వెలిగొండ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ప్రజలకు వినియోగంలోకి తెస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఎంత దూరమైన పోయే వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడన్నారు. అంతేకాకుండా జిల్లా ఏర్పాటుకు కూడా కట్టుబడి ఉన్నామని త్వరలోనే ముఖ్యమంత్రి ప్రకటన చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎం సుందరరావు, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు ఓబులరెడ్డి, కుద్దూస్, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనీల్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఇమాంమ్‌సా, మాజీ సర్పంచ్ డాక్టర్ స్వర్ణగీత, జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు రసూల్, శివాలయం మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, నాయకులు సోమయ్య, నరేష్, బెల్లంకొండ శ్రీనివాసరావు, రాజ, శ్రీదేవి ఆర్టీసీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పొదిలి : పట్టణంలో భూ ఆక్రమణలు పెద్ద ఎత్తున జరిగాయని వాటిని వెలికి తీస్తామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో భూ భూతాలు ఇష్టారాజ్యంగా కాలువలు, డ్రైనేజ్ స్థలాలను ఆక్రమించి కట్టడాలు కట్టి వ్యాపారాలు చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నాయన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మిస్తే సహించేది లేదని హెచ్చరించారు. భూ అక్రమార్కుల భారీ నుంచి ప్రజలను కాపడతా మన్నారు. వాటిని త్వరలోనే పరిశీలించి ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుడతామన్నారు. రూ.120 కోట్లతో ఇంటింటికి కొళాయి ద్వారా తాగునీరు అందించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఫైర్‌స్టేషన్, పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పది రోజుల్లో రెండు కోట్ల నిధులతో ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న ఫైర్‌స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కరూపాయి ఇవ్వలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తాగునీరు, డ్రైనేజ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్య క్రమంలో మున్సిపల్ కమిష నర్ శ్రీనివాసరావు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

మార్కాపురం : విజయవాడ వర ద బాధితుల సహాయార్థం స్థానిక కమలా విద్యాసంస్థల యాజమాన్యం రూ.లక్ష విరాళాన్ని అందించింది. స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిని కలిసి గురువారం విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.పవ న్‌కుమార్ చెక్కును అందించారు. కార్యక్రమంలో అపుస్మా నాయకులు గొట్టం మల్లికార్జున్ రెడ్డి, విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

మార్కాపురం : పేదవారి కడుపు నింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం రాత్రి అన్నా క్యాంటీన్ ప్రారంభించారు. అనంతరం తొలిరోజు పేదలందరికీ అయ్యే ఆహార పదార్థాల ఖర్చును ఆయనే చెల్లించారు. అక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో అల్పాహారం, భోజనం అన్నా క్యాంటీన్ ద్వారా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, షేక్ మౌలాలి, మాలపాటి వెంకటరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

బలిజ సంఘం అధ్యక్షులుగా వెంకటరమణ



కంభం, సెప్టెంబరు 19 : కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవాసంఘం నూతన అధ్యక్షులుగా పగిడి వెంకటరమణను ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. గురువారం కంభంలోని బృందావనం కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పగిడి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఉదయగిరి మల్లికార్జునరావు, ఉపాధ్యక్షులుగా పెద్దిశెట్టి రంగనాయకులు, తాండవ వెంకటేశ్వర్లు, తిప్పిశెట్టి రజనీకాంత్, జాయింట్ సెక్రటరీగా పోలు అనంతరావు, అంకిత ప్రసాద్, కర్నా వెంకటశివశంకర్, గౌరవ సలహాదారులుగా ఆకుల మురళీ, కాల్వ బాలరంగయ్య, సోమిశెట్టి నారాయణ, లంకా.నరసింహారావు, కాసుల రంగస్వామి, మరికొంతమంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంగ రమణ, గోళ్ల రమణ, పార్శ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మొక్కలు అందించాలి

గిద్దలూరు, సెప్టెంబరు 19 : మండలంలోని ముండ్లపాడు సమీపంలో ఉన్న నర్సరీలను ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ తనిఖీ చేశారు. చీడపురుగులు, తెగుళ్ల యాజమాన్యం చేసి నాణ్యమైన మొక్కలను రైతులకు అందించాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. మొక్కల ఎదుగుదలను బట్టి ఎరువులు వినియోగించాలన్నారు. చీడపురుగుల నివారణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విత్తనాలు కొనుగోలు చేయాలన్న, పెంచిన నారును రైతులకు అమ్మే సమయంలో తపపనిసరిగా బిల్లులు ఉండాలన్నారు.

22న వైద్యశిబిరం

గిద్దలూరు, సెప్టెంబరు 19 : పట్టణంలోని నరవ రోడ్డులోని తమ క్లినిక్‌లో ఈ నెల 22న ఉచిత ఫిజియోథెరపి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రంగసాయి ఫిజియోథెరపి నిర్వాహకులు డాక్టర్ పి.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు వైద్యశిబిరం ఉంటుందని, రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సచివాలయంలో రికార్డుల పరిశీలన

గిద్దలూరు, సెప్టెంబరు 19 : పట్టణంలోని అర్బన్‌కాలనీలోని సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పనుల కోసం సచివాలయాలకు వచ్చే ప్రజలను తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి పంపాలని సూచించారు. అర్జీల నమోదుకు ప్రత్యేక రిజిష్టర్లు మెయిన్‌టేన్ చేయాలన్నారు. సచివాలయ పరిధిలో ఉండే వీధుల్లో అపుడప్పుడు తిరిగి సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవచూపాలన్నారు.

ఉయ్యాలవాడ చిత్రపటాల అందజేత

గిద్దలూరు, సెప్టెంబరు 19 : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న ఆంజనేయరెడ్డి, వెంకటేశ్వర్లు అనే ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాలను అందజేశారు. తొలి స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బి.ఎస్.నారాయణరెడ్డి, బీజేపీ కిసాన్‌సెల్ కార్యదర్శి పిడతల రమేష్‌రెడ్డి, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి

పొదిలి, సెప్టెంబరు 19 : అన్నదాతలు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో జైన్‌లుబ్దీన్ కోరారు. గురువారం మల్లవరం గ్రామంలో జరుగుతున్న ఈకేవైసీ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. మండలంలో 32 రెవెన్యూ గ్రామాల్లో 6413 మంది రైతులు 20694 ఎకరాల్లో పంటలు సాగుచేశారన్నారు. వీరిలో 4117 మంది రైతులకు ఈకేవైసీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ నెల 23వ తేదీ వరకు పంటనమోదు, ఈకేవైసీ గడువు విధించిందన్నారు. కనుక రైతులు అందరు త్వరితగతిన చేయించుకోవాలని కోరారు. అనంతరం మల్లవరం గ్రామంలో కంది, సజ్జ పంటలను పరిశీలించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

గిద్దలూరు, సెప్టెంబరు 19 : స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సమాచారహక్కు చట్టంపై ఉద్యోగులకు, రైతులకు అవగాహన కల్పించారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత తెచ్చేందుకు, అవినీతిని అరికట్టేందుకు, జవాబుదారిగా ఉండేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందనని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును ఉపయోగించుకుని ఎలాంటి సమాచారమైన పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, సాంకేతిక వ్యవసాయాధికారులు విజయభాస్కర్‌రెడ్డి, మహబూబ్‌భాషా, విష్ణుప్రియ, పశువైద్యుడు శ్రావణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

గిద్దలూరు, సెప్టెంబరు 19 : పట్టణంలోని సంజీవిని వృద్ధాశ్రమానికి సీఎస్ఐ చర్చి ఫాస్టర్ కృపాకర్ నిత్యవసర వస్తువులను అందించారు. కార్యక్రమంలో దివ్య హెల్పింగ్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు లొక్కు శరత్‌బాబు, చెన్నయ్య, లక్ష్మణ్, వృద్ధాశ్రమం నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

గిద్దలూరు, సెప్టెంబరు 19 : పట్టణంలోని అరుణోదయ ఉన్నత పాఠశాలలో మానసికతత్వవేత్త, మాజీ ముఖ్యమంత్రి బూరుగుల రామక్రిష్ణారావు మనుమడైన రాధాక్రిష్ణారావు ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై ప్రేరణ తరగతులు నిర్వహించారు. ప్రణాళిక బద్ధంగా చదివితే పరీక్షలంటే భయం వీడి పండుగన్న ఉత్సాహంతో హాజరవుతారన్నారు. బద్ధకం, సోమరితనం, అశ్రద్ధ వీడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జింకా చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెన్నంపల్లిలో చోరీ

- రూ.3.5లక్షల విలువైన సొత్తు అపహరణ

కొమరోలు, సెప్టెంబరు 19 : మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో గురువారం వేకువజామున చోరీ చేసి రూ.3.5 లక్షల విలువైన సొత్తును అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాయపాటి భాస్కర్‌రెడ్డికి కొత్తగా నిర్మించిన ఇంటితో పాటు మరో పాత ఇళ్లు ఉంది. బుధవారం రాత్రి పాత ఇంటిలోనే భాస్కరరెడ్డి కుటుంబ సభ్యులు నిద్రించారు. తెల్లవారుజామున నిద్రలేచిన కుటుంబ సభ్యులు కొత్త ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం, బీరువా తాళాలు కూడా తీసి ఉండడం గమనించారు. బీరువాలో వారు దాచుకున్న 4 తులాల బంగారు వస్తువులు, రూ.80 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఘటనపై కొమరోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న గిద్దలూరు సీఐ జే.రామకోటయ్య ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తర్లుపాడు ఎస్‌ఐగా బ్రహ్మనాయుడు

తర్లుపాడు, సెప్టెంబరు 19: తర్లుపాడు ఎస్‌ఐగా పి.బ్రహ్మనాయుడు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో గిద్దలూరు, కొమరోలు, కొనకనమిట్లలో ఎస్‌ఐగా పనిచేసి ప్రస్తుతం ఒంగోలు వీఆర్ నుంచి తర్లుపాడు ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ టి.రాజ్‌కుమార్ కొనకనమిట్ల ఎస్‌ఐగా బదిలీపై వెళ్లారు.

కొమరోలు ఏస్సైగా వెంకటేశ్వర్లు

కొమరోలు, సెప్టెంబరు 19: కొమరోలు పోలీసుస్టేషన్‌లో ఎం.వెంకటేశ్వరనాయక్ గురువారం ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. వెంకటేశ్వర్లు ప్రస్తుతం వీఆర్‌లో ఉండి, ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై మదుసుదన్‌రావు వెలిగండ్ల ఎస్సైగా బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర నాయక్ మండలంలోని శాంతిభద్రతలు కాపాడాలని ప్రజలు కోరుతు న్నారు.

లైసెన్సు లేని టపాసుల పట్టివేత

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 19 : మండలంలోని కే.ఎస్.పల్లెలోని ఒక ఇంటిలో అక్రమంగా నిలువ ఉన్న టపాసులను స్థానిక సీఐ సురేష్ స్వాధీనం చేసుకున్నారు. కెఎస్‌పల్లెలోని నిరంజన్ వ్యక్తి ఇంట్లో లైసెన్సు లేకుండా సుమారు రూ.20వేల టపాసులు ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తికి గాయాలు

మార్కాపురం, సెప్టెంబరు 19: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురికావడంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన గురువారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తాళ్ల దుర్గారావు చేతులు, ఛాతిపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పూలసుబ్బయ్య కాలనీకి చెందిన తర్లుపాడు రోడ్డులోని కరెంట్ ఆఫీస్ వెనుకవైపు ఓ భవనం వద్ద బేల్దారిగా పనిచేస్తున్నాడు. పనిచేసే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఎగిరిపడ్డాడు. వెంటనే స్పందించిన స్థానికులు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. చేతులు, ఛాతిపై తీవ్ర గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 19: స్థానిక మానవ వనరుల కేంద్రంలో నేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు సమాచారహక్కు చట్టంపై అవగాహన

పెద్దదోర్నాల, సెప్టెంబరు 19: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమాచారహక్కు చట్టం-2005పై నేడు అవగాహన కల్పించనున్నట్లు వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం గం.2.30లకు నిర్వహించే సదస్సులో మండల అధికారులు, రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నేటి నుంచి వందరోజుల ప్రజావేదిక

పెద్దదోర్నాల, సెప్టెంబరు 19: ఈ నెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో 'మన ప్రభుత్వంపై వంద రోజుల ప్రజావేదిక' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీకి మండల అధికారులను పర్యవేక్షణాధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. విధిగా ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని అన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా నారాయణరావు బాధ్యతలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 19: మార్కాపురం మున్సిపల్ కమిషనర్‌గా డీవీఎస్ నారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ, మార్కాపురానికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ కిరణ్ మాతృ సంస్థ స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తనను కలిసిన విలేకరులతో కమిషనర్ మాట్లాడారు. తాను మార్కాపురం పట్టణంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పట్టణంలో కుక్కలు, కోతుల బెడద ఎక్కవ ఉందని, వాటిని పట్టివేస్తామన్నారు. ఆవులను రోడ్లపై వదిలి వాటితో ప్రమాదాలకు కారణమవుతున్న ఆవుల యజమానులపై చర్యలు తీసు కుంటామన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు పోలీస్‌శాఖ చేస్తున్న కృషికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. పట్టణంలో సాగర్ జలాల సరఫరా అయ్యేలా దృష్టిసారిస్తామన్నారు. పారి శుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడతామని వివరించారు.

కమిషనర్‌ను కలిసిన టీడీపీ నాయకులు

మార్కాపురం పురపాలక సంఘానికి నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణరావును టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సత్కరించారు. పట్టణంలో సమస్యలు పరిష్కరించాలని అధ్వానంగా ఉన్న పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయణరావు

కమిషనర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్ నాలి కొండయ్య, వక్కలగడ్డ రంగ సురేష్, చిలకపాటి లింగమయ్యలు ఉన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్ల ఏర్పాటు

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



అన్న క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 19 : పేదల ఆకలి తీర్చేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నక్యాంటీన్‌ను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్యాంటీన్ పరిసరాలను పరిశీలించి పలువురికి అన్నం వడ్డించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రూ.5లకే పేదలు కడుపునిండా భోజనం చేసేలా ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా టిఫిన్, భోజనం చేసినా రూ.15తో కడుపు నిండుతుందని అన్నారు. 2014-2019 కాలంలో నాటి టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం వచ్చిన వైసీపీ ఈ పథకాన్ని రద్దు చేసి పేదల కడుపు కొట్టిందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2వ విడతలో 75 అన్నాక్యాంటీన్లను సాయంత్రం ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మొదట విడత 100, రెండవ విడతలో 75 క్యాంటీన్లు ప్రారంభించిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 100 రోజుల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, రైతుసంక్షేమం, నిరుద్యోగ యువతకు ఉపాధి లక్ష్యంగా పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, టీడీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

పట్టణంలోని గణేష్‌నగర్‌లో వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సతీమణి ముత్తుముల పుష్పలీల ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, దప్పిలి కాశిరెడ్డి, పందిళ్లపల్లి శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, మద్దులేటి, రామయ్య మహేంద్ర పాల్గొన్నారు.

బోరుబావుల పరిశీలన

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 19: మండలకేంద్రం దోర్నాలలో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బోరుబావులు పరిశీలించారు. మండలంలో నీటి కొరత అధికంగా ఉండడం, బోర్లు ఒట్టిపోవడం, వాన కురిసిందని ట్యాంకర్లు నిలిపివేయడంతో నీటిసమస్య సర్వసాధారణమైంది. ప్రజల నుంచి నీటిసమస్యపై సంబంధిత అధికారులపై ఒత్తిడి పెరిగింది. కానీ ఇటీవల నల్లమలలో కురిసిన భారీ వర్షానికి వాగులు కాలువలు పెద్దఎత్తున ప్రవహించాయి. దీంతో బోరుబావులకు నీరు సమృద్ధిగా వచ్చిందని ఉన్నతాధికారులు ట్యాంకర్లు నిలిపివేశారు. అయితే ఒకటి రెండు బోర్లలో మినహా మిగిలిన వాటిలో నీరు రావడంలేదు. దీంతో నీటిసమస్య అధికమయింది. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నవకిశోర్, ఏఈ భ్రమరాంబికాదేవి పలు కాలనీల్లోని బోర్లను పరిశీలించారు.

రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలి

బేస్తవారపేట, సెప్టెంబరు19 : ఖరీఫ్ సీజన్‌లో ఈ ఏడాది పంట నమోదు ఈకేవైసీ చేయించుకోవడానికి ఈ నెల 23వ తేదీ వరకు సమయం పొడిగించినట్లు వ్యవసాయాధికారి జె.మెర్సీ తెలిపారు. పంటనమోదు చేయించుకొని రైతులు వారి పరిధిలోని రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పంటనమోదు చేయించుకోవాలని అన్నారు. భవిష్యత్‌లో పంటనష్టం పంట కొనుగోలు, బీమా సౌకర్యం, ఈ-క్రాప్ బుకింగ్ ఆధారంగానే జరుగుతుందన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థాన ట్రస్ట్‌బోర్డు రాజీనామా

మార్కాపురం, సెప్టెంబరు 19: మార్కాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థాన ట్రస్ట్‌బోర్డు రాజీనామా చేసింది. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డికి చైర్మన్ పెనుగొండ కేశవరావు, 8 మంది ధర్మకర్తలు రాజీమానా పత్రాలు అందజేశారు. రాజీనామా పత్రాలను దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణకు బుధవారం సాయంత్రం అందజేసినట్లు ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రస్తుత ట్రస్ట్‌బోర్డు రాజీనామాను ప్రభుత్వం ఆమోదించిన వెంటనే నూతన ట్రస్ట్‌బోర్డు ఏర్పాటుకు మార్గం సుగమంకానుంది.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు



బాలికల రక్తనమోనా సేకరిస్తున్న సిబ్బంది

త్రిపురాంతకం, సెప్టెంబరు 19: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలను మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు రక్తపరీక్షలు చేశారు. రక్తం శాతం తక్కువగా ఉన్న బాలికలకు మంచి పోషకాహారం తినాలని, ఆకుకూరలు, గుడ్లు, పాలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. రాగులు, సజ్జలు, జొన్నలతో చేసిన వంటకాలు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారంలో రక్తహీనతను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.హైమావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనిలో అవకతవకలను ఉపేక్షించం

- పీడీ అర్జున్‌రావు



ప్రజావేదికలో టీఏలతో మాట్లాడుతున్న పీడీ అర్జున్‌రావు

కొనకనమిట్ల, సెప్టెంబరు 19 : ఉపాధి హామీ పథకంలో అవకతవకలను సహించమని డ్వామా పీడీ అర్జునరావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో గత సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై ఆడిట్ బృందాలు గ్రామాల్లో ఆడిట్ చేశాయి. ఆ నివేదికలను ప్రజావేదికలో వెల్లడించారు. గొట్లగట్టు, నాగరాజుకుంట, కొనకనమిట్ల, గరిమినపెంట, చింతగుంట, మంగాపురం, వెలిగండ్ల తదితర గ్రామాలలో ఉపాధిహామీ పనుల మస్టర్లలో కూలీల వేలిముద్రలు లేకుండానే వేతనాలు చెల్లించిన విషయం వెల్లడైంది. అంతేకాకుండా సిద్దవరం, గార్లదిన్నే, వాగుమడుగు తదితర గ్రామాలలో మొక్కలు లేకుండా డబ్బులు చెల్లించినట్లు డీఆర్‌పీలు ప్రజావేదికలో తెలిపారు. ఆయా గ్రామాలలో చేసిన పనులలో నాణ్యత లోపం, కొలతలలో తేడాలను భారీగా గుర్తించారు. పనులకు సంబంధించిన ఏడు రికార్డులను పలు గ్రామాలలో సక్రమంగా నిర్వహించడం లేదని వారిపై మండిపడ్డారు. కార్యక్రమంలో దర్శి క్లస్టర్ ఏపీడీ నిర్మలాదేవి, జిల్లా విజిలెన్స్ అధికారిని ఝాన్సీరాణి, డ్వామా విజిలెన్స్ సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఎంపిడీవో శ్రీనివాసమూర్తి, ఏపీవో బులెన్‌రావు, ఎస్‌ఆర్‌పీ మూర్తి, పలువురు టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 19 : క్రీడాకారులను గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని ఎంపీపీ కడప లక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్, టీడీపీ నేత ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఆదర్శ విద్యాసంస్థల ఆవరణలో ప్రభుత్వ పాఠశాలల గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడలు ప్రారంభించారు. విద్యార్థులకు కబడ్డీ, షటిల్, వివిధ పోటీలో నిర్వహించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి మంచి ఆరోగ్యానికి ఉపయోగపడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ జె.రామయ్య ఎంఈవోలు కె.వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : విద్యార్థుల్లో క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు దోహదపడతాయని ఎంఈవో మస్తాన్‌నాయక్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఆటలపోటీలు గురువారం ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఎంఈవో మస్తాన్‌నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు పీ రామానాయక్, హెచ్ రామానాయక్‌లు పర్యవేక్షించారు. మండలంలోని రామచంద్రకోట, పెద్దబొమ్మలాపురం, ఎగువ చెర్లోపల్లి, మోడల్‌స్కూల్, తిమ్మాపురంలోని ఏకలవ్య, కస్తూర్బా తదితర పాఠశాలల నుండి 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, యోగా, షటిల్ బాడ్మింటన్, ఖోఖో తదితర ఆటల్లో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో నైపుణ్యాలు కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపించనున్నట్లు పీఈటీ రామా నాయక్ తెలిపారు.

మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

పొదిలి : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంఈవో ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కరీమున్ బీబీ ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ అనురాధ, పలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడి షకీలా, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూమార్, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, ఖుద్దూస్‌లు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని గజ్జలకొండ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి క్రీడాపోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు 19, 20 తేదీలలో జరుగుతాయని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొడ్డా రామాంజనేయరెడ్డి తెలిపారు. మండలంలోని 15 ఉన్నత పాఠశాలలలోని విద్యార్థులు సుమారు 350 క్రీడా పోటీలలో పాల్గొన్నట్లు తెలిపారు. క్రీడాపోటీలు నిర్వహించేందుకు 15 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొనే ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ జె కోటేశ్వరరావు, టీడీపీ గ్రామ నాయకులు నారు వెంకటేశ్వరరెడ్డి, చిలకల అశోక్‌రెడ్డి, దాతలు బి రామారావు, రాయ.అప్పారావు, తలపాటి సుధాకర్, క్రీడల మండల సమన్వయకర్త పి.బాబురావు, వెంకటస్వామి, స్కౌట్ మాస్టర్ కొండయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని క్రీడలను ప్రారంభించారు.

ముగిసిన క్రీడా పోటీలు

కంభం : కంభంలో బుధవారం నుంచి ప్రారంభమైన మండలస్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ కంభం పాఠశాల విద్యార్థులు గెలుపొందగా, ఖోఖో చెస్, బ్యాడ్మింటన్ నందు పెద్దనల్లకాల్వ జడ్‌పి బాలుర హైస్కూలు విద్యార్థులు గెలుపొందారు. యోగాలో జడ్‌పీహెచ్‌ఎస్ బాలికలు గెలుపొందారు. వీరందరూ ఈ నెల 21 నుంచి జరిగే గిద్దలూరులో జరిగే నియోజకవర్గ పోటీల్లో పాల్గొనున్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

త్రిపురాంతకం : మండల స్థాయిలో 68వ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను శుక్రవారం మేడపి జడ్పీ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవోలు కేటీ.మల్లికార్జుననాయక్, టి.రాజశేఖరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఆర్‌సీలో పీడీలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ పోటీలలో అండర్-14, అండర్-17 విభాగాలలో బాలబాలికలకు విడివిడిగా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీల కోసం మండల జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో మండలంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు : కొమరోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అండర్ 14, 17 విభాగాల్లోని విద్యార్థులు ఈ నెల 20వ తేదీ నుంచి జరిగే క్రీడల్లో పాల్గొనాలని కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాశయ్య గురువారం తెలిపారు. ఈ క్రీడలు ఏడు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



దోర్నాలలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో, పీఈటీలు



గిద్దలూరులో పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

అస్తవ్యస్తంగా పోలీస్ సర్కిళ్లు

- గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా మార్పులు
- సుదూర ప్రాంతాలకు వెళ్లలేక ప్రజల ఇబ్బందులు

దర్శి, సెప్టెంబరు 19: గత వైసీపీ పాలకుల అస్తవ్యస్త నిర్ణయాలు ప్రజలకు శాపాలుగా మారాయి. ముందు చూపు లేకుండా పలు ప్రభుత్వ శాఖల పరిధులను అడ్డగోలుగా మార్పులు చేయటంతో పరిపాలనా సౌలభ్యం దెబ్బతింది. ఒకే పనికోసం అధికారులు, ప్రజలు మూడు ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దర్శి నియోజకవర్గంలో పోలీస్ సర్కిళ్ల పరిధుల మార్పు, రెవెన్యూ డివిజన్ పరిధుల మార్పులతో ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. గతంలో దర్శి నియోజకవర్గంలోని దర్శి, కురిచేడు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలు దర్శి సర్కిల్ పరిధిలో ఉండేవి. దొనకొండ మండలం మాత్రమే పొదిలి సర్కిల్ పరిధిలో ఉండేది. అన్నీ మండలాల ప్రజలకు దర్శి సబ్ డివిజన్ కేంద్రంగా ఉండేది. ప్రజలకు ఎటుచూసినా 30 కిలోమీటర్లలోపు అన్నీ పోలీస్ కార్యాలయాలు అందుబాటులో ఉండేవి.

గత వైసీపీ పాలకులు ఏడాది క్రితం అడ్డగోలుగా సర్కిళ్ల పరిధులను మార్చారు. దర్శి నియోజకవర్గంలోని కురిచేడు, దొనకొండ మండలాలను ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని త్రిపురాంతకం సర్కిల్ పరిధిలో చేర్చారు. అప్పటినుంచి ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పోలీస్ శాఖలో ఎటువంటి పనికావాలన్నా మూడు ప్రాంతాలకు తిరగాల్సిన దుస్థితి నెలకొంది. అనుమతుల కోసం తొలుత మండలకేంద్రాల్లోని పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తులు చేసుకొని అక్కడి నుంచి త్రిపురాంతకం వెళ్లి సర్కిల్ కార్యాలయంలో పనిచేయించుకొని తిరిగి దర్శిలోని సబ్ డివిజన్ కార్యాలయానికి రావాల్సి వస్తుంది. కురిచేడు, దొనకొండ మండలాలకు త్రిపురాంతకం సుమారు 40 కిలోమీటర్లు దూరం ఉంది.

ఇటీవల జరిగిన గణేష్ ఉత్సవాలకు అనుమతులకు కూడా ప్రజలు మూడు ప్రాంతాల్లో అనుమతులు తీసుకునేందుకు మూడు రోజులు తిరగాల్సి వచ్చింది. వైసీపీ పాలకుల అడ్డగోలు నిర్ణయంతో తీవ్రంగా ఇబ్బందిపడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

ఇబ్బందికరంగా రెవెన్యూ డివిజన్ల పరిధి మార్పు

గత వైసీపీ పాలకులు రెవెన్యూ డివిజన్ల పరిధి అడ్డగోలుగా మార్పులు చేయటంతో అనేక మండలాల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. దర్శి నియోజకవర్గంలోని మూడు మండలా లు కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో, రెండు మండలాలు ఒంగోలు రెవెన్యూ డివిజన్‌లోకి మారాయి. నియోజకవర్గంలోని రెవెన్యూ శాఖలోని పనులు సంయుక్తంగా నిర్వహించాల్సిన పనులకు సంబంధించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించే విషయంలో ఈ సమస్య ఉత్పన్నమైంది. కొన్ని మండలాల్లో రెవెన్యూ పరిధులు కూడా అటుఇటుగా ఉన్నాయి. దీంతో ముండ్లమూరు, తాళ్లూరు మండలాలకు సంబంధించి విషయాలను పరిశీలించాల్సి వచ్చినప్పుడు ఒంగోలు డివిజన్ అధికారులు వస్తున్నారు. దర్శి, కురిచేడు మండలాలకు చెందిన భూముల రైతుల నష్టపరిహారం ఇచ్చేందుకు కనిగిరి డివిజన్ అధికారులు వస్తున్నారు. ఉమ్మడిగా రైతుల సమావేశాలు నిర్వహించేందుకు వేర్వేరుగా రెవెన్యూ డివిజన్ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

గతంలో అన్నీ మండలాలు కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేవి. రెవెన్యూ శాఖలోని పనులకోసం అందరికీ అప్పుడు ఎంతో సౌలభ్యంగా ఉండేది. వైసీపీ పాలకులు నియోజకవర్గంలో కొన్ని మండలాలను కనిగిరి డివిజన్ పరిధిలోకి, మరికొన్ని మండలాలను ఒంగోలు డివిజన్ పరిధిలో మార్చటంతో పనుల కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల ఏర్పాటు కూడా వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా జరిగిన విషయం తెలిసిందే. సీఎం చంద్రబాబు అస్తవ్యస్తంగా మార్పులు చేసిన జిల్లాలను సర్దుబాటు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. రెవెన్యూ డివిజన్ పరిధి, పోలీస్ సర్కిల్ పరిధులను కూడా క్రమబద్ధీకరించి అందరికీ అనువుగా ఉండేలా మార్పులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దర్శిలోని డీఎస్పీ కార్యాలయం

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్‌లు

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 19: ఆకలితో ఏపేదవాడు జీవించకూడదన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాల్లో అన్న క్యాంటీన్‌లు ఒకటని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం రాత్రి నగరంలోని తీగలగొందిలో అన్న కాంటీన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు అన్న కాంటీన్‌లను ప్రారంభించారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి కక్షపూరితంగా వాటిని ఎత్తివేశారన్నారు. కనిగిరిలో అన్న కాంటీన్‌ను నిలిచిపోవటంతో తాను 2019 ఎన్నికల్లో ఓటమి చెందినా ఈప్రాంత పేద ప్రజల కోసం జననీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తన సొంత నిధులతో అమరావతి గ్రౌండ్‌లో అన్న క్యాంటీన్‌ను నిర్వహించి రూ.5లకే భోజనం పెట్టామన్నారు. ఎంత ఆర్థిక ఇబ్బందులు వచ్చినా క్యాంటీన్ నిర్వహించాలనే దృఢ సంకల్పంతో ఉన్నసమయంలో ఎంతోమంది టీడీపీ నాయకులు, వ్యాపారవేత్తలు, శ్రేయోభిలాషులు చేయూతనిచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అమరావతి గ్రౌండ్‌లో అన్న కాంటీన్ నిర్వహించామన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీల్లో తిరిగి కనిగిరిలో పునఃప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. కనిగిరిలో అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, కమిషనర్ దానియేలు, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, నంబుల వెంకటేశ్వర్లుయాదవ్, ఫిరోజ్, నజిముద్దీన్, సీఐ ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు ఆహారాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ఎంతోచేసింది

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, సెప్టెంబరు 19: టీడీపీ కూటమి ప్రభుత్వం గత వంద రోజుల పాలనలో ఎన్నో అద్భుతాలు సాధించిందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఈమేరకు గురవారం ఓప్రకటన విడుదలచేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తుందన్నా రు. అధికారం చేపట్టగానే అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.12500 కోట్ల నిధులు కేంద్రప్రభుత్వం నుంచి సాధించినట్టు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు వెయ్యి రూ.4వేలు పింఛన్, దివ్యాంగులకు రూ.6వేలు చొప్పున క్రమంతప్పకుండా అందిస్తున్నట్టు చెప్పారు. ప్రతినెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జీతాలు, పింఛన్లు ఎప్పుడు ఇస్తారో తెలియక ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురుచూసే పరిస్థితి ఉండేదన్నారు. ప్రజల నమ్మకాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం అన్నీవర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. దర్శి నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వ అసమర్థతతో మూలనపడ్డ జాతీయ స్థాయి డ్రైవింగ్ శిక్షణ పరిశోధన కేంద్రానికి రూ.18.5 కోట్ల నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా దర్శి పట్టణంలో ప్రజలు బస్ షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతన బస్‌షెల్టర్లు నిర్మించినట్టు డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. ఆటకెక్కిన ఇంటింటి కొళాయి పథకాన్ని ప్రారంభించేం దుకు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. దర్శి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి చిత్తశుద్ధి కృషి చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.

ఆరోగ్యవంత సమాజనిర్మాణం అందరి బాధ్యత

- ఎంపీపీ శ్రీనివాసరావు

తాళ్లూరు, సెప్టెంబరు 19: పౌష్టికాహార ప్రాముఖ్యతను గుర్తించి ఆరోగ్యవంత సమాజ నిర్మాణం అందరి బాధ్యతని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. సీడీపీవో సీహెచ్ భారతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మంచి ఆహారపదార్థాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఎంపీడీవో యుగకీర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచి పౌష్టికాహారాన్ని అందిస్తున్నందునే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యవంతులుగా ఉంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల టీడీపీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు, వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, ఏపీఎం దేవరాజ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భం గా అంగన్‌వాడీ వర్కర్లు తాము తయారు చేసిన పౌష్టికాహారపదార్థాలను ప్రదర్శించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

తాళ్లూరు, సెప్టెంబరు 19: అధికార యంత్రాంగం ప్రజలకు జవాబీదారీతనంగా ఉండేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గురించి వివరించారు. ఎంపీడీవో కె.యుగకీర్తి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం చేపట్టే పనుల్లో జరిగే అవకతవకల గురించి తెలుసుకునేందుకు 2005లో భారత ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని రూపొందించిందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్ భారతి, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, వెలుగు ఏపీఎం దేవరాజ్, సూపర్‌వైజర్ జ్యోతి, తదిత రులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కనిగిరి, సెప్టెంబరు 19: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ కార్యాలయాల ఆవరణను శుభ్రం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కూడా ఆయా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతిఒక్కరూ భాగస్వామ్యంగా ముందుకు కదిలినప్పుడే ప్రభుత్వాలు అమలుచేస్తున్న కార్యక్రమాలు విజయవంతమవుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పామూరులో.. పామూరు, సెప్టెంబరు 19: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలు సహకరించాలని ఎంపీడీవో బి.సురేష్ అన్నారు. గురువారం మండంలోని వగ్గంపల్లి గ్రామంలో స్వచ్ఛతాహీ కార్యక్రమాల్లో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య, ఈవోపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, కార్యదర్శి గుత్తి రాజగోపాల్, సచివాలయ సిబ్బంది పా ల్గొన్నారు.

స్వచ్ఛతాహీ కార్యక్రమాల్లో భాగంగా గురువారం పామూరు గ్రామ పంచాయతి ఆధ్వర్యంలో పలుచోట్ల సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పలు ఏరియాల్లోని మురుగు కాలువల్లో పేరుకుపో యిన చెత్త చెదారాన్ని తొలగించారు. కార్యక్రమాల్లో సీనియర్ అసిస్టెంట్ జి.రత్నకుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కాగా, స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో కేజీబీవీలో గురువారం స్వచ్ఛ తాహీసౌ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు పరిసరాల పరి శుభ్రతపై స్వచ్ఛతాహీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిల్లచెట్లతో మూసుకుపోయిన సాగర్ కాలువలు

- చివరి భూములకు నీరెలా చేరుతుందని రైతుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, సెప్టెంబరు 19: మండలంలోని సాగర్ కాలువలు చిల్లచెట్లతో మూసుకుపోయాయి. ప్రస్తుతం ఆ కాలువలు చిట్టడవిని తలపిస్తున్నాయి. పట్టించు కోవాల్సిన ఎన్ఎస్‌పీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. నాగార్జున సాగర్‌లో సమృద్ధిగా నీరు ఉండటంతో ఎన్ఎస్‌పీ అధికారులు నీరు విడుదల చేయనున్నారు. ఈక్రమంలో చివరి భూములకు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని మోదేపల్లి మేజరు పరిధిలోని రామకృష్ణాపురం వద్ద కాలువ పూర్తిగా చిల్లచెట్లతో నిండిపోయింది. దీంతో ఇక్కడ కాలువ ఉందా? అన్నట్టుగా చిల్లచెట్లు కమ్మేశాయి. ఒక వేళ మరో వారం రోజుల్లో నీరు వచ్చినట్లయితే కిందికి వెళ్ళే పరిస్థితి ఏమాత్రం కన్పించటం లేదు. తూర్పు కంభంపాడు మైనర్ కాలువ పరిస్థితి అలాగే ఉంది. కాలువంతా చిల్లచెట్లతో అల్లుకుపోయింది. సుమారు రెండు కిలో మీటర్ల పొడవునా చిల్లచెట్లు ఉన్నాయి. రజానగర్ మేజరు పరిధిలో పసుపుగల్లు, దీక్షితులువారిపాలెం మైనర్ కాలువలు అలాగే ఉన్నాయి. దట్టంగా చిల్లచెట్లు పెరిగిపోయాయి. ఎన్ఎస్‌పీ అధికారులు స్పందించి కాలువల్లో చిల్లచెట్లను తొలగించి సక్రమంగా నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



చిల్లచెట్లతో మూసుకుపోయిన రామకృష్ణాపురం వద్ద మోదేపల్లి మేజరు కాలువ



మారెళ్ళ సమీపంలో చిల్లచెట్లతో మూసుకుపోయిన తూర్పుకంభంపాడు మైనర్ కాలువ



ఎమ్మెల్యే ఉగ్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెచ్ఎంపాడు ఎస్ఐ మాధవరావు



బాధ్యతలు స్వీకరించిన కనిగిరి ఎస్ఐ టి.శ్రీరాం, పామూరు ఎస్ఐ టి.కిశోర్‌బాబు, సీఎస్‌పురం ఎస్ఐ ఆర్.సుమన్

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు

పామూరు, సెప్టెంబరు 19: పామూరు, సీఎస్‌పురం పోలీస్ స్టేషన్‌లకు నియమితులైన ఎస్ఐలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పామూరు ఎస్ఐ టి.కిషోర్‌బాబు ముందుగా సీఐ భీమానాయక్‌ను కలిశారు. అనంతరం స్టేషన్‌లో సిబ్బంది సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు వన్‌టౌన్ ఎస్‌గా పనిచేస్తున్న కిషోర్‌బాబు బదిలీపై పామూరు స్టేషన్ కు వచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని కనిగిరిలోని క్యాంపు కార్యలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

అలాగే, సీఎస్‌పురం ఎస్ఐగా ఆర్.సుమన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్ నుంచి సాధారణ బదిలీలో బాగంగా సీఎస్‌పురం స్టేషన్‌కు నియమితులయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రథమ పాధాన్యత ఇస్తామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్ వీఆర్‌కు వెళ్లారు.

కనిగిరిలో.. కనిగిరి, సెప్టెంబరు 19: ఇటీవల నూతనంగా నియమితులైన ఎస్ఐలు గురువారం విధుల్లో చేరారు. కనిగిరి ఎస్ఐగా నియమితులైన టి.శ్రీరాం, హెచ్ఎంపాడు ఎస్‌గా నియమితులైన కె.మాధవరావు బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనిగిరిలో శాంతి భద్రతతలకు కృషి చేయాలని సూచించారు. పట్టణంలో ఈవ్‌టీజింగ్‌లు, మత్తుపదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు.

రాకపోకలకు దారిచూపరూ..

దొనకొండ, సెప్టెంబరు 19: రికార్డుల ప్రకారం ఉన్న పంచాయతీ రోడ్డుపై అక్రమ నిర్మాణాలు జరగడంతో దారిలేక ఇబ్బందులు పడుతున్నామని ఒబ్బాపురం ఎస్సీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే స్థలాల నుంచి ఏళ్ల తరబడి రాకపోకలు సాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈస్థలాల్లో రైల్వే అధికారులు ఇటీవల అడ్డుగా గోడల నిర్మాణాలు చేపట్టి ఉన్న రహదారులు మూసివేయడతో రాకపోకలు జరుపుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. రాకపోకలకు దారిచూపాలంటూ ఒబ్బాపురం ఎస్సీ కాలనీకి చెందిన జయరాజు, జాన్సన్, ప్రసాద్, లాజరస్ మరికొందరు గురువారం తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో వసంతకుమార్‌నాయక్‌కు వినతిపత్రాలు అందించి విజ్ఞప్తి చేశారు. ఆక్రమణలను తొలగించాలని అనేకసార్లు అధికారులకు విన్నవించినా ఎటువంటి ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, అరబస్తాన్‌కు చెందిన కొందరు ముస్లింలు రైల్వేశాఖ గోడల నిర్మాణం చేపట్టటంతో తమకు దారి సమస్య ఏర్పడిందని ఉమ్మర్‌వలి, బేగ్, ఖాదర్‌వలి తదితరులు పేర్కొన్నారు. ఈసమస్యను పరిష్కరించాలంటూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌లు పద్మజ, పార్వతి

పామూరు, సెప్టెంబరు 19: సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని బొట్లగూడూరు, వగ్గంపల్లి అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని కంభాలదిన్నె, చిలంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా జరిగిన అవగాహన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. ప్రతిరోజు సమతుల్య ఆహారం అందాలంటే ఆకు కూరలు, ముడిధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు, గ్రుడ్లు తీసుకోవాలని సూచించారు. శీతల పానీయాలు మాని మజ్జిగ, నిమ్మకాయ నీరు వంటివి తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే రాగిజావ, చిక్కీలు, గ్రుడ్లను తీసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు పటాన్ హహబూబ్‌బాషా, జ్యోతి, ఉపాధ్యాయులతోపాటు ఆశా, ఆరోగ్య అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాల రికవరీని వేగవంతం చేయాలి

పీసీపల్లి, సెప్టెంబరు 19: స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళల నుంచి త్వరితగతిన రికవరీ చేయాలని ఏజీఎం హర్షవర్ధన్ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం వీవోఏలు, సీసీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా స్త్రీనిధి రుణాలు ఇచ్చిందన్నారు. వాటిని తీసుకున్న మహిళలు చెల్లింపులలో అలసత్వంగా ఉన్నారన్నారు. నిర్ణీత గడువులోగా చెల్లించాల్సిన రుణాలను 50 శాతం కూడా రికవరీ చేయలేదన్నారు. అక్టోబరు నెలాఖరుకల్లా బకాయిలు వసూలు చేయాలన్నారు. సమావేశంలో స్త్రీనిధి మేనేజరు సంపత్‌కుమార్, ఏపీఎం సత్యానందం, సీసీలు గువ్వల శశిరేఖ, జీవీ భాస్కరరెడ్డి, దేవరపల్లి తిలకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు

పీసీపల్లి, సెప్టెంబరు 19: పీసీపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన జి.కోటయ్యను టీడీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం మండలంలోని పలు విషయాలపై ఎస్ఐతో చర్చించారు. ఆయనను కలిసినవారిలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య, వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, పెదయిర్లపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవరపు కొండపనాయుడు, కోటపాటి రామారావు, కోటపాటి గోపి, తదితరులు ఉన్నారు.

నేడు దూబగుంటలో ఉగ్ర పర్యటన

పామూరు, సెప్టెంబరు 19: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా వంద రోజుల పాలన ప్రగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం రూపొందించారు. ఇందులోభాగంగా వంద రోజుల్లో తీసుకొన్న నిర్ణయాలను ప్రజలకు వివరించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. శుక్రవారం పామూరు మండలంలోని దూబగుంట గ్రామంలో ఎమ్మెల్యే పర్యటిస్తున్నట్టు ఉగ్ర క్యాంపు కార్యాలయం నుంచి సమాచారం అందింది.

వెంకటేశ్వర్లు మృతి టీడీపీకి తీరనిలోటు



వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉగ్ర తదితరులు

పీసీపల్లి, సెప్టెంబరు 19: టీడీపీకి వెంకటేశ్వర్లు మృతి తీరనిలోటని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని మారెళ్లకు చెందిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పరిమి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. గురువారం జరిగిన వెంకటేశ్వర్లు పెద్దఖర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, మాలకొండయ్య, నాగేశ్వరరావు, నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాళ్లూరు, సెప్టెంబరు 19: గుండ్లాపల్లిలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మర్మతుల దృష్ట్యా మండలంలోని తాళ్లూరు, శివరాంపురం, మాధవరం విద్యుత్ సబ్‌స్టేషన్లలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం సాయంత్రం త్రీఫేజ్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎస్.వీరబ్రహ్మం తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో రెండు రోజులపాటు గృహ అవసరాలకు సింగిల్ ఫేజ్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.



దర్శి ప్రాంతంలో సాగుచేసిన సజ్జ పైరు

ఆశాజనకంగా ఖరీఫ్ పైర్లు

దర్శి, సెప్టెంబరు 19: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అన్నీ పైర్లు జీవం పోసుకున్నాయి. ప్రధానంగా దర్శి ప్రాంతంలో కంది, సజ్జ, పత్తి, మొక్కజొన్న తదితర పైర్లు సాగుచేశారు. ప్రస్తుతం సజ్జ కంకితీసి గింజపోసుకుంటుంది. కంది ఏపుగా పెరిగి పూతదశకు చేరింది. ఈఏడాది సజ్జపైరు సాగుచేసిన రైతులకు లాభాలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ధర కూడా ఆశాజనకంగా ఉంది. సజ్జ గింజపోసుకొని 20 రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉంది. ఎకరాకు 10 నుంచి 15 బస్తాల దిగుబడి వస్తుందని రైతులు అంచనాలు వేస్తున్నారు. ఈఏడాది సజ్జ క్వింటా రూ.2500 పలుకుతుంది. దీంతో పెట్టుబడులు పోను రైతులకు లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కందిపైరు ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. ఎలాంటి తెగుళ్లు సోకకపోతే దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది. ఖరీఫ్‌లో సాగుచేసిన పైర్లు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హోటల్ సర్వర్‌పై దాడి

కనిగిరి, సెప్టెంబరు 19: హోటల్ సర్వర్‌పై నలుగురు దాడిచేసి తీవ్రంగా గాయ పర్చారు. ఈఘటన గురువారం రాత్రి పామూరు బస్టాండు వద్ద హోటల్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వాసుపత్రి ఎదుట ఉన్న హోటల్‌లో అనంతపురంకు చెందిన బాబ్జినాయక్ అనే వ్యక్తి సర్వర్‌గా పని చేస్తున్నాడు. రాత్రి కనిగిరి పట్టణంలోని పాతూరు ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు హోటల్‌కు వచ్చి భోజనం ఆర్డర్ ఇచ్చారు. భోజనం వచ్చేసరికి కొంత జాప్యం జరగటంతో సర్వర్‌పై గొడవకు దిగి మంచినీటి జగ్‌తో దాడి చేశారు. సర్వర్‌కు రక్తస్రావ మవటంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడిచేసిన విషయాన్ని హోటల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో దాడి చేసిన యువకులు పరారవుతుండగా పోలీసులు పట్టణంలోని ఉప్పురోడ్డులో వారిని గుర్తించి అదుపులోకి తీసుకోబోయేందుకు ప్రయత్నించారు. పోలీసులపై కూడా తిరగబడి దాడికి పాల్పడ్డారు. దీంతో స్టేషన్‌కు ఫోన్‌చేసి మరో ముగ్గురు పోలీసు సిబ్బందిని పిలిపించి వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడి చేసిన వ్యక్తులు పూటుగా మద్యం సేవించినట్లు ఉన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందతున్న సర్వర్

VEHICLE FOR SALE

VEHICLE NO	VEHICLE DESCRIPTION	YEAR
AP07TB-5659	TATA LPT 3118 CUMMINS FBT	2011
AP39NS-6330	ETIOS GD DIESEL 5 SEATER	2015

AUCTION DATE : 20-09-2024
SHRIRAM AUTO MALL INDIA LIMITED
Doddavarappadu(V&PO), Maddipadu(M), ONGOLE, Prakasam(DT), 99498 29182, 95737 11099

AJ ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

WANTED
■ నవయుగ పెట్రోలియమ్స్, త్రోవగుంట లోని కరవది రోడ్డులో గల పెట్రోలు బంకులో పనిచేయుటకు బాయ్స్, గర్ల్స్ కావలెను. సంప్ర॥ సెల్: 9866774691
AJO-190476

ఇంటి ఋణాలు / కార్ లోన్స్
■ ఇంటి మీద, ఖాళీ స్థలాల మీద, వ్యవసాయ పొలాల మీద, బిజినెస్ లోన్స్, అపార్ట్‌మెంట్స్, కారు ఋణాలు తక్కువ వడ్డీకి మొదలగు వాటికి ఇప్పించబడును. సంప్ర॥ 95024 66253.
AJO-190193


సేల్స్ గర్ల్స్ కావలెను
■ ఒంగోలు ప్రముఖ ఫర్నీచర్ షాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్స్ కా॥ వయస్సు : 20 to 40లోపు, అర్హత : డిగ్రీ లేద B.Tech Complete. జీతం: 20,000 + ఇన్సెంటీవ్స్. సంప్ర॥ సెల్ : 83744 44414, 90305 90855
AJO-200142

WANTED
■ SR Defence Academy కి ప్రకాశం నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన PRO's, Junior Lecturers కావలెను Qual: Any Degree. Cell: 78933 18282, 63057 89148
AJT-4305

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.
జన్మదిన శుభాకాంక్షలు | వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు
విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు | లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358
ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484



రేషన్‌కార్డు కావాలా.. సచివాలయం. కరెంట్ మీటరు సమస్య.. సచివాలయం. ఇంటి పన్నులు.. ప్లాన్లు.. కుళాయి కనెక్షన్లు అవసరమా.. సచివాలయం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలా.. సచివాలయం. వీధిలో చెత్త.. మురుగు.. తదితర సమస్య పరిష్కారమా.. సచివాలయం. ఇలా స్థానిక సమస్యల నుంచి ప్రజలకు అవసరమైన వివిధ ధృవీకరణపత్రాల వరకు అన్నింటికీ సచివాలయమే దిక్కుగా గత ప్రభుత్వం చేసింది. పంచాయతీరాజ్ వ్యవస్థను, స్థానిక స్వపరిపాలనను నీరుగారుస్తూ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో తొలిగా సచివాలయ ఉద్యోగులను ఆయా శాఖలకు సర్దుబాటు చేసేలా నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలకు ప్రాధాన్యం పెంచే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.



సచివాలయం.. సర్దుబాటు



- ఆయా శాఖలకు ఉద్యోగుల బదిలీ?
- ఇప్పటికే మాతృశాఖకు పంచాయతీ కార్యదర్శులు
- వలంటీర్ల స్థానంలో సచివాలయ ఉద్యోగులకు విధులు
- సచివాలయ సిబ్బంది లాగిన్లలోకి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్
- గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్‌కు సమాంతరంగా సచివాలయ వ్యవస్థ
- గ్రామ పంచాయతీలకు ప్రాధాన్యం పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు

గుంటూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఏ చిన్న పని వచ్చినా, ఏ అవసరం ఉన్నా, ఏ సమస్య వచ్చినా సచివాలయలదే రాజ్యం. వారి పాలన అంతా సర్వం సచివాలయాలమయం అన్నట్లుగా సాగింది. దీంతో రాజ్యాంగబద్ధమైన పంచాయతీరాజ్ వ్యవస్థ, స్థానిక స్వపరిపాలన ప్రమాదంలో పడిపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థపై దృష్టి సారించింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్న కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు గుడ్‌బై చెప్పి ఆ స్థానంలో గ్రామ పంచాయతీలకు ప్రాధాన్యం పెంచే దిశగా చర్యలు చేపట్టింది. సచివాలయ ఉద్యోగులను సర్దుబాటు చేస్తామని సూచన ప్రాయంగా చెప్పిన ప్రభుత్వం బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఓ నిర్ణయానికి వచ్చింది. నిర్ణయానికి వచ్చిందే తడవుగా చర్యలకు శ్రీకారం చుట్టింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో మొత్తం 14,183 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. గుంటూరు జిల్లాలో 4,979 మంది, పల్నాడు జిల్లాలో 4,816 మంది, బాపట్ల జిల్లాలో 4,388 మంది ఉద్యోగులు ఉన్నారు. వారికి గత ప్రభుత్వం నిర్దిష్టమైన జాబ్ చార్టు ఇవ్వకుండా రకరకాల పనులు కేటాయించింది. సచివాలయాల ద్వారా 543 రకాల సేవలు అందిస్తామని చెప్పినా ఆచరణలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 1బీ అడంగల్, పాసు పుస్తకాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ మినహా వారు అందించే సేవలు పెద్దగా ఏమీ లేవు. దీంతో ఉద్యోగులంతా ఖాళీగా ఉండడమో, వారి మాతృశాఖకు సంబంధించిన విధులు చేయడమో, మీసేవా కేంద్రాల్లో ఉండే డేటా ఆపరేటర్ల మాదిరిగా మారిపోవడమో జరిగింది. దీనికంతటికీ చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో ఇప్పటికే గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులను పంచాయతీరాజ్‌శాఖలోకి బదిలీ చేసింది. వారిని ఆయా పంచాయతీలకు కార్యదర్శులుగా నియమించింది. మిగిలిన ఉద్యోగులను కూడా ఆయా శాఖల్లో సర్దుబాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్దుబాటుకు సంబంధించి ప్రొఫార్మా రూపొందించాలని అధికారులకు ప్రభుత్వం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా మహిళా పోలీస్ విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. వారిని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలోకి తీసుకువెళతారా.. లేక హోమ్ శాఖ పరిధిలో ఉంచుతారా అన్నది తేలాల్సి ఉంది.

వలంటీర్లు కనుమరుగు

తాజా పరిణామాల నేపథ్యంలో వలంటీర్ వ్యవస్థకు ప్రభుత్వం స్వస్తి చెప్పినట్లుగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే వైసీపీ ఆదేశాలతో మూడొంతుల మంది వలంటీర్లు రాజీనామా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో వలంటీర్లు చేపట్టే పింఛన్ల పంపిణీ తదితర సంక్షేమ కార్యక్రమాలను సచివాలయ ఉద్యోగుల ద్వారా అమలు చేస్తోంది. ఇక పూర్తిగా ఆయా బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకే అప్పగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వలంటీర్ల లాగిన్లలో ఉన్న లబ్ధిదారుల హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను సచివాలయ సిబ్బంది లాగిన్లలోకి మారుస్తున్నారు. ఒక్కో ఉద్యోగికి వంద నుంచి 150 మంది వరకు లబ్ధిదారులు ఉండేలా ఈ మ్యాపింగ్ ప్రక్రియ జరుగుతోంది. ఆ మేరకు నిర్దిష్టమైన ప్రొఫార్మా గ్రామ, వార్డు సచివాలయ డైరెక్టర్ నుంచి జిల్లా అధికారులకు అందింది. ఆ ప్రొఫార్మాలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను రెండు రోజుల్లో పూర్తి చేసి సైన్డ్ కాపీ, సాఫ్ట్ కాపీని మానిటరింగ్ గ్రూప్‌లో పోస్టు చేయాలని ఉద్యోగులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల్లో లాంగ్ లీవ్, మెడికల్ లీవ్, మెటర్నిటీ, స్టడీ లీవ్‌లు తీసుకున్నా, షార్ట్ లీవ్, అబ్‌స్కాండ్, నాట్ జాయిన్డ్, డెప్యూటేషన్‌పై ఉన్న ఉద్యోగుల వివరాలను కూడా డైరెక్టరేట్‌కు పంపించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సర్దుబాటు ఇలా..

ఉద్యోగులు	శాఖలు
డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు	పంచాయతీరాజ్ శాఖ
ఏఎన్ఎంలు	వైద్య శాఖ
వ్యవసాయ సహాయకులు	వ్యవసాయ శాఖ
వెటర్నరీ అసిస్టెంట్లు	పశుసంవర్ధక శాఖ
హార్టికల్చర్ అసిస్టెంట్లు	ఉద్యాన శాఖ
ఫిషరీస్ అసిస్టెంట్లు	మత్స్య శాఖ
సర్వే అసిస్టెంట్లు	సర్వే శాఖ
వీఆర్‌వోలు	రెవెన్యూ శాఖ
మహిళా పోలీసులు	స్పష్టత లేదు



బీసీ స్టడీ సర్కిల్

బీసీ స్టడీ సర్కిల్‌కు.. నిధులు

- కూటమి ప్రభుత్వంలో మళ్లీ పూర్వ వైభవం
- ఇక నిరుద్యోగ యువతకు నిరంతర శిక్షణకు చర్యలు
- గ్రూపు పరీక్షలతోపాటు సివిల్స్ పరీక్షార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు
- వైసీపీ హయాంలో పాలకుల నిర్లక్ష్యం స్టడీ సర్కిల్ నిర్వీర్యం

గుంటూరు(విద్య), సెప్టెంబరు 19: ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకోలేక.. మెటీరియల్ కొనుగోలు చేయలేక.. పోటీ పరీక్షలకు సరైన శిక్షణ పొందలేక.. ఐదేళ్లుగా అవస్థలు పడిన నిరుద్యోగ యువత కష్టాలకు తెరపడింది. గతంలో ఒక వెలుగు వెలిగి.. ఎందరికో దిక్సూచిగా నిలిచిన గుంటూరులోని బీసీ స్టడీ సర్కిల్ మళ్లీ పూర్వ వైభవం దిశగా సాగనున్నది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైపోయిన బీసీ స్టడీ సర్కిల్‌ను తిరిగి గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం నిధులు సమకూర్చేందుకు సిద్ధమైంది. వైసీపీ ప్రభుత్వంలో నిధుల కొరత, నిర్లక్ష్యంతో బీసీ యువతకు దూరమైన శిక్షణా కార్యక్రమాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన సమీక్షలో రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిళ్లకు రూ.10 కోట్లు వరకు నిధులు విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా యువత కోసం రాజాగారితోటలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు నిధులు విడుదల అయ్యే అవకాశం ఉందని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నిధులతో ఇక నుంచి ఏటా వంద మందికి సివిల్స్ శిక్షణ ఇప్పించాలని యోచిస్తున్నారు. అంతేకాకుండా గ్రూపు పరీక్షలకు కూడా యువతకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న స్టడీ సర్కిల్‌కు సొంత భవనం కోసం కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

నిరుద్యోగ యువతకు మార్గదర్శి..

ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం విడుదల చేసే నోటిఫికేషన్లకు అనుగుణంగా బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు. డీఎస్సీ, పోలీసు ఉద్యోగాల, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకు, రైల్వే, గ్రూపు, సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలకు ఇక్కడ నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆయా పోటీ పరీక్షలకు బయట శిక్షణ తీసుకుంటే ఒక్కో పరీక్షకు సంబంధించి సగటున రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అభ్యర్థులు చెల్లించుకోవాల్సిన దుస్థితి. దీనికి తోడు పుస్తకాల కొనుగోలు, మెటీరియల్‌కు అదనంగా చెల్లించాలి. ఈ నేపథ్యంలో బీసీ స్టడీ సర్కిల్ నిరుద్యోగ యువతకు ఆశాకిరణంగా మారింది. శిక్షణ కోసం అభ్యర్థులకు ముందుగా అంతర్గతంగా రాత పరీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల విద్యార్హతలు పరిశీలించి మెరిట్ ఉన్న వారిని ఎంపిక చేసి ఆయా పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ కోసం ఎంపిక చేస్తారు. ఎంపికలో బీసీ యువతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, ఓసీ సామాజికవర్గాల యువతకు కూడా అవకాశం కల్పిస్తారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతోమంది యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. శిక్షణ కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి ఎంతోమంది యువత పోటీ పడతారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ ఉన్న గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు చదువుతూ పరీక్షలకు సిద్ధం అయ్యేవారు కూడా ఉన్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల లేమి, పాలకుల నిర్లక్ష్యంతో బీసీ స్టడీ సర్కిల్ దాదాపు నిర్వీర్యమైందనే చెప్పాలి. చివరలో గ్రూపు పరీక్షలకు అరకొర శిక్షణ ఇవ్వడం మినహా నాలుగున్నర సంవత్సరాలు నిరుద్యోగులకు ఎటువంటి శిక్షణ కార్యక్రమాలు లేవు. గత ప్రభుత్వం చివర దశలో డీఎస్సీ, గ్రూపు పరీక్షలకు రెండు నోటిఫికేషన్లు తప్ప ఇతరత్రా ఎటువంటి ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లు ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసినా వాటికి సంబంధించి కూడా స్టడీ సర్కిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం శిక్షణకు కనీస చర్యలు తీసుకోలేదు. ఫలితంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీరాల ఎస్టీవో సరెండర్

- మిగిలిన ఆరుగురు ఉద్యోగుల బదిలీ
- చీరాల ఉప ఖజానా కార్యాలయం ప్రక్షాళన
- డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్‌కు కలెక్టర్ సిఫార్సు



భాగ్యలక్ష్మి, ఎస్టీఓ, చీరాల

చీరాల, సెప్టెంబరు 19: అవినీతి ఆరోపణలు, ఆధిపత్యపోరు నెలకొన్న చీరాల ఉప ఖజానా కార్యాలయాన్ని కలెక్టర్ వెంకటమురళి ప్రక్షాళన చేశారు. ఎస్టీవో భాగ్యలక్ష్మిని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్‌కు సరెండర్ చేశారు. సస్పెండ్ తర్వాత ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, మిగిలిన ఆరుగురు ఉద్యోగులను బదిలీ చేయాలని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్‌కు సిఫార్సు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యాలయ ఉద్యోగులు హద్దులు మీరిన నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో మూడు రోజులుగా వరుస కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో స్పందించిన కలెక్టర్ చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, డీటీవో శివకామేశ్వరిలతో విచారణ చేయించి వారిచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టారు. ఎస్టీవో, మిగిలిన ఆరుగురు ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించడంతో అవసరార్థులు ఇబ్బంది పడినట్లు విచారణలో తేలినట్లు గురువారం కలెక్టర్ తెలిపారు. రెండు నెలలుగా ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి బిల్లులు సక్రమంగా విడుదల చేయలేదన్నారు. ఎస్టీవో భాగ్యలక్ష్మి ఆఫీస్ ఆర్డర్ నేపథ్యంలో ఆరుగురు ఉద్యోగులు తమ లాగిన్‌లో చేయాల్సిన బిల్లులను పాస్ చేయకుండా అందుకు సంబంధించిన వారిని ఇబ్బంది పెట్టారన్నారు. ఈ విషయాన్ని ఎస్టీవో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదని తెలిపారు. ఈక్రమంలో కార్యాలయం ప్రక్షాళనలో భాగంగా ఎస్టీవోను డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్‌కు సరెండర్ చేస్తూ, మిగిలిన ఆరుగురు ఉద్యోగులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయాలని సిఫార్సు చేశామన్నారు. ఈ చర్యలు కేవలం ఒక్క ఎస్టీవో కార్యాలయానికి మాత్రమే కాదని, నిబంధనలను ఉల్లంఘించి, అవినీతికి పాల్పడే ప్రతీ శాఖకూ వర్తిస్తుందని కలెక్టర్ హెచ్చరించారు.

25, 26న జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

- బాపట్ల విజన్ లక్ష్యంతో సభలు నిర్వహించాలి
- అధికారులకు సూచించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 19: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25, 26 తేదీల్లో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులతో గురువారం కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల విజన్, బాపట్ల విజన్ లక్ష్యంతో గ్రామసభలు నిర్వహించాలన్నారు. చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ నిర్ణయాలను గ్రామ సభల ద్వారా ప్రజలకు తెలియపర్చాలన్నారు. గృహాలకు గ్రామ సచివాలయాల సిబ్బందితో మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకకి సాంకేతిక పరిజ్ఞానం

ఉచిత ఇసుక విధానం సమర్థంగా నిర్వహించడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం వర్చువల్ విధానంలో ఇసుక ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించారు. జిల్లా నుంచి కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మైన్స్ ఏడీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



చిలకలేరు వాగులో బ్రిడ్జి అంచున ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

- గుండ్లకమ్మ బ్రిడ్జికు పొంచి ఉన్న ప్రమాదం



గుండ్లకమ్మ నది బ్రిడ్జి ఎగువన ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు



అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ నది బ్రిడ్జి దిగువ అంచున ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

అద్దంకి, సెప్టెంబరు 19: గుండ్లకమ్మ నదిపై అద్దంకి పట్టణానికి సమీపంలోని బ్రిడ్జికి సమీపంలో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. బ్రిడ్జికి ముప్పుగా ఉన్నా అక్రమార్కులు తవ్వకాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. గత ప్రభుత్వంలో జరిగినట్లుగానే ప్రస్తుతం కూడా నదిలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గతంలో ఇసుక తవ్వకాలు బ్రిడ్జికి దూరంగా జరిగేవి. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం ఇసుకాసురులు రెచ్చిపోయి ఎక్కడ పడితే అక్కడే తవ్వకాలు జరిపారు. బ్రిడ్జి, రక్షిత మంచినీటి పథకాలు, ఎత్తిపోతల పథకాల సమీపంలో ఇసుక తవ్వకాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే పంథా కొనసాగుతుంది. బ్రిడ్జికి సమీపంలో రెండువైపులా ఇసుక తవ్వకాలు చేస్తుండడంతో కోతకు గురై బ్రిడ్జికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని పలువురు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. అద్దంకి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల సరిహద్దులో కుంకుపాడు వద్ద చిలకలేరు వాగులో కూడా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. కుంకుపాడు-తాళ్లూరు రోడ్డులో బ్రిడ్జికి సమీపంలో రెండు వైపులా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జిల సమీపంలో ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సీఐ కృష్ణయ్య దృష్టికి తీసుకుపోగా ఇసుక అక్రమ తోలకాలపై ప్రత్యేక నిఘా ఉందని, అలాంటి చర్యలకు పాల్పడితే వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

- వ్యాపారుల ప్రకటనలతో రైతుల్లో అయోమయం
- మార్కెట్ పెరిగే అవకాశం ఉందని కొందరి విశ్లేషణ
- అలాంటి పరిస్థితి లేదని మరికొందరి వాదన
- రూ.18 వేల వద్ద కొనసాగుతున్న డీలక్స్ రకాలు



మిర్చి ధరపై గందరగోళం

గుంటూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధరపై వ్యాపారులు కొంతమంది పరస్పర విరుద్ధమైన సందేశాలతో రైతులను అయోమయంలో పడేస్తున్నారు. కొందరేమో ధర పెరుగుతుందని, మరికొందరు పెరగకపోవచ్చని సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలు పంపిస్తున్నారు. ఇందుకు ఎవరి విశ్లేషణ లు వారు చేస్తున్నారు. దీంతో రైతులు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిర్చిని విక్రయించాలా, మరికొన్ని రోజులు నిరీక్షించాలా అన్న విషయాన్ని తేల్చుకోలేకపోతున్నారు. నిశితంగా మార్కెట్‌ని గమనిస్తూ కొద్దికొద్దిగా మిర్చిని విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.18 వేల వరకు పెరిగిన తేజ, 341 వెరైటీ ధరలు గత వారం, పది రోజుల నుంచి స్థిరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు రోజుకు 50 వేల మిర్చి టిక్కీల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. గత ఏడాది ఎగుమతులు సరిగా లేకపోవడం, పంట విస్తీర్ణం పెరిగిన కారణంగా సీజన్‌లో ఆశించినంతగా క్రయవిక్రయాలు జరగలేదు. దాంతో మేలో గుంటూరు యార్డుకు వేసవి సెలవులు ప్రకటించే నాటికి శీతల గిడ్డంగుల్లో 80 లక్షల టిక్కీల వరకు నిల్వ అయ్యాయి. జూన్ నుంచి కూడా ఎగుమతుల్లో జోరు కనిపించడం లేదు. అయితే ఈ ఏడాది వర్షాకాలంలో మిర్చి పండించే పలు రాష్ట్రాల్లో ప్రకృతి విపత్తులు సంభవించాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనూ భారీ వర్షాలు, వరదలు నెలకొన్నాయి. సాధారణ మిర్చి సాగు విస్తీర్ణం 47,534 హెక్టార్లు కాగా 15 రోజుల క్రితం వరకు కూడా కేవలం 1,333 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేశారు. అందులో తుపానుతో 153 హెక్టార్లు దెబ్బతిన్నది. అలానే తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లోనూ ప్రకృతి విపత్తులు సంభవించాయి. గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలోనూ ఇంచుమించు ఇలాంటి పరిస్థితే నెలకొన్నది. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల నుంచి పచ్చి మిర్చి దిగుమతి అవుతూ కూరగాయల మార్కెట్‌ని ముంచెత్తుతున్నది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే తర్వాత వచ్చే కోతల్లో దిగుబడి తగ్గడంతో పాటు నాణ్యత ఉండదు. ఈ పరిస్థితిపై కొంతమంది వ్యాపారులు రాబోయే రోజుల్లో మిర్చికి డిమాండ్ ఏర్పడి ధర పెరుగు తుందని అంచనా వేశారు. కాగా కొద్దిమంది మాత్రం అలాంటి పరిస్థితి ఏమి ఉండదని చెబుతున్నారు. కోల్డ్‌స్టోరేజ్‌ల్లో 49 లక్షల టిక్కీల వరకు నిల్వలు ఉన్నాయని, రాబోయే రెండు, మూడు నెలల్లో విక్రయించుకోకపోతే కొత్త పంట వచ్చి ధర తగ్గిపోయే అవకాశం ఉందంటున్నారు. ఈ వాదనని కొందరు కొట్టిపారేస్తున్నారు. ఏటా సీజన్ ప్రారంభయ్యే నాటికే కోల్డ్‌స్టోరేజ్‌ల్లో 10 లక్షల టిక్కీలు నిల్వ ఉంటాయని, దీనిని పరిగణనలోకి తీసుకుంటే రాబోయే నాలుగు నెలలకు 40 లక్షల టిక్కీలు అందుబాటులో ఉంటాయని చెబుతున్నారు. అక్టోబరులో మరోసారి ప్రకృతి విపత్తులు సంభవించే అవకాశం ఉండటంతో కచ్చితంగా ధర పెరుగుతుందని చెబుతున్నారు. ఈ విధమైన ప్రకటనలతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.



మద్దిరాలపాడులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

నేడు జిల్లాకు సీఎం చంద్రబాబు రాక

- మద్దిరాలపాడులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం
- మధ్యాహ్నం 2.30 గంటలకు రాక
- రాత్రికి రాత్రే ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- మంత్రి స్వామి, ఎమ్మెల్యే బీఎన్ పర్యవేక్షణ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం మధ్యాహ్నం జిల్లాకు రానున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వస్తున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామంలో జరగనున్న కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆయన హెలికాప్టర్‌లో అక్కడకు వస్తారు. చదలవాడలోని శ్రీవిష్ణు విల్లాస్‌లో ఉన్న హెలిప్యాడ్‌లో దిగుతారు. సమీపంలో ఉన్న మద్దిరాలపాడు గ్రామంలోని కొన్ని నివాసాలకు వెళ్లి ప్రజలను కలుస్తారు. తర్వాత గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద జరిగే గ్రామసభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం బయలుదేరి విజయవాడ వెళతారు. గురువారం రాత్రి 7.30 తర్వాత సీఎం కార్యక్రమ సమాచారం అందడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌లు అధికార యంత్రాంగంతో అక్కడకు వెళ్లి కార్యక్రమానికి కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నారు. మంత్రి బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌లు అధికారులతో మాట్లాడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ పర్యాయం సీఎం అయ్యాక తొలిసారి గ్రామానికి వస్తున్న చంద్రబాబు కార్యక్రమం విజయవంతం కోసం మండల, గ్రామ టీడీపీ నాయకులు గ్రామంలో ప్రచారం చేపట్టారు.



విరాళం చెక్కును అందజేస్తున్న ఇంకొల్లు మండల నాయకులు

వరద బాధితులకు రూ.7.45లక్షల విరాళం

- ఎమ్మెల్యే ఏలూరికి అందజేసిన టీడీపీ నాయకులు

ఇంకొల్లు, సెప్టెంబరు 19 :విజయవాడ వరద బాధితులకు సహాయం చేయాలన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపు మేరకు టీడీపీ మండల పార్టీ నాయకులు విరాళాన్ని అందజేశారు. గ్రామస్థుల నుంచి సేకరించిన రూ.7,45,743 విరాళాన్ని గురువారం ఎమ్మెల్యే ఏలూరికి విజయవాడలో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, నాయకులు కరి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, టౌన్ అధ్యక్షుడు వలేరు మార్క్, పేర్ని బాపయ్య, గోరంట్ల కోటయ్య,చిలుకూరి శ్రీనివాసరావు, అనంతలక్ష్మి, వీరాంజనేయులు, నాగేంద్రం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

సేవాదృక్పథం అభినందనీయం

- ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 19 :విద్యార్థుల సేవాదృక్పథం అభినందనీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు.స్వర్ణ రోడ్డులోని శ్రీసత్యసాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సేకరించిన రూ.50వేలను చెక్కు రూపంలో వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇవ్వాలని ఎమ్మెల్యే కొండయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐకమత్యంగా ముందడుగు వేస్తే ఎన్ని సమస్యలనైనా సునాయాసంగా జయించవచ్చన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధిలో అందరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మర్రిపూడి, సెప్టెంబరు 19 : మండలంలోని వల్లాయపాలెం రహదారిలో మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... కొనకనమిట్ల మండలంలో చింతగుంట గ్రామానికి చెందిన ఆదిమూలం సుధీర్ ఐదు రోజుల క్రితం భార్యతో కలిసి అత్త ఊరైన వల్లాయపాలెం వచ్చాడు. బుధవారం పొదిలిలో స్నేహితుని వివాహానికి మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. రాత్రి 8 గంటల తరువాత కూడా తిరిగి రాకపోవడంతో మర్రిపూడి పరిసర ప్రాంతాల్లో వెతికారు. అయినప్పటికీ ఆచూకి లభించలేదు. గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్ళిన కొందరికి స్థానిక ఎస్సీకాలనీ సమీపంలో వల్లాపాలెం రోడ్డుకు ఉత్తరం వైపున మోటార్‌సైకిల్‌తోపాటు యువకుని మృతదేహం కనిపించింది. వెంటనే సమాచారాన్ని ఎస్‌ఐ రమేష్‌బాబు కు చేరవేశారు. మృతుని భార్య చిట్టి మృతదేహం తన భర్తదేనని గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతివేగం కారణంగా మోటార్‌సైకిల్ అదుపుతప్పి ప్రమాదానికి గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని బైకిస్టు మృతి

సింగరాయకొండ/టంగుటూరు, సెప్టెంబరు 19 : మోటార్ సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని శ్రీకృష్ణ ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకిస్ట్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక జాతీయ రహదారిపై కలికివాయి ఫ్లైఓవర్ సమీపంలోకి ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు మేరకు.. టంగుటూరు అరుంధతీవాడకు చెందిన సంతోష్ కలికివాయి ఫ్లైఓవర్ సమీపంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ పక్కన టిఫిన్ దుకాణాన్ని నడుపుకుంటున్నారు. తాగునీరు తెచ్చుకోవడానికి బైక్‌పై రోడ్డు దాటుతుండగా కావలి వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి మోటార్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో సంతోష్‌కి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు, పోలీస్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంతోష్ పరిస్థితి విషమంగా మారడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆపేదెవరు?

పేకాట.. వ్యభిచారం.. కేరాఫ్‌గా లాడ్జీలు

మార్కాపురం, పొదిలిలో జోరుగా నిర్వహణ

మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్న పోలీసులు

వైసీపీ హయాం నుంచి నిర్విరామంగా కొనసాగింపు

కొత్త అధికారులు వచ్చినా ఇంకా ఆ వైపు దృష్టిపెట్టని వైనం



ప్రభుత్వం మారినా అసాంఘిక కార్యక్రమాలకు నియోజకవర్గంలో అడ్డుకట్ట పడటం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి నడుస్తున్న తంతు నేటికీ కొనసాగుతూనే ఉంది. కాసులు కురిపించే వ్యవహారాలు కావడంతో అధికారయంత్రాంగం కట్టడిపై దృష్టిసారించేందుకు వెనుకంజ వేస్తోంది. ఏవో చిన్నపాటి కేసులను నమోదు చేస్తూ తాము పనిచేస్తున్నామని ఉన్నతాధికారుల వద్ద ఉనికి చాటుకుంటున్నారు. పెద్దస్థాయిలో జరుగుతున్న వ్యవహారాల జోలికి మాత్రం వెళ్లకుండా నిద్ర నటిస్తున్నారు. దీంతో మార్కాపురం డివిజన్‌లోని ప్రధాన పట్టణాల్లో పేకాట, వ్యభిచారాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా అందుకు లాడ్జీలు వేదికలుగా మారుతున్నాయి. అందులో కూడా సింహభాగం వైసీపీ నాయకులకు చెందిన వాటిల్లోనే ఈ తంతు నిర్విరామంగా కొనసాగుతోంది.

మార్కాపురం, సెప్టెంబరు 19 : మార్కాపురం డివిజన్‌లోని మార్కాపురం, పొదిలి తదితర పట్టణాల్లో చిన్నా పెద్దవి కలిపి సుమారు 100 వరకు లాడ్జీలు, హోటళ్లు ఉన్నాయి. 90 శాతానికిపైగా వాటిల్లో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా మార్కాపురం పట్టణంలోని పలువురు ప్రముఖులకు చెందిన లాడ్జీల్లోనే బహిరంగంగా ఈ తంతు సాగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పనిచేసిన అధికారులు కొందరు కొంత మేర కట్టడి చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పేకాట జూదం, వ్యభిచారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా ఈ వ్యవహారాలు నడుస్తూనే ఉన్నాయి. అధికారులు మారుతున్నా కిందిస్థాయి సిబ్బందికి ఈ వ్యవహారాలు తెలిసి జరుగుతున్నావే.

మామూళ్ల మాటున నిబంధనలకు నీళ్లు

లాడ్జీల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాలు జరగకుండా పోలీసులు పలు నిబంధనలు పెట్టారు. ప్రధానంగా ఎవరైనా హోటళ్లల్లో రూము అద్దెకు తీసుకుంటే తప్పకుండా ఆధార్ కార్డు ఇవ్వాలి. అంతేకాక ఆడ, మగ అయితే తప్పకుండా వాళ్ల భార్యాభర్తలా అనేది పరిశీలించి మాత్రమే ఇవ్వాలి. మరీ ముఖ్యంగా ముగ్గురిని మించి రూములోకి అనుమతించకూడదు. ఎన్ని గంటలకు వాళ్లు రూము తీసుకున్నారు, ఎప్పుడు ఖాళీ చేశారు తదతర వివరాలు తప్పక రిజిస్టర్‌లో పొందుపర్చాలి. లాడ్జీలను పోలీసులు క్రమంతప్పకుండా పరిశీలించి నిబంధనల మేరకు నడుస్తున్నాయో లేదో చూడాలి. సీసీ కెమారాలు ఉండాలి. అయితే అవేవీ సక్రమంగా ఉండటం లేదు. నిబంధనలను పట్టించుకోకుండా ఉండేందుకు ప్రతి లాడ్జీ యాజమాన్యం నెలవారీగా పోలీసు అధికారులకు మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. అంతేకాక ఉన్నతాధికారులు ఎవరైనా వచ్చినప్పుడు, ప్రధాన నాయకుల పర్యటనలు ఉన్నప్పుడు ఉచితంగా రూములు ఇస్తుండటంతో వారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

అనైతిక కార్యకలాపాలకు పెద్దమొత్తంలో వసూలు

లాడ్జీల్లో రూములు తీసుకుంటే వచ్చే అద్దె తక్కువే. అదే అసాంఘిక కార్యకలాపాలకు ఇస్తే తక్కువ సమయంలో ఎక్కువ అద్దె వస్తుంది. ఈ నేపథ్యంలోనే మార్కాపురం, పొదిలి పట్టణాల్లోని లాడ్జీల్లో ఈ అక్రమ తంతు జోరుగా సాగుతోంది. ప్రధానంగా మద్యపానం కోసం ఎక్కువగా రూములు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. లాభసాటి వ్యాపారం కావడంతో కొందరు భవనాలు అద్దెకు తీసుకుని లాడ్జీలుగా మార్చుకుని నడుపుతున్న పరిస్థితి. కొందరు రెండు, మూడు లాడ్జీలు కూడా నిర్వహిస్తుండటం విశేషం.

కాలేజీ రోడ్డులో వైసీపీ నాయకుని కనుసన్నల్లో..

మార్కాపురంలోని కాలేజీ రోడ్డులో ఓ వైసీపీ నాయకునికి రెండు లాడ్జీలు ఉన్నాయి. ఒక దాంట్లో వ్యభిచారం, మరొక దాంట్లో పేకాట జూదం నడుస్తోంది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు మార్లు పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. చివరికి ఒక లాడ్జీలో సంఘంలోని కొందరు పెద్ద మనుషులతో లాడ్జీ యజమాని వ్యభిచారం చేయిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రధానంగా ఓ ఎముకల వైద్యుడు సంపాదనే ధ్యేయంగా అసాంఘిక వ్యవహారాలను స్వయంగా చేయిస్తున్నట్లు తేలింది. తన పార్టీ వాళ్లు కాకపోయినా అప్పట్లో ఓ మాజీ ప్రజాప్రతినిధి వారిని కాపాడారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ నాయకుడు పూర్తిస్థాయిలో రెండు లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించాడు. అధికార పార్టీ నాయకుడు కావడం అవసరమైనప్పుడు గదులు ఇస్తుండటం, నెల మామూళ్లు ఠంచనుగా పంపడం తదితర కారణాలతో పోలీసులు ఆ వైపు కన్నెత్తిచూసిన పాపానపోలేదు.

కోర్టు కూడలి సమీపంలో భారీగా పేకాట శిబిరం

స్థానిక కోర్టు కూడలి సమీపంలో జిల్లాలోనే అత్యంత పెద్దదైన పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం. గతంలో లాడ్జీగా ఉన్న ఆ భవంతిలో ప్రస్తుతం వైద్యశాల నడుస్తోంది. దాని పైఅంతస్థులో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్న ఓ పెద్ద హాలులో దశాబ్దకాలంగా జూదం డెన్ నడుస్తోన్నట్లు తెలుస్తోంది. అక్కడ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మాత్రమే నడిచే ఈ శిబిరంలో రూ.లక్షల్లో చేతులు మారుతాయి. ఆ శిబిరానికి సంఘంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న పలువురు తరచూ హాజరవుతుంటారు. పోలీసులతో పాటు ఎవరు అధికారంలో ఉన్నా ఆ పార్టీ నాయకులకు పెద్దమొత్తంలో మామూళ్లు ముట్టజెప్పడం ఆ భవంతి యజమాని ఆనవాయితి. అంతేకాక రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులతో కూడా సత్సంబంధాలు ఉండటంతో ఎవరూ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. గతంలో కొందరు ఈ వ్యవహారంపై జిల్లా పోలీసు అధికారికి ఫిర్యాదు చేసినా స్థానిక అధికారులు తాము అక్కడ పరిశీలిస్తే అలాంటివి ఏమి జరగనట్లు నివేదికలు ఇచ్చిన సంఘటనలు ఉన్నాయి.

బస్టాండ్ ఎదురు లాడ్జీల్లో యథేచ్ఛగా..

పొదిలి పట్టణంలో బస్టాండ్ ఎదురుగా ఉండే లాడ్జీల్లో ఈ అక్రమ తంతు యథేచ్ఛగా కొనసాగుతోంది. వ్యభిచారం, పేకాట, మద్యపానం ఇక్కడ సర్వసాధారణమే. జిల్లాలో మధ్య ప్రాంతంలో ఉండటం, 24 గంటలు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో పొదిలిలోని లాడ్జీలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఎవరైనా ప్రయాణికులు కుటుంబంతో ఆయా లాడ్జీల్లోకి వెళ్లాలంటే జంకాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మరీ ముఖ్యంగా మందుబాబుల ఆగడాలు ఆయా లాడ్జీల్లో అన్నీ ఇన్నీ కావు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

జనసేనలోకి బాలినేని

కొత్త నేత కోసం వైసీపీ వేట

ఆపార్టీ ఎంపీపీలు, జడ్పీటీసీలు టార్గెట్‌గా మాజీమంత్రి అడుగులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనలో చేరేందుకు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో త్వరలో ఒంగోలులో జరగబోయే ఒక కార్యక్రమంలో బాలినేని జిల్లాలోని తనతో నడిచే వైసీపీలోని అనుచరులతో జనసేన తీర్థం పుచ్చుకోనున్నారు. బుధవారం వైసీపీకి రాజీనామా చేసిన బాలినేని గురువారం సాయంత్రం మంగళగిరిలో పవన్‌కళ్యాణ్‌తో భేటీ అయ్యారు. సుమారు గంటసేపు వారి మధ్య చర్చలు జరిగాయి.

ఒంగోలులోనే చేరిక కార్యక్రమం

కాగా బాలినేని సూచనతో ఒంగోలులో జరిగే కార్యక్రమంలోనే ఆయనను పార్టీలో చేర్చుకునేందుకు పవన్‌కళ్యాణ్ అనుమతిచ్చారు. గతంలోనే మీ విషయాన్ని పరిశీలించాం అయితే జగన్‌తో మీకు ఉన్న బంధుత్వం దృష్ట్యా మిమ్మల్ని ఆహ్వానించలేదని పవన్‌కళాణ్ అన్నట్లు సమాచారం. ప్రస్తుతం మీరే వచ్చినందున మా పార్టీ తరపున స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారి మధ్య రాజకీయ చర్చలు కూడా జరిగనట్లు సమాచారం. అయితే పార్టీలో పదవులు కాని ఇతరత్రా విషయంలో గాని వారి మధ్య చర్చలు జరగలేదని తెలుస్తోంది. తనతో కొంతమంది పార్టీలోకి వస్తారని బాలినేని చెప్పగా వారిని కూడా చేర్చుకునేందుకు పవన్‌కళ్యాణ్ అంగీకరించినట్లు తెలిసింది. దీంతో బాలినేని ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో తనను అనుసరించే నాయకులతో గురువారం రాత్రే మంతనాలు ప్రారంభించారు. ప్రధానంగా వైసీపీకి చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీల్లో తనకు అనుకూలంగా ఉన్న ఎక్కువమందిని జనసేనలోకి తీసుకెళ్లే ఆలోచనలో ఆయన పావులు కదుపుతున్నట్లు తెలిసింది.

ద్వితీయశ్రేణిపైనే దృష్టి

ఒంగోలులో ఇప్పటికే టీడీపీలో చేరిన వదిలేసి మిగిలిన వైసీపీ కార్పొరేటర్లతో కూడా చర్చలు జరిపారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ముఖ్య నాయకులను పక్కనపెట్టి వైసీపీలోని కిందిస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధుల పైనే ఆయన ప్రధానంగా దృష్టిపెట్టినట్లు సమాచారం. కొండపి నియోజకవర్గానికి చెందిన వైసీపీ మాజీ ఇన్‌చార్జి ఒకరు కూడా ఆయనతో జనసేనలోకి వెళ్లేలా పరిస్థితి కనిపిస్తోంది. ఇక ఇద్దరు ఎమ్మెల్యేల్లో బూచేపల్లితో ఆయనకు అంతర్గతంగా కొన్ని మనస్పర్థలు ఉన్నాయి. వైపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు బాలినేనితో అవినాభావ సంబంధాలు ఉన్నాయి. కానీ ఎమ్మెల్యేలను అటు టీడీపీ ఇటు జనసేన కానీ తీసుకునే ఉద్దేశంలో లేనట్లు తెలుస్తోంది. దీంతో బాలినేని కూడా ముందుగా ద్వితీయశ్రేణి నాయకులను జనసేనలోకి తీసుకెళ్లే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. మంచిరోజు చూసుకొని పార్టీలో చేరుతానని పవన్‌కళ్యాణ్‌కు సూచించిన బాలినేని మూడు తేదీలను ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. వచ్చేనెల 4వతేదీ లేక మరో రోజు ఒంగోలులో జరిగే సభలో పవన్ సమక్షంలో ఆయన పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు.

సురేష్, బూచేపల్లిలపై వైసీపీ దృష్టి

కాగా జిల్లాలో పార్టీ బాధ్యతలు అప్పగించే విషయంలో మాజీ మంత్రి సురేష్, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిలవైపు జగన్ దృష్టిసారించినట్లు తెలిసింది. తొలి ప్రాధాన్యత బూచేపల్లికి ఇచ్చినట్లుగా సమాచారం. అయితే జిల్లాకు చెందిన ఒక ముఖ్య నాయకుడు సురేష్‌కు జిల్లా వైసీపీ అధ్యక్ష బాధ్యత ఇస్తే బాగుంటుదని ఆయనకు సూచించినట్లు తెలిసింది. అయితే జగన్ సురేష్‌కు రాష్ట్ర కమిటీలో బాధ్యతలు ఇచ్చి బూచేపల్లిని జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తే బాగుంటదని అన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆ పార్టీలో సీనియర్ నాయకుల్లో ఎక్కువమంది పార్టీ అధ్యక్ష పదవి తీసుకునేందుకు సిద్ధం కాకపోవటం విశేషం. దీంతో జగన్ జోక్యం చేసుకొని బూచేపల్లి, సురేష్‌లో ఒకరిని ఒప్పిస్తారా లేక వైవీకి పూర్తి బాధ్యత అప్పగిస్తారా.. అన్నది చూడాల్సి ఉంది.



పవన్‌కల్యాణ్‌తో చర్చిస్తున్న బాలినేని

నాతో చాలామంది వస్తారు: బాలినేని

కాగా తనతోపాటు జనసేనలో చేరేందుకు జిల్లాలోని పలువురు వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నారని బాలినేని తెలిపారు. వారందరినీ కలుపుకొని పార్టీలో చేరుతానని వెల్లడించారు. పవన్‌కళ్యాణ్‌తో కలిసిన తర్వాత మీడియాతో మట్లాడుతూ పవన్‌కళ్యాణ్ చూపిన ఆదరణ పట్ల సంతోషంగా ఉందన్నారు. విశ్వసనీయత అంటూ మాటలతో జగన్ నాయకులను మోసం చేశారని ఆరోపించారు. ఆయన పార్టీ పెట్టగానే తనతోపాటు 17 మంది పదవులు వదులుకొని పార్టీలో చేరితే మంత్రివర్గ విస్తరణలో వారందరినీ పక్కన పెట్టారని చెప్పారు.

ముసిలో ఇసుకాసురులు

- రాత్రి సమయంలో అక్రమ రవాణా
- పెద్ద పెద్ద గుంతలు పెట్టి మరీ తవ్వకాలు
- మొద్దునిద్రలో సంబంధిత అధికారులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 19 : ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ముసిని గుల్ల చేస్తున్నారు. మండలంలోని మద్దులూరు ఊరి చివరనున్న వాగులో బావులను తలపించేలా తవ్విన పెద్దపెద్ద గుంతలే అందుకు నిదర్శనం. ఇసుక కోసం భారీగా గోతులు తీయడంతో చుట్టుపక్కల పొలాల్లోని బోర్లల్లో జలాలు అడుగంటుతున్నాయి. దీంతో సాగునీటి సమస్య తీవ్రతరం అవుతోంది. అక్రమార్కులను నిలదీస్తే.. ఎవరికెళ్లాల్సినవి వారికెళ్తున్నాయని, మీరేం చేస్తారని ఎదురు దాడులకు దిగుతున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు సైతం మిన్నకుండిపోతున్నారు.



ఇసుక బావులను తలపిస్తోన్న పెద్ద గుంతలు

భూగర్భజలాలు పడిపోతున్నాయి

మద్దులూరు ఊరి చివరనున్న ముసిలో స్థాయికి మించి గోతులు తీయడంతో ప్రతి ఏటా భూగర్భజలాలు పడిపోతున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను నివారిస్తే వేసవిలో పంటలకు సాగునీరు పుష్కలంగా అందే అవకాశముంది. అయితే రాత్రిళ్లు ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తుంటే సంబంధిత శాఖా అధికారులకు తెలిసిన కూడా ఏమి అనకపోవడం గమనార్హం.

VEHICLE FOR SALE

VEHICLE NO	VEHICLE DESCRIPTION	YEAR
AP07TB-5659	TATA LPT 3118 CUMMINS FBT	2011
AP39NS-6330	ETIOS GD DIESEL 5 SEATER	2015

AUCTION DATE : 20-09-2024

SHRIRAM AUTO MALL INDIA LIMITED

Doddavarappadu(V&PO), Maddipadu(M), ONGOLE, Prakasam(DT), 99498 29182, 95737 11099

డీఈవో అవినీతిపై విచారణ

వారంరోజుల్లో నివేదిక ఇస్తాం: ఆర్జేడీ

ఒంగోలు(విద్య), సెప్టెంబర్ 19 : వరద బాధితుల విరాళాల్లో జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర అవినీతి పాల్పడ్డారన్న ఆరోపణలపై గురువారం పాఠశాల విద్యా గుంటూరు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి విచారణ నిర్వహించారు. డీఈఓ అవినీతిపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఫిర్యాదు మేరకు పాఠశాల విద్యా కమిషనరు విజయరామారాజు గుంటూరు ఆర్జేడీని విచారణకు ఆదేశించారు. దీంతో ఆర్జేడీ స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో విచారణ నిర్వహించారు. మొదటగా వరద బాధితుల విరాళాలు గోల్‌మాల్‌పై విచారణ నిర్వహించారు. జిల్లాలో వరద బాధితుల కోసం ఎంత మొత్తం సేకరించారు, ఆ నిధులను దేనికి వినియోగించారు, ఇంకా ఎంత మొత్తం ఉందని డీఈఓను ప్రశ్నించారు. కలెక్టరు ఆదేశాలు మేరకు వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లాలో మొత్తం రూ.10,99,090 వసూలు చేశామని తమ వద్ద ప్రస్తుతం రూ.1.75లక్షలు చెక్కు ఉందని డీఈఓ చెప్పారు. మండలం వారీగా ఎవరి నుంచి ఎంత వసూలు చేశారు, ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లకు ఎంత ఖర్చు చేశారు, మొత్తం జమా ఖర్చుల వివరాలను తనకు సమర్పించాలని ఆర్జేడీ ఆదేశించారు. రూ.1.75 లక్షల చెక్కును కలెక్టర్‌కు అందజేయమని ఆదేశించారు. డీఈఓ కార్యాలయం, సమగ్రశిక్ష కార్యాలయాల్లో ఎంతమంది టీచర్లను డిప్యుటేషన్ వేశారని, ఆ ఫైళ్లు తన ముందుంచాలని ఆదేశించారు. అదేవిధంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వడంలో జరిగిన అవినీతిపై కూడా విచారించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఫైళ్లు, ఉపాధ్యాయులకు రావాల్సిన ప్రయోజనాలను తన ముందుంచాలన్నారు. ఆ ఫైళ్లను పరిశీలించారు. సెయిట్‌థెరిస్సా ఎయిడెడ్ హైస్కూలు ప్రభుత్వంలో విలీనమైనందున ఉపాధ్యాయులను, సిబ్బందిని ఒకటి రెండు రోజుల్లో కౌన్సెలింగ్ నిర్వహించి వారికి నియామకపు ఉత్తర్వులు ఇవ్వాలని డీఈఓను ఆదేశించారు.



విచారణ చేస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

వారం రోజుల్లో నివేదిక

విచారణ నివేదికను వారంరోజుల్లో పాఠశాల విద్యా కమిషనర్‌కు అందజేయనున్నట్లు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఫిర్యాదులోని ప్రతి అంశంపై విచారణ నిర్వహించామని, సమగ్ర నివేదికను రాస్తామన్నారు. ఫిర్యాదులోని అంశాలుపై అన్ని ఫైళ్లను పరిశీలించినట్లు చెప్పారు. ఐటీ సెల్ నియామకాలు గురించి మాట్లాడుతూ పరిశీలించి నియమిస్తామని తెలిపారు. ఐటీ సెల్‌ను బలోపేతం చేసేందుకు తాజాగా ప్రతిపాదనలు కోరామని ఆయన చెప్పారు. విచారణకు డీఈఓ సుభద్ర, ఒంగోలు ఎంఈఓ టి.కిషోర్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఫిర్యాదు చేసిన టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షులు మన్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పూర్ణచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు పాల్గొన్నారు.

మరో మూడు అన్న క్యాంటీన్లు ప్రారంభం

- జిల్లాలో ఎనిమిదికి చేరిన సంఖ్య

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో మరో మూడు అన్నా క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. దీంతో జిల్లాలో అన్న క్యాంటీన్ల సంఖ్య ఎనిమిదికి చేరింది. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ల ప్రారంభానికి శ్రీకారం పలికిన విషయం తెలిసిందే. ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి ఇప్పటికే నడుస్తున్నాయి. గురువారం సాయంత్రం కనిగిరిలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతులమీదుగా క్యాంటీన్లు ప్రారంభించారు. పేదలకు రూ.5కే భోజనం, టిఫిన్ క్యాంటీన్‌లో అందిస్తారు.



కనిగిరి, మార్కాపురంలలో అన్నక్యాంటీన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు ఉగ్ర, కందుల

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

WANTED

■ నవయుగ పెట్రోలియమ్స్, త్రోవగుంట లోని కరవది రోడ్డులో గల పెట్రోలు బంకులో పనిచేయుటకు బాయ్స్, గర్ల్స్ కావలెను. సంప్ర॥ సెల్: **9866774691**

AJO-190476

ఇంటి ఋణాలు / కార్ లోన్స్

■ ఇంటి మీద, ఖాళీ స్థలాల మీద, వ్యవసాయ పొలాల మీద, బిజినెస్‌కు లోన్స్, అపార్ట్‌మెంట్స్, కారు ఋణాలు తక్కువ వడ్డీకి మొదలగు వాటికి ఇప్పించబడును. సంప్ర॥ **95024 66253.**

AJO-190193

సేల్స్ గర్ల్స్ కావలెను

■ ఒంగోలు ప్రముఖ ఫర్నీచర్ షాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్స్ రా॥ వయస్సు : 20 to 40లోపు, అర్హత : డిగ్రీ లేదా B.Tech Complete. జీతం: 20,000 + ఇన్సెంటివ్స్. సంప్ర॥ సెల్ : **83744 44414, 90305 90855**

AJO-200142

WANTED

■ SR Defence Academy కి ప్రకాశం నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన PRO's, Junior Lecturers కావలెను. Qual: Any Degree. Cell: **78933 18282, 63057 89148**

AJT-4305

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.

జన్మదిన శుభాకాంక్షలు | వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు | విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు | లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు | ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484

పాత మద్రాస్ రోడ్డును అభివృద్ధి చేయండి

» మంత్రి జనార్దన్‌రెడ్డికి ఎమ్మెల్యే ఏలూరి విజ్ఞప్తి


పాత మద్రాస్ రోడ్డు పరిస్థితిని మంత్రికి వివరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 19 : పాత మద్రాస్ రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని అర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. ఈ మేరకు గురువారం సెక్రటేరియట్‌లోని మంత్రి పేషీలో కలిశారు. గుంటూరు - ఒంగోలు వయా ప్రత్తిపాడు రోడ్డు అభివృద్ధితో ఈప్రాంతం రూపురేఖలు మారతాయన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రికి తెలిపారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల ఒంగోలు, గుంటూరుకు త్వరితగతిన గమ్య స్థానానికి చేరే అవకాశం ఉందన్నారు. ఓల్డ్ మద్రాసు రోడ్డు అభివృద్ధి చెందితే రహదారి ప్రాంతంతోపాటు, తీర ప్రాంత గ్రామాలకు రవాణా వ్యవస్థ సులభతరం అవుతుందన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ప్రస్తుతం ఉన్న నేషనల్ హైవే వాహనాల రద్దీ తగ్గి రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ఈ రహదారి నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్య తగ్గి ప్రమాదాలు కూడా నివారించుకోవచ్చని తెలిపారు. ఇంకొల్లు పర్చూరు ప్రాంతాలలో అత్యధికంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తునారని, రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీంతోపాటు ఇంకొల్లు - పర్చూరు రోడ్డులో అత్యధికంగా శీతల గిడ్డంగులు ఉన్నాయన్నారు. రైతుల పంట ఉత్పత్తులను తరలించేందుకు ఉపకరిస్తుందన్నాని ఏలూరి వివరించారు. ప్రస్తుతం పర్చూరు నుంచి ఇంకొల్లు పాత మద్రాస్ రోడ్డు పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, వైసీపీ పాలనలో ఈ రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేయలేదన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి రహదారి నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి నట్లు ఏలూరి పేర్కొన్నారు.


వెంకటాపురం సమీపంలో పమిడిపాడు మేజర్‌కు గండి పెట్టడంతో ప్రవహిస్తున్న నీరు

పమిడిపాడు మేజర్‌కు గండి కొట్టిన రైతులు

దిగువకు నీటి విడుదల జరగక

ఆయకట్టుదారుల ఇక్కట్లు

అద్దంకి, సెప్టెంబరు 19 : పమిడిపాడు మేజర్‌కు ఎగువ రైతులు గండి పెట్టడంతో దిగువ ఆయకట్టుకు నీటి విడుదల జరగక రైతులు ఇబ్బంది పడుతున్నారు. పమిడిపాడు మేజర్‌కు వెంకటాపురం సమీపంలో అలవలపాడు రైతులు గతంలో ఉన్న తూము స్థానం లో పెద్ద తూము వేసేందుకు గండి పెట్టారు. దీంతో గతంలో విడుదల అయ్యే నీటి కంటే రెట్టింపు నీరు అలవలపాడు వైపు వెళ్ళే మైనర్ కాలువ కు వెళ్తుంది. దీంతో దిగువ ఆయకట్టు లో ఉన్న వెంకటాపురం, నాగులపాడు గ్రామాల తో పాటు పలు గ్రామాల ఆయకట్టు కు నీటి విడుదల బాగా తగ్గింది. అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గండి పూడ్చిటం తో పాటు గతంలో ఉన్న తూములనే మరలా ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని దిగువ ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నేడు మిన్నెకల్లులో ప్రజావేదిక

హాజరుకానున్న మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు, సెప్టెంబరు 19: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల 100 రోజుల కార్యాచరణపై సంతమాగులూరు మండలం మిన్నెకల్లు గ్రామంలో నేడు ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీదేవి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరుకానున్నారని తెలిపారు. సంతమాగులూరు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మిన్నెకల్లు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఉదయం 10:30 గంటలకు హాజరుకావాలని తెలిపారు.


పంగులూరు - తక్కెళ్లపాడు మధ్య రోడ్డు పరిస్థితి

పంగులూరు-తక్కెళ్లపాడు రోడ్డు ఛిద్రం

పంగులూరు, సెప్టెంబరు 19 : మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు ప్రధాన రహదారి ఛిద్రమైంది. ఈ రహదారిపై రాకపోకలు సాగించలేక వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిపై ఎత్తు పల్లాలు, భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో తరచూ ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కనీస మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలవలపాడు, తూర్పుతక్కెళ్లపాడు గ్రామస్థులు మండల కేంద్రానికి ఈ రోడ్డు గుండానే రావాలి. పంగులూరు, తక్కెళ్లపాడు గ్రామ రైతులు, వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం పొలాలకు ఈ రహదారిపై నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పంగులూరు పరిసర గ్రామాల ప్రజలు మేదరమిట్ల వైపు వెళ్లేందుకు జాతీయ రహదారిని చేరుకునేందుకు ఈ రహదారిని ఆశ్రయిస్తుంటారు. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక ఛిద్రమైన బీటీ రోడ్డును పునర్ నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రెండవ జోన్‌కు నీరు విడుదల చేయాలి

మార్టూరు, సెప్టెంబరు 19 : రెండవ జోన్‌కు సాగర్ నుంచి మాగాణి భూములకు ఏప్రిల్ ఆఖరు వరకు నీటిని విడుదల చేయాలని కోరుతూ గురువారం మార్టూరులో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌డీవో గంధం రవీందర్‌కు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందచేశారు. రైతులకు వ్యవసాయం చేయడానికి పెట్టుబడి కోసం రూ.20వేలను సాయంగా అందించాలని, గత ఏడాది ఖరీఫ్, రబీలో వేసిన పంటలు నష్టపోయిన వాటికి బీమా ఇవ్వాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత బత్తుల హనుమంతరావు, రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, పాలెపు సాంబయ్య, గోనుగుంట్ల మోహనరావు, కృష్ణమూర్తి, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎత్తిపోతలలో రెండు మోటార్ల చోరీ

ఆందోళనలో అంబడిపూడి రైతులు


చోరీ అయిన మోటార్లను చూపిస్తున్న రైతు

బల్లికురవ, సెప్టెంబరు 19 : మండలంలోని అంబడిపూడి గ్రామంలో ఉన్న రామానాయుడు ఎత్తిపోతల పథకంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు రెండు విలువైన మోటార్లను చోరీ చేశారు. గురువారం ఎత్తిపోతల పథకం మోటార్లను అన్ చేసేందుకు వెళ్లిన రైతులు చోరీ జరిగిన విషయాన్ని గమనించి వెంటనే గ్రామంలోని రైతులకు సమాచారం అందించారు. రెండు లక్షల విలువ కలిగిన రెండు మోటార్లను దొంగలు అపహరించారని రైతులు తెలిపారు. పంటలు సాగు చేసే సమయంలో చోరీ జరగటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గత నెలలో కూడా పొలాల్లో ఉన్న వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ అయ్యాయని ఇప్పుడు మోటార్లు రెండు చోరీ జరిగాయని రైతులు తెలిపారు. మోటార్ల చోరీ విషయాన్ని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు.

బైకును ఢీకొన్న కారు
ఇద్దరికి తీవ్ర గాయాలు

బల్లికురవ, సెప్టెంబరు 19 : మండల పరిధిలోని అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే కొప్పెరాడు వద్ద గుర్తు తెలియని కారు బైకును ఢీకొట్టింది. దీంతో బైకుపై ప్రయాణిస్తున్న కుంచపు అనిల్, నందా రమణమ్మను వారికి తీవ్రగాయాలయ్యాయి. కొప్పెరపాడుకు వారు బేల్దారి పనుల నిమిత్తం అద్దంకి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వారిని నర్సారావుపేట వైద్యశాలకు తలరించారు. కారు డ్రైవర్ ఆపకుండా పరారయ్యారు.

అదుపుతప్పిన కారు

మేదరమెట్ల, సెప్టెంబరు 19 : జాతీయ రహదారిలో అత్యవసర రన్‌వేపై కారు అదుపు తప్పి డివైడర్ దిమ్మెలను ఢీకొట్టింది. బుధవారం అర్ధరాత్రి చెన్నై వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్ దిమ్మెలను ఢీకొంది. డ్రైవర్ శరత్‌కుమార్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. కారు ముందుభాగం దెబ్బతిన్నది.

సబ్‌స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు

నేడు ఒంగోలు నుంచి విద్యుత్ సరఫరా

అద్దంకి, సెప్టెంబరు 19 : గుళ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద ఉన్న 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆధునీకరణ పనుల దృష్ట్యా మేదరమెట్ల, అద్దంకిలో ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి శనివారం రాత్రి 8 గంటల వరకు ఒంగోలు 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుందని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. ఆ సమయంలో అంతరాయం ఏర్పడితే వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేదరమెట్ల : సబ్ స్టేషన్‌లో అధునీకరణ పనులలో భాగంగా ఒంగోలు వన్ లైన్‌కు సంబంధించి సర్క్యూట్ బ్రేకర్‌ను మార్చుతున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి శనివారం రాత్రి 8గంటల వరకు ఒంగోలు నుంచి మేదరమెట్లకు విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు. ఏ సమయంలోనైనా విద్యుత్ సరఫరలో అంతరాయం ఏర్పడితే సహకరించాలని వినియోగదారులకు ఆయన కోరారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం


మాట్లాడుతున్న ఎస్ఐ రఫీ

మేదరమెట్ల, సెప్టెంబరు 19 : యువత మాదకద్రవ్యాలు, విచ్చలవిడి శృంగారంతో భవిష్యత్ నాశనమవుతుందని, వాటికి యువత దూరంగా ఉండాలని ఎస్ఐ ఎస్కే మహమ్మద్ రఫీ అన్నారు. గురువారం మేదరమెట్ల సెయింట్ ఆర్నాల్డ్స్ హైస్కూల్‌లో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే యువత, హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిబారిన పడుతున్నారని, అవగాహన లేకపోవడంవల్లే ఇలాంటి తప్పులు జరుగుతున్నాయని ఎస్ఐ అన్నారు. ఏఆర్‌టీ సెంటర్‌లో ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెల్ప్ టీఐ బీవీ సాగర్, ఐటీసీటీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఆశీర్వాదం, హెల్ప్ ఎంఈపీ రాధ, భార్గవ్, కృష్ణవేణి, దుర్గ, సువార్త, శారద పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగహన

చీరాలటౌన్, సెప్టెంబరు 19 : హెచ్ఐవీ బారినపడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పలువురు వక్తలు సూచించారు. గురువారం సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాలలో మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీఐ ప్రాజెక్ట్ డైరక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రతినిధులు సంధ్య ప్రమాదాలను ఏవిధంగా నియంత్రించాలో అవగాహన కల్పించారు. అంతేకాకుండా రోగాలబారిన పడిన వారు తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరించారు. అవగాహన పత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రతినిధులు శిరీష, గీత, విజయ్, దానమ్మ, సంకీర్తన, కళాశాల ప్రిన్సిపల్ పుష్పరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

పంగులూరు, సెప్టెంబరు 19 : స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని ఎంపీడీవో రామాంజనేయులు కోరారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఇంటితోపాటు చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించి పరిశుభ్రత చర్యలపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, నోడల్ అధికారి రామ్‌కుమార్, ఇ.ఓ.ఆర్డీ. రాంబాబు, కార్యదర్శి సునీత, రామారావు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, ఆశాలు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడి

» భయాందోళనలో స్థానికులు, పాదచారులు

» మునిసిపల్ అధికారుల చొరవతో సమస్యకు పరిష్కారం

చీరాలటౌన్, సెప్టెంబరు 19 : చీరాల పురపాలక పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల బెడదతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఇదే తరహాలో తాజాగా బుధవారం జరిగింది. దీంతో మునిసిపల్ అధికారుల చొరవతో సమస్యకు పరిష్కారం లభించింది. వివరాల్లోకి వెళితే రామనగర్ 300 కాలనీకు చెందిన జగన్ రోజు వారీ కూలీతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈక్రమంలోనే సాయంత్రం సమయంలో ఇంటికి వెళుతుండగా ఆదే ప్రాంతానికి చెందిన ఓ యజమాని వీధి కుక్క ఇతనిపై దాడి చేసింది. దీంతో స్థానికులు కుక్క బారి నుంచి అతడిని రక్షించి తీవ్రంగా గాయపడిన బాధితుడిని హాస్పిటల్‌కు తరలించారు. ఆ కుక్క ఇప్పటికే పదుల సంఖ్యలో దాడులకు పాల్పడినట్లు స్థానికులు చెప్తున్నారు. ఈక్రమంలో సమస్యను మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్లగా దీంతో వెంటనే ఆయన సిబ్బందిని నియమించి గురువారం కుక్కను ఇతర మండలంలోని జన సంచారంలేని ప్రాంతానికి తరలించారు. ఈక్రమంలో ఎంతోకాలంగా అవస్థలు పడుతున్న స్థానికులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సోషల్ ఆడిట్‌పై గ్రామ సభ

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 19 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకానికి సబంధించి జరిగిన పనులపై గురువారం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో సోషల్ ఆడిపై ప్రజా వేదికగా గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ఏటీ ఈశ్వర్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, బాపట్ల క్లస్టర్ ఏడీఏ సువార్త, హెచ్‌ఆర్ మేనేజర్ చంద్ర శేఖర్, సోషన్ ఆడిట్ సిబ్బంది, ఏపీవో బుల్లియ్య, ఈసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డకు ఆరోగ్యం


పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న సీడీపీవో

అద్దంకిటౌన్, సెప్టెంబరు 19 : గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకున్నప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో ఏ కృష్ణకుమారి అన్నారు. గురువారం మండలంలోని గోవాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, రక్తహీనత, తీసుకోవలిసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీడీపీవో మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకురలతో పాటు కేంద్రంలో అందించే పాలు, గుడ్లు, బాలసంజీవని కిట్ ఆహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.ఇందిరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.రాధ, జి.సుశీల, జ్యోతి, మౌనిక, ఏఎన్ఎంలు, ఆశాలు, ఉపాధ్యాయులు కె.శిరీషా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్రిడ్జికి ఇరువైపులా కోత

» ప్రమాదకరంగా మారిన రోడ్డు

» బస్తాలు వేసి చేతులుదులుపుకున్న అధికారులు


గంగవరం రోడ్డులో ఉంచిన బస్తాలు

ఇంకొల్లు, సెప్టెంబరు 19 : ఇంకొల్లు నుంచి గంగవరం ఆర్అండ్‌బీ రహదారిలో వాగుపై ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. నాలు గైదు సంవత్సరాలుగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాం దోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలోనే విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. రోజూ 2వేల మంది విద్యార్థులు, 10 గ్రామాల ప్ర జలు రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు 100 మీటర్ల మేర రోడ్డు కోతకు గురి కావడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన చెందు తున్నారు. ఈ ప్రాంతంలో అధికారులు కేవలం బస్తాలను ఏర్పాటు చేసి చేతులు దుపులుకున్నారు. బస్తాలతో ప్రమాదాలు ఆగుతాయా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

మురుగు కదిలే దారేది

» ఇంకొల్లులో కానరాని స్వచ్ఛ కార్యక్రమాలు

» కాలువల్లో చెత్త ,చిల్లచెట్లు

» ఆందోళనలో ప్రజలు


గొల్లపాలెం రోడ్డులో ప్రధాన మురుగు కాల్వ, ప్రధానకూడలి వద్ద పూడిపోయిన కాలువ, చిల్లచెట్లతో ముందుకు కదలని మురుగు

ఇంకొల్లు, సెప్టెంబరు 19 : స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ప్రకటనలకే పరిమితమైందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇంకొల్లులో ప్రచారం తప్ప పారిశుధ్య పనులు చేపట్టిన దాఖలాలు లేవని, మురుగు కాలువల నుంచి వచ్చే కంపుతో నరకం చూస్తున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నా ఇంకొల్లులో మురుగు కాలువల వైపు చూసే వారే లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి మురుగు కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. కాలువల్లో పూడిక తీయక ఎక్కడి మురుగు అక్కడే ఉంది. కొన్ని కాలువల్లో చిల్లచెట్లు కూడా పెరిగిపోయి నీరు పారే పరిస్థితి లేదు. వైసీపీ పాలనలో కాలువలను బాగుచేసిన పాపాన పోలేదని స్థానికులు చెప్తున్నారు. ప్రధాన కాలువల్లో చెత్తాచెదారం తీయకపోవడంతో దోమలబెడద ఎక్కువైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న క్రమంలో ఎప్పుడు ఏం రోగాలు వస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అన్ని మురుగుకాలువలను శుభ్రం చేయడంతోపాటు పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన అధికారి హన్మంత్‌నాయక్

23లోపు ఈ-పంట నమోదు చేసుకోవాలి

బల్లికురవ, సెప్టెంబరు 19 : ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు 23వ తేదీలోపు ఈ-పంట నమోదు చేసుకోవాలని మార్టూరు సబ్ డివిజన్ అధికారి హన్మంత్‌నాయక్ కోరారు. గురువారం మండలంలోని మల్లాయపాలెం, కొప్పెరపాలెం, వల్లాపల్లి, ముక్తేశ్వరం గ్రామాలలో రైతులు సాగు చేసిన పంటలను ఉద్యాన అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వం ద్వారా అందే రాయితీలు పంటలకు వర్తించవని వివరించారు. వెంటనే మిర్చి, అరటి, బొప్పాయి వంటి ఉద్యాన వన పంటలు సాగు చేసిన రైతులు గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో ఉన్న సిబ్బందితో పంట నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు.

దాతల సహకారంతో బేబీ ఫీడింగ్ రూం



ఇంకొల్లు, సెప్టెంబరు 19 : ఇంకొల్లు బస్టాండ్ ఆవరణలో గ్రామానికి చెందిన దాత పాలేరు రామకృష్ణ తన తండ్రి పాలేరు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం బేబీ ఫీడింగ్ రూంను ఏర్పాటు చేసారు. ఆర్టీసీ అధికారుల అనుమతితో బస్టాండ్ ఆవరణలో చంటి బిడ్డలకు తల్లులు పాలు ఇచ్చే గది నిర్మాణానికి సుమారు రూ.లక్షపైగా ఖర్చు చేసారు. ఇందులో సోఫా, ఫ్యాన్ సౌకర్యాలు ఏర్పాటు చేసారు. ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదగా ఈ రూం ప్రారంభించేందుకు సిద్ధం చేశారు.


మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి

ప్రజారోగ్యంతో చెలగాటమాడితే చర్యలు

చీరాలటౌన్, సెప్టెంబరు 19 : సీవేజ్ వాటర్‌ను ప్రభుత్వ నియమ నిబంధనలకు భిన్నంగా డంప్ చేసినట్లయితే శాఖాపరమైన చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి హెచ్చరించారు. డీస్లడ్జింగ్ వాహనదారులతో గురువారం కమిషనర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు రోజువారీ సేకరించే సీవేజ్ వాటర్‌ను ప్రభుత్వ నిబంధనల ప్రకారం రామాపురంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీపీలో మాత్రమే డంప్ చేయాలని సూచించారు. వివరాలకు ప్లాంట్ ఏజెన్సీ ఇంచార్జి చంద్ - 63024 92122, ఆఫీస్ ఇన్‌చార్జి పులి ఉదయ్ - 798128196 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్‌లు, వాహనదారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్‌కు రైతు సంఘం వినతి

ఇంకొల్లు, సెప్టెంబరు 19 : రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేసారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ సమస్యలతో సంబంధం లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించాలని, కౌలు రైతులకు కార్డులతో పాటు రాయితీలను అందించాలని ఆ వినతిపత్రంలో కోరారు. చివరి భూములకు సాగునీరు అందించేలా చూడాలని, ఎరువుల కొరత లేకుండా అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు,మండల అధ్యక్షుడు నార్నె సింగయ్యనలతోటి భానురైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

స్వర్ణ (పర్చూరు), సెప్టెంబరు 19 : విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యంపై రైతులు తప్పక అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ ఎస్.మోహనరావు అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామంలో రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన శుద్ధి వలన కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు.

అవసరానికి మించి ఎరువులను వాడకూదన్నారు. సాగుచేసే ప్రతి రైతు ఈకేవైసీ ద్వారా పంట నమోదును చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్ దుర్మరణం

» కారంచేడు మండలం దగ్గుబాడు వాసి

» ఎల్‌టీ డబుల్ ఫీడింగ్ లైన్‌పై అవగాహన లోపంతోనే ప్రమాదం


సుమంత్ మృతదేహం

రామకృష్ణాపురం(చీరాలటౌన్), సెప్టెంబరు 19 : విద్యుత్ మరమ్మతులలో అవగాహనలోపంతో కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. ఈ ఘటన చీరాల మండలం రామకృష్ణాపురంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం కారంచేడు మండలం దగ్గుబాడుకు చెందిన గానుగపాటి ప్రసాద్ మేరీ దంపతులకు సుమంత్(20) రెండవ కుమారుడు. వీరిది వ్యవసాయ కుటుంబం. సుమంత్ ఐటీఐ పూర్తి చేసి కాంట్రాక్ట్ పద్ధతిలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. బుధ, గురువారాల్లో రామకృష్ణాపురంలో జరుగుతున్న మరమ్మతులకు ఎనిమిది మందితో కలిసి హాజరయ్యాడు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం వరకు పనులు చేశారు. అయితే చివరి సమయంలో బొడ్డురాయి సమీపంలో ఎల్‌టీ లైన్‌లో జంపర్ కొట్టేందుకు అవగాహన లోపంతో డబుల్ ఫీడింగ్ లైన్‌కు సం బంధించిన స్తంభం ఎక్కాడు. దీంతో రెండు చేతులకు షాక్ తగిలి స్తంభం పై నుంచి జారి పక్కనే ఉన్న గోడపై పడ్డాడు. దీంతో సమాచారం అందుకున్న విద్యుత్ ఏడీఈ తోట శ్రీనివాసరావు తన కారులో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.



జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కుమారి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 19 : స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఏపీ కుమారిని నియమించినట్లు ఆ శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇప్పటివరకు రిజిస్ట్రార్‌గా పనిచేసిన బాలంజనేయులు ఒంగోలుకు బదిలీ అయిన విషయం విదితమే. ఆయన గురువారం రిలీవ్ అయ్యారు. దీంతో ఆ స్థానంలో కుమారిని ఇన్‌చార్జిగా నియమించినట్లు డీఐజీ పేర్కొన్నారు. విజయనగరం నుంచి బదిలీపై వచ్చిన కుమారి జిల్లా మార్కెట్ వ్యాల్యూ-ఆడిట్ రిజిస్ట్రార్‌గా బుధవారం నియమితులైన విషయం తెలిసిందే.



తిరుమలలో శ్రీవారి లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు వినియోగించారని తెలియడంతో జిల్లావాసులు విస్తుపోయారు. అప్పటి వైసీపీ పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వును కలపడం జాతి ద్రోహమని, ఇందుకు కారకులపై తక్షణం చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతలూ అప్పటి పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసాదం తయారీలో వెలుగుచూసిన అంశాలపై సీబీఐతో విచారణ జరపాలని కాంగ్రెస్ నాయకులూ పట్టుబట్టారు.

ఆ దేవదేవుడి లడ్డూనే కల్తీనా!?

- తయారీలో జంతువుల కొవ్వును కలపడమా!?
- విస్తుపోతున్న జిల్లా ప్రజానీకం
- కమలనాథుల ఆగ్రహం.. జేసీకి వినతి
- మండిపడ్డ టీడీపీ నేతలు

ప్రతిష్టను దెబ్బతీశారు!

- టీడీపీ నేత కోటంరెడ్డి ఆగ్రహం

నెల్లూరు (వ్యవసాయం) : హిందువులు పరమ పవిత్రంగా భావించే తిరుమల ప్రతిష్టను గత వైసీపీ పాలకులు దెబ్బతీశారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో కోటంరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కల్తీ నూనెతో తిరుమల లడ్డూను తయారు చేశారన్న చంద్రబాబు వ్యాఖ్యలు అక్షరాల సత్యమని అన్నారు. వైఎస్. జగన్మోహన్ రెడ్డిపాటులో ఆయన కుటుంబ సభ్యులను వెంకటేశ్వర స్వామి క్షమించడని ఆగ్రహం వ్యక్తం చేశారు.



సీబీఐ విచారణ వేయాలి : కాంగ్రెస్

నెల్లూరు (సాంస్కృతికం) : తిరుమల లడ్డూ కల్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి నిజనిర్ధారణ కోసం సీబీఐ విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమలను వైసీపీ, తెలుగుదేశం పార్టీలు రాజకీయాలకు వాడుకుంటున్నాయని, దీనిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. జంతువుల కొవ్వులతో లడ్డూ ప్రసాదం తయారీ వంటి విషయాలపై నిగ్గు తేల్చేందుకు సీబీఐ లేదా జ్యుడీషియల్ కమిటీని తక్షణం వేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం టీటీడీకి అవసరమైన నెయ్యిని ఈ కంపెనీ సరఫరా చేస్తోందో ఆ వ్యవహారాలన్నీ బయటపెట్టాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జేసీ కార్తీక్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ఇది జాతిద్రోహం : బీజేపీ

నెల్లూరు(హరనాథపురం) : హిందువుల ఆరాధ్యదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వును కలపడం జాతి ద్రోహమని, ఇందుకు కారకులపై తక్షణం చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ లడ్డూ కల్తీ అంశమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనతో స్వామివారి భక్తుల విశ్వాసాలు దెబ్బతిన్నాయని చెప్పారు. తిరుమలలో అపవిత్రం జరగటంపై కోట్లాది మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రకటనతో సరిపెట్టకుండా ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టి కల్తీకి పాల్పడ్డ వారిపై కఠినమైన కేసులు నమోదు చేయాలని కోరారు. బీజేపీ నమామిగంగే ప్రాజెక్టు రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో హిందువుల మనోవిశ్వాసాలపై దెబ్బ కొట్టిన వారు ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

2047 విజన్ డాక్యుమెంటు రూపకల్పనలో వృద్ధి చోదకాలు

అధికారులకు కలెక్టర్ ఆదేశం

నెల్లూరు(హరనాథపురం) : స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటు రూపకల్పనతో జిల్లాలో ముఖ్యమైన రామాయపట్నం, కృష్ణపట్నంపోర్టులతోపాటు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, టెంపుల్ టూరిజం తదితర వృద్ధి చోదకాలను పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఆ డాక్యుమెంటు తయారీపై రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ స్థిరమైన సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు సృష్టించడం, తద్వారా ఉపాధి అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పశ్చిమ ప్రాంతం హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు అవసరమైన వివరాలను డాక్యుమెంటులో పొందుపరచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు విధిగా నివేదికలు తయారు చేసి జిల్లా ప్రణాళిక అధికారికి అందచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, సీపీఓ రాజు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై...

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించి పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమలుతోపాటు లబ్ధిదారులకు పీఎంఈజీపీ రుణాలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఏపీఐఐసీ జెడ్ఎం శేఖర్‌రెడ్డి, డీజెడ్ఎం వెంకటసురేష్, పొల్యూషన్ అధికారి రాజశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.


అందుబాటులో ఇసుక

జిల్లావాసులకు ఇబ్బందులు లేకుండా ఇసుకను అందిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. గురువారం ఏపీ శాండ్ పోర్టల్‌ను ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇసుక లభ్యత గురించి కలెక్టర్ వివరిస్తూ ప్రస్తుతం డీసిల్టేషన్ ద్వారా సేకరించి 30 వేల టన్నుల ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అక్టోబరు 15 నుంచి పల్లిపాడు, మినగల్లు, విరువూరు, పడమటికంబంపాడు రీచ్‌ల ద్వారా కూడా ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. రూ.380 ఉన్న టన్ను ఇసుకను తగ్గించి రూ.350లకే అందజేస్తున్నట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఇసుకను అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వదల బొమ్మాళీ.. నిన్నొదలా..! అంటూ పలువురు వివాదాస్పద అధికారులు జిల్లాను వీడనంటున్నారు. నాడు వైసీపీ నేతల ఆదేశాలే శిరోధార్యంగా భావించి ఇష్టానుసారంగా వ్యవహరించిన సదరు అధికారుల మూలంగా ప్రజలకు కష్టాలతోపాటు ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లింది. అలాంటి అధికారులు ప్రభుత్వం మారినా మళ్లీ జిల్లాలోనే తిష్ట వేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. సిఫారసు లేఖల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీలోగా జిల్లాస్థాయి అధికారుల బదిలీలు ఉంటాయన్న ప్రచారం నడుస్తోంది. ఈలోపు వీలైనంత ఎక్కువ లేఖలు సంపాదించే పనిలో వివాదాస్పద అధికారులు నిమగ్నమయ్యారు.



వదల బొమ్మాళీ.. వదలం!

- జిల్లాను దాటనంటున్న వివాదాస్పద అధికారులు
- గత ప్రభుత్వంలో నేతల ఆదేశాలతోనే విధులు
- ఈ ప్రభుత్వంలోనూ కొనసాగేందుకు ప్రయత్నాలు
- కీలక పోస్టుల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు

> 'విధిలేని పరిస్థితుల్లో గతంలో పాలకులు చెప్పినట్టు చేశాం. అవేమీ మనసులో పెట్టుకోకండి. ఇప్పుడు మీరు ఏం చెప్పినా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము. ఆ పోస్టు కోసం మీరు సిఫారసు లేఖ ఇవ్వండి చాలు.'
> - ఎమ్మెల్యేలకు కొంతమంది అధికారుల వేడుకోలు

నెల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది అధికారులు పరిధి దాటి వ్యవహరించారు. చాలా మంది ఇప్పటికీ కీలక పోస్టుల్లో కొనసాగుతుండగా వారు మళ్లీ మరో కీలకమైన పోస్టులోకి మారేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అదే సమయంలో పక్క జిల్లాల్లో వైసీపీ భక్తులుగా పేరుగాంచి వివాదాలకు కేరాఫ్‌గా నిలిచిన అధికారులు కూడా జిల్లావైపే తొంగి చూస్తున్నారు. ప్రస్తుతం ఓ కీలక పోస్టులోని అధికారి దాదాపు నాలుగేళ్ల నుంచి ఇక్కడే ఉన్నారు. ఎన్నికల సమయంలో కూడా బదిలీ కాకుండా ఆ పోస్టుకున్న ఎన్నికల విధులను మరోపోస్టుకు మార్పించారు. సదరు అధికారిపై వైసీపీ ప్రభుత్వంలో అనేక ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు డ్వామా పీడీగా చేరేందు ఆ అధికారి ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలానే కొన్నేళ్లుగా జిల్లాలోనే ఉంటూ ఇప్పుడు మరో కీలక పోస్టులో ఉన్న మరో అధికారిపై కూడా అనేక విమర్శలు ఉన్నాయి. ఆ అధికారికి తొలుత నుడా వీసీ పోస్టును ఆశించినా కొందరు ఎమ్మెల్యేలు ఒప్పుకోలేదు. దీంతో ఎలాగైనా ఏదో ఒక పోస్టులో జిల్లాలోనే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఐటీడీఏ పీవో పోస్టుకు సిఫారసు లేఖలు సంపాదించే పనిలో ఉన్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో వివిధ పోస్టుల్లో పనిచేసి వివాదాలకు కేరాఫ్‌గా మారిన మరో అధికారి ఇప్పుడు డీఆర్‌డీఏ పోస్టు కోసం శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ అధికారిపై నాడు దివ్యాంగులు ఆరోపణలు చేయడంతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం గమనార్హం. గతంలో జిల్లాలో పనిచేసి ఆ తర్వాత ప్రకాశం జిల్లాలో కీలకమైన పోస్టులో పనిచేసి వైసీపీ వీరభక్తుడిగా పేరు సంపాదించుకున్న మరో అధికారి ఇప్పుడు జిల్లాలో కీలకమైన డీపీవో పోస్టుకు ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. 'ప్రకాశం'లో నాడు టీడీపీ నేతలే సదరు అధికారి తీరుపై హైకోర్టు వరకు వెళ్లడంతో ఎన్నికల విధులకు దూరమయ్యారని సమాచారం. ఇరిగేషన్ శాఖలో అత్యంత వివాదాస్పదమైన ఓ డివిజన్‌లో పనిచేస్తున్న అధికారిపై అనేక విమర్శలు, ఆరోపణలు ఉన్నాయి. ఆ అధికారి ఇప్పుడు మళ్లీ జిల్లాలోని మరో కీలకమైన డివిజన్‌కు వెళ్లేందుకు లాబీయింగ్ చేస్తున్నారు. ఇలా అనేక మంది జిల్లా, డివిజన్ స్థాయి వివాదాస్పద అధికారులు మళ్లీ కీలక పోస్టులు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

సిఫారసుల కోసం పరుగు

గత ప్రభుత్వంలో వైసీపీ భక్తులుగా పనిచేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇటువంటి అధికారులకు కీలక పోస్టులు కట్టబెట్టకుండా గత ప్రభుత్వంలో వివక్షకు గురైన అర్హత కలిగిన అధికారులకు కీలక పోస్టులు అప్పగించాలని నిర్ణయించింది. అయితే కొందరు వివాదాస్పద అధికారులు ఈ కంచెను ఛేదించి ఎలాగైనా మళ్లీ కీలకపోస్టులో కూర్చోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యేల సిఫార్సుల కోసం వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే, వారి గురించి తెలిసిన కొందరు ఎమ్మెల్యేలు మాత్రం లెటర్లు ఇవ్వడం లేదు. మరికొందరి నుంచి మాత్రం వేర్వేరు మార్గాల ద్వారా లెటర్లు సంపాదించుకుంటున్నారు. ఈ లెటర్లు తీసుకొని పలానా ఎమ్మెల్యే లెటర్ ఇచ్చారు.. మీరు కూడా లెటర్ ఇవ్వండి ప్లీజ్ అంటూ మరో ఎమ్మెల్యే వద్దకు వెళ్లి మాయ చేస్తున్నట్లు అధికార వర్గాల్లో చర్చించుకుంటున్నారు. ఈ నెల 22వ తేదీతో బదిలీల ప్రక్రియ ముగుస్తుంది. ఆ వెంటనే జిల్లా స్థాయి అధికారుల బదిలీలు ఉంటాయన్న ప్రచారం నడుస్తోంది. ఈలోపు వీలైనంత ఎక్కువ మంది లెటర్లు సంపాదించే పనిలో వివాదాస్పద అధికారులు నిమగ్నమయ్యారు. ఈ వ్యవహారం ఇప్పుడు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



'లెక్కల మాస్టారు'ను తప్పించాల్సిందే!

- సైన్స్ బాధ్యతలను సైన్స్ టీచర్‌కే ఇవ్వాలి
- స్కూల్ కాంప్లెక్స్‌లలో తీర్మానం
- సంతకాలు సేకరిస్తున్న వైనం

నెల్లూరు (విద్య) : సైన్స్ కేంద్రం ఇన్‌చార్జిగా, జిల్లా సైన్స్ అధికారి (ఇన్‌చార్జి)గా నియమించిన లెక్కల మాస్టారును వెంటనే తప్పించాలని జిల్లావ్యాప్తంగా సైన్స్ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'లెక్కల మాస్టారుకు సైన్స్ బాధ్యత లు' అన్న కథనంపై జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులంతా స్పందించారు. నిబం ధనలు గాలికి వదిలి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న జిల్లా విద్యా శాఖ అధి కారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్‌లలో సమావేశాలు నిర్వహిస్తూ పలు తీర్మానాలు చేశారు. జిల్లా సైన్స్ బాధ్యతలను సైన్స్ ఉపాధ్యాయులకే అప్పగించాలని, రాజకీయ ప్రలోభాలకు తలొగ్గి సైన్స్‌కు సంబంధం లేని వ్యక్తులను నియమించడం సరికాదని తెలిపారు. దీనిపై జిల్లాలోని 1200 మంది సైన్స్ ఉపాధ్యాయులంతా ఏకమై సంతకాల సేకరణ చేపడుతున్నారు. నెల్లూరులో నివాసం ఉంటూ రాపూరు మండలం జడ్పీ పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ గణితం మాస్టార్‌ను ఎలా నియమిస్తారంటూ ఉన్నతాధికారులకు మెసేజ్‌ల రూపంలో, నివేదికల రూపంలో అందచేస్తున్నారు. లెక్కల మాస్టార్ తనకున్న పలుకుబడితో ఓ ప్రజా ప్రతినిధి అనుమతి లెటర్ తీసుకెళ్లి డీఈఓకు ఇవ్వడంతోపాటు డీఈఓకు చెప్పించుకుని మరీ జిల్లా సైన్స్ కేంద్రం ఇన్‌చార్జిగా ఉత్తర్వులు సాధించుకోవడం అన్యాయమన్నారు. మరో రెండు రోజుల్లో సంతకాల సేకరణ పూర్తయిన వెంటనే అర్జీలను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు, డీఈఓకు అందచేయనున్నట్లు సైన్స్ ఉపాధ్యా యులు తెలిపారు. దీనిపై వెంటనే నిర్ణయం తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.



టీడీపీలో చేరిన కార్పొరేటర్లతో మంత్రులు నారా లోకేష్, నారాయణ

టీడీపీలోకి మరో 14 మంది కార్పొరేటర్లు

నెల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరం నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఇటీవల పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నేతలు టీడీపీ కండువాలు కప్పుకోగా తాజాగా మరో 14 మంది కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం అమరావతిలో మంత్రి పొంగూరు నారాయణ సమక్షంలో వీరందరికీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నుడా మాజీ చైర్మన్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నేత ముక్కాల ద్వారకానాథ్‌తో పాటు కార్పొరేటర్లు సంక్రాంతి అశ్విని, ప్రత్యూష, రవిచంద్ర, ఎం మస్తానమ్మ, కిన్నెర ప్రేమ్‌కుమార్, గోతం అరుణ, కర్తం ప్రతాప్‌రెడ్డి, జీ వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పొట్లూరు రామకృష్ణ, షేక్ ఇంతియాజ్, వి రాజేశ్వరి, కాయల సాహిత్య, షేక్ షఫియా బేగం, కోఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్‌లు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. కాగా, ఇప్పటివరకు నగర నియోజకవర్గం నుంచి 23 మంది, రూరల్ నుంచి 20 మంది అధికారికంగా టీడీపీలో చేరారు. కార్పొరేషన్‌లో 54 మంది కార్పొరేటర్లు ఉండగా, 43 మంది టీడీపీ వైపు ఉన్నారు. కాగా టీడీపీలో చేరిన కార్పొరేటర్లు మాట్లాడుతూ నెల్లూరు నగరాభివృద్ధే తమకు ప్రధానమని, అది మంత్రి నారాయణతోనే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి కూడా ఉన్నారు.



కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వ్యవసాయ సహాయకులకు శిక్షణ

కందుకూరు, సెప్టెంబరు 19: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు గురువారం నెల్లూరు జిల్లా ఆత్మ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక కృషి విజ్ఞానకేంద్రం సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఆత్మ పీడీ డాక్టరు శివనారాయణ, జిల్లా ప్రాజెక్టు మేనేజరు మాలకొండయ్యలతో పాటు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు, పలువురు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. వివిధ రకాల పంటలలో సమగ్ర సస్యరక్షణకు రైతులకు అందించాల్సిన సలహాలు, సూచనలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకుని సేంద్రియ ఎరువులు వాడకంతో భూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు మారుతీదేవి, ముత్యాల శేషగిరి, అనసూయ, ఇఫ్కో మేనేజరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు బీసీజీ టీకా తప్పనిసరి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 19: క్షయ నిర్మూలనకు అర్హులైన ప్రతిఒక్కరూ బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య వైద్యాధికారి వెంకటసుబ్బయ్య, క్షయ యూనిట్ పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం నేలటూరు, కృష్ణంపల్లి సచివాలయాల పరిధిలో జరుగుతున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ టీకా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ క్లీనర్ సీహెచ్‌వో జ్యోతిషరాణి, ఏఎన్‌ఎంలు జమీలా, షర్మిల, ఆరోగ్య సహాయకుడు చంద్రమౌళి, ఆశ శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

కలువాయి, సెప్టెంబరు 19 : ఉపాధిహామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుపై రైతులకు డ్వామా ఇన్‌చార్జ్ పీడీ శ్రీనివాసులు గురువారం అవగాహన కల్పించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి మండలంలో 325 ఎకరాల్లో నిమ్మ మొక్కల సాగుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. మంజూరైన వెంటనే రైతులు పనులు చేపట్టి సాగు చేసుకోవాలని పీడీ రైతులకు సూచించారు. నిమ్మ సాగుకు ఎకరాకు మూడేళ్లకు రూ.1.14లక్షలు ఉపాధి నిధులు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ప్లాంటేషను ఏపీడీ మృదుల, ఏపీవో మురళీ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 19: కృష్ణంపల్లి, శకునాలపల్లి గ్రామాల్లో మొక్క జొన్న, సజ్జ పంటలను గురువారం వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పిం చారు. రైతుసేవా కేంద్రాలను పరిశీలించి రికా ర్డు లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, సెప్టెంబరు 19: వీఆర్.కోట మన్నేరువాగు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ సుబానీ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముందస్తు సమాచారంతో అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదానం

కావలి టౌన్, సెప్టెంబరు 19: ప్రధాని మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా బీజేపీ నాయకులు గురువారం శ్రీసాయి డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్య క్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్‌కుమార్, నేతలు బ్రహ్మానందం, రంగారెడ్డి, సీవీసీ సత్యం, వెంకటేశ్వర్లు, మాధవిరెడ్డి, బెల్లంకొండ మాల్యాద్రి, మందా కిరణ్, సుందర్‌శెట్టి సుజయ్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 70/2023 O.S. No. 93/2015
శెట్టేటి లక్ష్మీదేవి W/o సుబ్బారెడ్డి, హిందూ, వయస్సు సుమారు 60 సం. రంగసముద్రం గ్రా., పో., పోరుమామిళ్ళ మం., వైఎస్ఆర్ కడపజిల్లా ప్రస్తుతం నివాసం H.No. 206, D.No. 19/8/116/9A, SBI కాలనీ, తిరుపతిటౌన్, బాలాజీ జిల్లా - పిటిషనరు / Dhr
V/s
1) పంది నడిపి గులివిరెడ్డి పోతి వారసులు, 2) పంది వెంకటలక్షమ్మ భర్త పంది నడిపి గులివిరెడ్డి, 3) పంది మంజునాథరెడ్డి తండ్రి లేట్ పంది నడిపి గులివిరెడ్డి, 4) పంది గులివిరెడ్డి తండ్రి లేట్ పంది నడిపి గులివిరెడ్డి అందరిది సాకిన్ మెయిన్‌రోడ్, Opp. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోరుమామిళ్ళ మండలం, వైఎస్ఆర్ కడపజిల్లా, 5) పాటూరి ఉమాదేవి తండ్రి లేట్ పంది నడిపి గులివిరెడ్డి, భర్త పాటూరి రామసుబ్బారెడ్డి, మడకలవారిపల్లె గ్రా., బద్వేల్ మున్సిపాలిటీ, వైఎస్ఆర్ కడపజిల్లా, 6) పంట లక్ష్మీదేవి తండ్రి పంది నడిపి గులివిరెడ్డి భర్త పంట మహేశ్వరరెడ్డి, వయస్సు 38 సం., కంభం పాడు గ్రా., పో. SPSR నెల్లూరు జిల్లా - రెస్పాండెంట్స్ / J.Drs
పై నెంబరు పిటిషన్‌ను రాజశ్రీ కోర్టులో 1వ J.Dr చనిపోయినందున అతని వారసులైన రెస్పాండెంట్స్/J.Drsలు 2 నుంచి 6వ వరకు అను వారి మీద 1వ రెస్పాండెంట్ (J.Dr) చనిపోయినందున అతనికి సంబంధించిన షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేసి సదరు వేలం వేయగా వచ్చిన మొత్తము నుండి E.P. అమౌంట్ 2,99,269/-లు వసూలు నిమిత్తమై దాఖలు చేయడమైనది. సదరు పిటిషన్‌లో 6వ రెస్పాండెంట్ అయిన పంట లక్ష్మీదేవి అయిన మీకు ఏమైనా అక్షేపణలున్న యెడల 25-9-2024వ తేది ఉదయం 10.30 గంటలకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలసినది. లేనంతట మీ పరోక్షముగా పిటిషన్‌ను తీర్మానించబడును. షెడ్యూలు:- కడప డి. ప్రొద్దుటూరు ఆ.డి. (ప్రస్తుతం కడప ఆ.డి.) బద్వేలు సబ్ డి. పోరుమామిళ్ళ మండలం రంగసముద్రం గ్రామ పంచాయితి రంగసముద్రం గ్రామ పొలం సర్వేనెం. 994లోని ప్రస్తుత డోర్ నెం. 11-290 (పాత డోర్ నెం. 11/289, 11/286 మరియు 11/143) చెక్కుబంది: తూర్పు - కడప - కంభం రోడ్డు, దక్షిణం - పంది గులివిరెడ్డి ఇల్లు, పడమర - పంది చిన్న గులివిరెడ్డి ఇల్లు, ఉత్తరం - పంది చిన్న గులివిరెడ్డి ఇల్లు.
ఎలిచెర్ల సి. ఓబుల్‌రెడ్డి
పిటిషనర్ తరపున న్యాయవాది, బద్వేలు, కడపజిల్లా

నేడే విడుదల
మీ అభిమాన థియేటర్లలో


నెల్లూరు - రైన్ సినిమాస్, గూడూరు - సుందరమహల్
కావలి - లత A/c dts, కందుకూరు - యువరాజ్
PV FILMS, Cell:83749 91228

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం

● అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటో..?

కావలి, సెప్టెంబరు 19: స్థానిక ముసునూరు అయ్యప్పస్వామి గుడి సమీపంలోని కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. ఆ స్థలం ట్రంకు రోడ్డు వెంబడే ఉండటంతో గతంలో ఎంతో మంది అక్రమార్కుల కన్ను దానిపై పడింది. ఆ స్థలంలో మట్టి తోలుతున్న వారిని అధికారులు ఆపించి ఇది ప్రభుత్వ స్థలం దీనిలో ఎవరూ ప్రవేశించినా శిక్షార్హులని పెట్టిన బోర్డు కొంతకాలం అక్కడే ఉండింది. కాలక్రమేణ ఆ బోర్డు మాయమైనా ఆ స్థలం జోలికి ఎవ్వరూ రాలేదు. అయితే ప్రస్తుతం అక్కడ ఏమి మాయ జరిగిందో తెలియదు కాని రోడ్డు పక్కనే ఉన్న ఆ స్థలంలో రేకుల షెడ్లు పక్కాగా నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. దాన్ని చూచిన ప్రజలు మొన్నటి వరకు ప్రభుత్వ స్థలంగా ఉన్న ఈ ప్రాంతం ఇంతలో ప్రయివేట్ స్థలంగా ఎలా మారింది. దీని వెనుక ఉన్న సూత్రదారులు, పాత్రదారులు ఎవరూ అని చర్చించుకుంటున్నారు. గతంలో ఎవరికైనా పట్టా ఇచ్చిఉంటే ప్రభుత్వ స్థలమని ఎలా బోర్డు పెట్టారు. ప్రభుత్వంలో ఎవరికైనా పట్టాలు ఇచ్చారా ఏమి లేకుండా అక్కడ నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు చూస్తూ ఎందుకు మౌనంగా ఉన్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ కబ్జా వెనుక భారీగా నగదు చేతుల మారాయా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.


ముసునూరు అయ్యప్ప ఆలయం పక్కన ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్లు

ప్రభుత్వ స్థలమైతే నిర్మాణాలు తొలగిస్తాం : శీనానాయక్, ఆర్డీవో

ఆ స్థలంను పరిశీలించమని అధికారులను ఆదేశించాను. ప్రభుత్వ స్థలమని నిర్ధారణ అయితే అక్కడ నిర్మించిన నిర్మాణాలను తొలగిస్తాం.

అట్టహాసంగా మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం


ఆత్మకూరు: స్కూల్ గేమ్స్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టీడీపీ నాయకులు చంద్రారెడ్డి, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 19: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ పోటీలు గురువారం ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, కౌన్సిలర్‌లు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ పోటీలకు మండలంలోని ఆరు పాఠశాలల నుంచి సుమారు వందమంది విద్యార్థులు హాజరయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**సంగం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంఈవో -2 మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య ప్రారంభించారు. మొదటి రోజు అండర్ 14, 17 విభాగంలో అథ్లెటిక్స్‌లో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. షాట్‌పుట్, జావలిన్‌త్రో, హైజంప్, లాంగ్ జంప్, పరుగుపందెం, తదితర పోటీలు నిర్వహించారు. శుక్రవారం బాలురకు, శనివారం బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్, బాల్ బాట్మింటన్ వంటి క్రీడల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈవో 2 మల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీడీ అంజయ్య, మండలంలోని పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనులందరికీ ఆధార్ కార్డులు చేయించాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

కావలి, సెప్టెంబరు 19: పట్టణ పరిధిలోని గిరిజనులందరికీ ఆధార్ కార్డులను చేయించే బాధ్యతను వెల్ఫేర్ సెక్రటరీలు తీసు కోవాలని మున్సిపల్ కమి షనర్ శ్రావణ్ కుమార్ సూచించారు. గురువారం తన చాంబర్‌లో వారితో సమావేశమై మాట్లాడారు. పట్టణంలో 323మంది ఆధార్ కార్డులు లేని వారు ఉన్నారని కలెక్టర్ కార్యాలయం నుంచి తన సమాచారం వచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై సర్వే చేయించగా 110మందికి కొత్తగా ఆధార్ చేయించగా 72మంది చనిపోయి ఉన్నట్లు గుర్తించామన్నారు. మరో 90మంది ఎక్కడ ఉన్నారో వారి వివరాలు తెలయరాలేదన్నారు. మిగిలిన వారికి ఆధార్‌కార్డులను చేయించేందుకు జనన తేదీల సమస్య రావటంతో దాన్ని అధిగమించే చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వారికి జనన సర్టిఫికెట్లు ఇప్పించి ఆధార్ చేయించాలని ఆదేశించారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

కలువాయి, సెప్టెంబరు 19: మండలంలోని మాదన్నగారిపల్లెలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గురువారం వీఆర్వో జనార్దన్, సర్వేయర్ నవీన్ పరిశీలించారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఆక్రమణలపై పూర్తిస్థాయి నివేదిక ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

కలువాయి మండల సమావేశం

కలువాయి, సెప్టెంబరు 19: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు సభకు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, జడ్పీటీసీ బి అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పంగా పెంచలనరసారెడ్డి, ఎంపీడీవో గోవర్ధన్ వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్

కందుకూరు, సెప్టెంబరు 19: మున్సిపాలిటీ పరిధిలోని పొదుపు మహిళలు (మెప్మా బజార్) ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న అర్బన్‌మార్కెట్‌ను గురువారం మున్సిపల్ కమిషనర్ అనూష సందర్శించారు. వివిధ బ్యాంకులతో తీసుకున్న రుణాలతో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తూ అర్బన్‌బజారులో ప్రదర్శించి విక్రయిస్తుండటం హర్షనీయం అన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరలకే విక్రయిస్తున్నట్లు చెప్పారు. ప్రతినెలా మూడోవారం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో ఈ అర్బన్‌మార్కెట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిబ్బంది పనితీరుపై విచారణ చేపట్టాలి

జలదంకి, సెప్టెంబర్ 19: స్థానిక ప్రాథమిక వైద్యశాల సిబ్బంది, వైద్యుల పనితీరుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డె శ్రీనాథ్‌రెడ్డి గురువారం డిమాండ్ చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతో పేదలకు ప్రయోజనం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే 24గంటల ఆసుపత్రి తప్ప వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్నారు. స్థానికులు, ప్రజాప్రతినిధుల నుండి అనేక ఫిర్యాదులు వస్తున్నా చర్యలు శూన్యమని పేర్కొన్నారు. ఇక్కడ పనిచేసే ఒక ఉద్యోగికి సరెండర్ పేరుతో 11మాసాలుగా జీతం అందడం లేదన్నారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా ఎమ్మెల్యే కాకర్ల జన్మదినం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 19: ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను టీడీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కన్వీనర్ బయ్యన్న, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్‌తో కలిసి టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో భారీ కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచి పెట్టి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకుడు చింతనబోయిన శివకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఆశ్రమంలో చిన్నారులకు భోజనం ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బీ నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహులు, సందానీ, ఓబుల్‌రెడ్డి, జీ వెంకటేశ్వర్లు, సజిల్, మట్ల రామయ్య, లక్ష్మయ్య, కాంతారావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరులో: స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. కాకర్ల మధు, చీదర్ల మల్లికార్జున, ధనాల పేరయ్య, హనుమంత నాయుడు, మండవ మధు తదితరులు పాల్గొన్నారు.

●**వరికుంటపాడు :** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను గురువారం టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషిచేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అలాంటి వ్యక్తికి ప్రతిఒక్కరూ అండగా నిలిచి మద్దతు పలికినప్పుడే మండలం కూడా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బాణాసంచా పేలుస్తూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్‌యాదవ్, వైఎస్ ఎంపీపీ దేవనబోయిన మధు, తెలుగుయువత అధ్యక్షుడు ముజ్జె లక్ష్మీనారాయణ, నాయకులు నాదిండ్ల రాజేంద్ర, తెల్లగొర్ల వెంకటయ్యయాదవ్, కొత్తులూరి మహదేవ, పొద మాధవరావు, యరగూటి మాలకొండారెడ్డి, ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, దుద్దుకూరి వెంకటరత్నం పాల్గొన్నారు.

● **సీతారామపురం:** స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సర్పంచ్ భాగ్యకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి తురక వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు చంద్రారెడ్డి, ఆదినారాయణ, భోగినేని కాశీరత్తయ్య, పెద్దగౌస్, జాషువా, రాజశేఖర్ పాల్గొన్నారు.

●**వింజమూరు:** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వరయాదవ్, గణపం సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అలాగే చాకలికొండ ఎలిమెంటరీ స్కూల్‌లో కోనల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వీట్లు పంచి పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. అన్న క్యాంటీన్‌లో బీజేపీ నాయకులు కదిరి రంగారావు ఆధ్వర్యంలో పేదలకు స్వీట్లు పంపిణీ చేశారు.

●**జలదంకి:** మండల కేంద్రంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను పోటాపోటీగా నిర్వహించారు. అన్నవరంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు పూనూరు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా పార్టీ మండలాధ్యక్షుడు, యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. అలాగే జలదంకి బస్టాండ్‌లో మండలాధ్యక్షుడు మధురెడ్డి ఆధ్వర్యంలో పాల్గొని ఒకరికొకరు కేక్‌ను తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. జలదంకిలోని నిమ్మలపల్లి శీనయ్య రైస్‌మిల్ కూడలిలో కాకర్ల అభిమాని గంటా అశోక్, జనసేన నేత రామ్‌చైతన్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే సోదరుడు కాకర్ల వెంకట్, మధుసూదనరావు, రామక్రిష్ణారెడ్డి, పెంచలయ్యనాయుడులు కేక్ కట్ చేశారు.


వరికుంటపాడు : : సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

●**కలిగిరి:** టీడీపీ మండల కన్వీ నర్ బిజ్జం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేకు కట్ చేసి టీడీపీ కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో చీమల తాతయ్య, కల్లూరు చంద్రమౌళి, జిర్రా అంకిరెడ్డి, జె మధన్‌కుమార్, చేరెడ్డి సుబ్బారెడ్డి, యర్రగుంట రమణారెడ్డి, కట్టా వెంకటేశ్వర్లు, పూసాల వెంగపనాయుడు, కేతినేని శివయ్య, స్వర్ణ కొండయ్య పాల్గొన్నారు.

●**కొండాపురం:** మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు బాణాసంచా కాల్చి కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలినేని రమేష్, పోలినేని చంద్రబాబు నాయుడు, దాసరి అశోక్, టి.లక్ష్మీనారాయణ, నర్రా చెంచునాయుడు, బద్దిపూడి మాచర్ల, సుధాకర్, ఉదయగిరి మాలకొండయ్య పాల్గొన్నారు. ఆదిమూర్తిపురంలో జాగర్లమూడి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నేతలు వేడుకలు నిర్వహించారు.

జలవనరుల శాఖ మంత్రి దృష్టికి కావలి సాగునీటి సమస్యలు


మంత్రి నిమ్మల రామానాయుడితో బీద రవిచంద్ర, ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, సెప్టెంబరు 19: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ సమస్యలపై చర్చించి నిధుల మంజూరు చేయమని కోరారు. ప్రధానంగా కావలి కాలువ, సీబీఆర్ బైపాస్ కెనాల్, డీఎం, డీఆర్ చానల్, సాగునీటి చెరువుల పరిస్థితులను మంత్రికి వివరించారు.

టీఆర్ఆర్‌లో ఆరోగ్య అవగాహన సదస్సు

కందుకూరు, సెప్టెంబరు 19: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయుర్వేద వైద్యాధికారి ఆర్వీఎస్ లక్ష్మీకుమారి, హోమియో వైద్యురాలు రత్నావళి పాల్గొన్నారు. కందుకూరు ఏరియా వైద్యశాల ఆయుష్ విభాగంలో అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఆయుర్వేద వైద్యవిధానం విశిష్టత, ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి జీవన విధానంలో తీసుకోవాల్సిన మార్పులు, పౌష్టికాహార ప్రాధాన్యత అంశాలను వివరించారు. కార్యక్రమంలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం కన్వీనర్ డాక్టరు కరుణకుమార్, అధ్యాపకులు సుజాత, షాజాన్‌బేగం, కేవీ పద్మావతి, డాక్టరు రామకృష్ణ పాల్గొన్నారు.

జీవో 85ను వ్యతిరేకిస్తూ వైద్యుల నిరసన

లింగసముద్రం, సెప్టెంబరు 19: జీవో నంబర్ 85ను వ్యతిరేకిస్తూ స్థానిక వైద్యులు నిరసన కొనసాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా పీహెచ్‌సీలో వైద్యులు ఔట్ పేషెంట్ల సేవలు, వీడియో కాన్ఫరెన్సులు, టెలీ కాన్ఫరెన్సులు బంద్ చేశారు. అత్యవసర సేవలు మాత్రమే చూస్తున్నారు. దీని వలన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే జీవో నంబర్ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ స్పందిస్తూ, అత్యవసర సర్వీసులు మాత్రమే చూస్తున్నామని, మిగతా సర్వీసులన్నీ స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్లు యధావిధిగా పని చేస్తున్నారని తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

సీతారామపురం, సెప్టెంబరు 19 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఆర్డీవో మధులత సూచించారు. స్థానిక కస్తూర్బా బాలికల విద్యా కేంద్రంలో గురువారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్‌కూలర్ బహూకరణ

లింగసముద్రం : ముత్యాలపాడు ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి పొదర్తి వెంకట లీలాకృష్ణ గురువారం రూ.20వేల వాటర్‌కూలర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా వెంకట లీలాకృష్ణను హెచ్‌ఎం శ్రీనివాసులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, వెంకట లీలాకృష్ణ తలిదండ్రులు పురుషోత్తం, వెంకట సత్యవతి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మాజీ ఎమ్మెల్యే వంటేరు

జలదంకి : మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి గురువారం స్వగ్రామం బ్రాహ్మణ క్రాక హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సర్పంచ్ ఇండ్ల సుదాకర్ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛతా హి కార్యక్రమంలో కార్యదర్శి నీరజ, ఉపసర్పంచ్ దగుమాటి మాల్యాద్రి రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు తల్లపనేని మధుసూదనరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పేదలకు వరం


అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 19: ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్‌లో రూ. 5కే కడుపునిండా భోజనం తినవచ్చునని పేదలకు ఎంతో భరోసానిస్తోందని డీసీసీబీ మాజీ చైర్మన్ ధనుంజయరెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు తాళ్లూరి గిరినాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వారు ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ పేదలకు వరమన్నారు. ఆత్మకూరులోని అన్నా క్యాంటీన్‌లో ఏడాదికి 15 రోజులకు అయ్యే ఖర్చును బొల్లినేని ట్రస్ట్ భరిస్తుందని తాళ్లూరు గిరినాయుడు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, టీడీపీ నాయకులు చల్లా రవీంద్రరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డి, టీడీపీ నాయకులు చంద్ర వెంకటసుబ్బానాయుడు, జనసేన నాయకులు నలిశెట్టి శ్రీధర్, బీజేపీ నాయకులు కె సుధాకర్‌రెడ్డి, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



చిన్నారులకు కిట్లు అందజేస్తున్న బత్తుల పద్మావతి, అధికారులు

కందుకూరు, సెప్టెంబరు 19: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. పట్టణంలోని పద్మావతి ఫంక్షన్‌హాలులో గురువారం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, వరల్డ్‌విజన్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవ వేడుకలు సీడీపీఓ శర్మిష్ఠ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహార లోపంతో తక్కువ బరువు ఉన్న 75 మంది చిన్నారులకు వరల్డ్‌విజన్ సంస్థ ద్వారా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ జేసే పౌష్టికాహార కిట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు తయారుచేసిన వివిధరకాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వరల్డ్‌విజన్ సంస్థ ప్రాజెక్టు మేనేజరు యోషయా, కేవీకే శాస్త్రవేత్త నీహారిక, వైద్యశాఖ నుంచి ఇంటూరి పద్మావతి, ఎంఈఓ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఉలవపాడు సీడీపీఓ అరుణ, పంతగాని వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

●**ఉదయగిరి రూరల్ :** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజశ్విని అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు చాంద్‌బేగం, సంజీవరాణి, సుజాత, ప్రధానో పాధ్యా యులు షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహులు, బోసు, ఆశ కార్యకర్త సలోమి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గంధమహోత్సవాన్ని నిర్వహించండి

● జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

ఏఎస్ పేట, సెప్టెంబరు 19: ఏఎస్ పేట దర్గా గంధమహోత్సవం ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని నాయబ్ రసూల్ దర్గా గురించి ఎస్‌ఐ సైదు లును అడిగి తెలుసుకుని, ఈనెల 29వ తేదీ నుంచి జరిగే దర్గా గంధ మహోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌బి డీఎస్పీ శ్రీనివాసులు ఉన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం : డీఎస్పీ

కావలి, సెప్టెంబరు 19: శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పట్టణంలో ప్రధానంగా ఉన్న ట్రాఫిక్ సమస్య నివారణకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. మున్సిపల్ అధి కారులతో కలిసి ట్రంకు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ వేసి అది దాటి రోడ్డు మీదకు ఎవరూ రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఓవర్ స్పీడ్, పెద్ద శబ్దాలతో బైక్‌లు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈవ్ టీజింగ్, క్రికెట్ బెట్టింగ్‌లు, సింగిల్ నంబరు ఆటలు ఆడే వారిపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. వ్యాపారులు, ప్రజలు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేర నియంత్రణకు సులువుగా ఉంటుందన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల అందజేత


విరాళాలను అందచేస్తున్న ఆపుస్మా నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితుల కోసం నియోజకవర్గంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన విరాళాలను స్థానిక ఆపుస్మా నాయకులు స్టేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డికి గురువారం అందచేశారు. ఆరు మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల నుంచి సేకరించిన మొత్తం రూ. 8,43,310 అందచేశారు. దీంతో ఆయన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రెసిడెంట్ కె కోటేశ్వరరెడ్డి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, జాయింట్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ ఎస్ రామమోహన్‌రెడ్డి, శాంతినికేతన్ కరస్పాండెంట్ ప్రభాకర్, ట్రెజరర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ న్యాయ సలహాదారుడిగా శివప్రసాద్‌రెడ్డి

కావలి, సెప్టెంబరు 19: స్థానిక పురపాలకసంఘ న్యాయ సలహా దారుడిగా న్యాయవాది పుల్లా వెంకటశివప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ నియామకపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ నియామకానికి జారీచేసిన నోటిఫికేషన్‌లో వచ్చిన అర్జీలను కౌన్సిల్ ఎదుట ఉంచి వారి ఆమోదం మేరకు శివప్రసాద్‌రెడ్డిని నియమించినట్లు మున్సిపల్ కమి షనర్ తెలిపారు. ఈపదవిలో మూడేళ్లు కొన సాగుతారన్నారు.

రహదారి విస్తరణ పనులకు సహకరించండి


బ్లాస్టింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత

సీతారామపురం, సెప్టెంబరు 19: మండల పరిధిలో జరుగుతున్న 167/బి జాతీయ రహదారి పనులకు రైతులు సహకరించాలని ఆత్మకూరు ఆర్డీవో మధులత కోరారు. గురువారం మండలంలోని పబ్బులేటిపల్లిలో జరిగిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ ఆరు వరసల జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయితేనే ఈప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, అందువలన రైతులు కాంట్రాక్టర్లకు సహకరించాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు తక్కువ ప్రభుత్వ సాయం అందినట్లు అనిపించినట్లయితే వెంటనే ఉన్నతాధికారులకు అర్జీ సమర్పిస్తే పరిశీలించి మెరుగైన నష్టపరిహారం ఇచ్చేలా చూస్తామని తెలిపారు. మారంరెడ్డిపల్లిలో మాన్యం భూసమస్యను పరిశీలించి ఇరు వర్గాలతో మాట్లాడారు. అనంతరం ఆరు వరుస రహదారి టన్నల్ కేంద్రాన్ని, బ్లాస్టింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు.